

ఈ సంచికతోపాటు 12 పేజీల లైఫ్ సప్లిమెంట్ అందుకోండి

ప్రభాత
వెలుగు
18.01.2019
www.v6velugu.com
శుక్రవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 332 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



జనరల్

ముంబైలో భూగర్భ మెట్రో

33 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ టన్నెళ్లు. 26 భూగర్భ స్టేషన్లు. అంచనా వ్యయం రూ.23,136 కోట్లు.

12



దేశం - విదేశం

హెచ్1బీ ఉద్యోగులకు వేధింపులు

తక్కువ జీతాలిచ్చి దోపిడీ చేస్తున్నారు. సౌత్ ఏషియా సెంటర్ ఆఫ్ ది అట్లాంటిక్ కౌన్సిల్ రిపోర్టులో వెల్లడి.

05



ప్లే

మరో చరిత్ర కోసం..

ఆస్ట్రేలియా గడ్డపై తొలి వన్డే సిరీస్ సొంతం చేసుకునేందుకు సిద్ధమైన టీమిండియా. నేడు మెల్‌బోర్న్‌లో చివరి వన్డే.

11



బిజినెస్

జెట్ గట్టెక్కుతోందా?

రూ.700 కోట్ల ఇన్వెస్ట్ మెంట్‌కు గోయల్ సిద్ధం. రిజల్యూషన్ ప్లాన్‌తో బ్యాంక్‌లు ముందుకు. జెట్ షేర్ల దూకుడు.

10



డీజిల్ దోపిడీ కోసం పైప్‌లైన్ వరకూ మూడు మీటర్ల మేర తవ్విన సొరంగం

ది గ్రేట్ ఆయిల్ రాబరీ

స్కెచ్‌వేసి.. సొరంగం తవ్వి

- ఐఓసీఎల్, బీపీసీఎల్ డీజిల్ పైప్‌లైన్‌కు కన్నం
- రూ.900 కోట్ల విలువైన 13 కోట్ల లీటర్ల చోరీ
- పైప్‌లైన్ చుట్టూ రేకులతో కాంపౌండ్ వాల్
- మూడు మీటర్ల మేర టన్నెల్ తవ్వకం
- పైప్ ఏర్పాటు చేసి ఏడు ట్యాంకర్లతో డీజిల్ చోరీ
- ప్రధాన నిందితుడు హఫీజ్‌తో పాటు నలుగురు అరెస్ట్

04



పైప్‌లైన్‌కు రంధ్రం చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైపు

కొలువుదీరిన కొత్త అసెంబ్లీ

అలయ్ బలయ్

114 మంది ఎమ్మెల్యేల ప్రమాణం

నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ కూడా..

- సభను నడిపిన ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్
- అనారోగ్యంతోనే హాజరైన దానం, సాయన్న
- రెండుసార్లు ప్రమాణం చేసిన ఆత్రం సక్కు
- తొలిరోజు 2 గంటల10నిమిషాలపాటు సభ
- ఆత్మీయ పలకరింపులు.. ఆలింగనాలతో సందడి
- కేసీఆర్‌కు పలువురు ఎమ్మెల్యేల పాదాభివందనం
- టీడీపీ సభ్యుడు సండ్ర సహా ఐదుగురు గైర్హాజరు



గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

రాష్ట్ర అసెంబ్లీ తొలి సమావేశాలు గురువారం మొదలయ్యాయి. కొత్త, పాత నేతల కలయికతో పండుగ వాతావరణం నెలకొంది. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని అలయ్ బలయ్ తీసుకున్నారు. ఎమ్మెల్యేలు కుటుంబసభ్యులతో తరలివచ్చి ఫొటోలు దిగారు. సెల్ఫీలు తీసుకున్నారు. ఉదయం 11.30 గంటలకు సమావేశాలు ప్రారంభమవగా.. ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించారు. మొత్తం 119 మంది ఎమ్మెల్యేల్లో 114 మంది ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. నామినేటెడ్ ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం దక్కించుకున్న స్టీఫెన్‌సన్ కూడా సభలో ప్రమాణం చేశారు. తొలుత సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేయగా.. అటు తర్వాత మహిళా ఎమ్మెల్యేలు, ఆపై ఆల్ఫా బెటికల్ ఆర్డర్‌లో మిగతా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం జరిగింది. రెండుగంటల పది నిమిషాల పాటు ఈ కార్యక్రమం కొనసాగింది. సభ శుక్రవారానికి వాయిదా పడగానే.. జూబ్లీహాల్‌లో ఏర్పాటు చేసిన లంచ్‌కు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. భోజన సమయంలో సీఎం కేసీఆర్ అన్ని పార్టీల సభ్యులను ఆత్మీయంగా పలకరించారు.

02



పోచారమే స్పీకర్

ఏకగ్రీవంగా ఎన్నిక.. కాంగ్రెస్, మజ్లిస్, బీజేపీ మద్దతు

- పోచారం పేరును ప్రతిపాదిస్తూ ఆరు సెట్ల నామినేషన్లు
- బలపరిచిన కేసీఆర్, భట్టి, బలాల తదితరులు
- నేడు అధికారికంగా బాధ్యతల స్వీకారం
- నాలుగు దశాబ్దాలకుపైగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం

03

అన్ని ఆస్పత్రుల్లో ఒకే ఫీజులుండాలి

సామాన్యులు భరించేలా కార్పొరేటు వైద్యం అందాలి

'వాయికాన్' సదస్సులో గవర్నర్ నరసింహన్

కార్పొరేట్ ఆస్పత్రుల్లో ప్రామాణిక ధరలు ఉండేలా విధివిధానాలు రూపొందించాలి. ఏదైనా ఓ వ్యాధికో, మెడికల్ టెస్టుకో అపోలో ఆసుపత్రికి వెళ్లినా, కిమ్స్, నిమ్స్.. ఎక్కడికి వెళ్లినా ఫీజులు ఒకేలా ఉండాలి. ఇలాంటి ఫీజుల విధానం ఉన్నప్పుడే జనాలు దోపిడీకి గురికారు. సామాన్యులు భరించే స్థాయిలో వైద్య సేవలు ఉన్నప్పుడే సమాజానికి మంచి జరుగుతుంది.

04

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
87.00	87.00	87.00
కరీంనగర్	నిజామాబాద్	ఖమ్మం
88.00	87.00	86.00

రాహుల్ జీ, మీరే డిసైడ్ చేయాలె

సీఎల్పీ లీడర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీర్మానం

కాంగ్రెస్ శాసన సభాపక్ష నేత ఎంపిక బాధ్యతను హై కమాండ్‌కు అప్పగిస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏకవాక్య తీర్మానం చేశారు. రాహుల్ గాంధీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, ఎవరిని ఎంపిక చేసినా తమకు అభ్యంతరం లేదని మెజార్టీ ఎమ్మెల్యేలు తెలిపారు. తీర్మానాన్ని గురువారం ఏఐసీసీ చీఫ్ రాహుల్ గాంధీకి పంపించారు.

02




గురువారం పీసీసీ చీఫ్ ఉత్తమ్‌తో కలిసి అసెంబ్లీకి వస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



కుంభమేళాలో కోవిందుడు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న అర్ధకుంభ మేళా మూడో రోజుకు చేరింది. గురువారం ఈ మహా వేడుకలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌దంపతులు పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు సాధువులను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. రాష్ట్రపతి కుంభమేళాలో పాల్గొనడం 66 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. 1953లో తొలిసారి రాష్ట్రపతి హోదాలో బాబూ రాజేంద్రప్రసాద్ ఈ వేడుకలో పాల్గొన్నారు. దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వికాసంలో కుంభమేళాకు ముఖ్యమైన స్థానం ఉందని రామ్‌నాథ్ అన్నారు.



సభలో సీఎం కేసీఆర్, పీసీసీ చీఫ్ ఉత్తమ్ షేక్ హ్యాండ్





గురువారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్, హోం మంత్రి మహమూద్ అలీ, ఇతర టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

కొలువుదీరిన కొత్త అసెంబ్లీ

తొలి ప్రమాణం కేసీఆర్‌దే



అసెంబ్లీలో సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్. ప్రమాణ స్వీకారం చేస్తున్న కేటీఆర్, ఉత్తమ్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్ర రెండో అసెంబ్లీ గురువారం కొలువుదీరింది. అసెంబ్లీ హాల్‌లో కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా కొనసాగింది. ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణం చేయించారు. మొదట సీఎం కేసీఆర్‌తో, ఆ తర్వాత మహిళా ఎమ్మెల్యేలు రేఖా నాయక్, అనసూయ ధనసరి అలియాస్ సీతక్క, గొంగిడి సునీత, హరిప్రియ నాయక్, పద్మా దేవేందర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి ప్రమాణం చేశారు. ఆపై ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో మిగతా ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. మొత్తం 119 మంది ఎమ్మెల్యేల్లో గురువారం 114 మంది ప్రమాణం చేయగా.. టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, టీఆర్ఎస్ సభ్యుడు మాధవరం కృష్ణారావు, ఎంఐఎం సభ్యులు అక్బరుద్దీన్ ఒవైసీ, జాఫర్ హుస్సేన్, బీజేపీ సభ్యుడు రాజాసింగ్ గైర్హాజరయ్యారు. వీరంతా త్వరలో స్పీకర్ సమక్షంలో ప్రమాణం చేయనున్నారు. ఎక్కువ మంది తెలుగులో, కొందరు ఇంగ్లిష్‌లో, ఉర్దూలో ప్రమాణం చేశారు. చివరగా బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రమాణం చేశారు. నామినేటెడ్ ఎమ్మెల్యేగా ఎల్వీ స్టీఫెన్‌సన్‌కు మరోసారి అవకాశం దక్కడంతో ఆయన కూడా ప్రమాణం చేశారు. సభ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.40 గంటల వరకు కొనసాగింది. ప్రమాణ స్వీకారాలు ముగియగానే సభను ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ శుక్రవారం 11 గంటలకు వాయిదా వేశారు. తొలిరోజు అసెంబ్లీ సమావేశాలు రెండు గంటల పది నిమిషాలపాటు జరిగాయి. సమావేశాలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

ఎవరెలా చేశారంటే..

మొదటగా ఉదయం 11.35 గంటలకు సీఎం కేసీఆర్ తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. సీతక్క, అంజయ్య యాదవ్, రసమయి బాలకిషన్, దుర్గం చిన్నయ్య, ఈటల రాజేందర్, జి.జగదీశ్‌రెడ్డి, జైపాల్ యాదవ్, చంటి క్రాంతికిరణ్, నన్నపనేని నరేందర్, నోముల నర్సింహయ్య, పి.వీరయ్య, సోలిపేట రామలింగారెడ్డి, కేటీఆర్ పవిత్ర హృదయం సాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. మిగతావాళ్లు దైవసాక్షిగా ప్రమాణం చేశారు. కౌసర్ మొయినుద్దీన్, ఎండీ మౌజంఖాన్, సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ ఉర్దూలో ప్రమాణం చేయగా.. అజ్మీరా రేఖానాయక్, హరిప్రియ నాయక్, అబ్దుల్ బలాల, షకీల్ అహ్మద్, మైనంపల్లి హన్మంతరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎల్వీ స్టీఫెన్‌సన్ ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉదయం 9.00 గంటలకే అసెంబ్లీకి వచ్చారు. శాసన సభా పక్ష నేత ఎంపిక కోసం ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలోని కమిటీ హాల్ 1లో సమావేశమై చర్చలు జరిపారు.

- తర్వాత మహిళా ఎమ్మెల్యేల ప్రమాణం
- ప్రమాణం చేయించిన ప్రొటెం స్పీకర్

ఆత్రం సక్కు రెండుసార్లు

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు రెండుసార్లు ప్రమాణం చేయాల్సి వచ్చింది. మొదట పెర్సాపెన్ (ఆదివాసీల ఆరాధ్యదైవం) సాక్షిగా ప్రమాణం చేయగా దాన్ని తిరస్కరించారు. సభ ఫార్మాట్ ప్రకారం చేయాలని సూచించడంతో.. తిరిగి ఆయన దైవ సాక్షిగా చేశారు.

కమ్యూనిస్టులు లేని సభ

ఇప్పటివరకు ప్రతి అసెంబ్లీలో కమ్యూనిస్టు పార్టీల నుంచి ఒక్క ఎమ్మెల్యే అయినా ఉండే వారు. కానీ.. ఈ సారి సీపీఐ, సీపీఎం ల నుంచి ఒక్కరూ గెలవక పోవడంతో కమ్యూనిస్టులు లేని తొలి సభగా రికార్డులకెక్కింది.

బీజేపీ ఏకైక ఎమ్మెల్యే గైర్హాజరు

మొన్నటి వరకు బీజేపీకి ఐదుగురు ఎమ్మెల్యేలు ఉండగా.. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి కేవలం గోషామహల్ నుంచి రాజాసింగ్ మాత్రమే గెలిచారు. ఆ ఒక్క ఎమ్మెల్యే కూడా తొలిరోజు సభకు రాలేదు. ప్రొటెం స్పీకర్ ముస్లిం కావడంతో ఆయన సమక్షంలో ప్రమాణం చేయబోనని ఇప్పటికే రాజాసింగ్ ప్రకటించారు.

అనారోగ్యంతో దానం, సాయన్న

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న అనారోగ్యంతోనే సభకు హాజరయ్యారు. సభలో నడవడానికి దానం ఇబ్బందిపడ్డారు. సాయన్న వీల్‌చైర్‌పై రావడంతో ప్రొటెం స్పీకర్ ప్రత్యేక అనుమతి ఇచ్చారు. ప్రమాణ స్వీకారం అయ్యాక పోడియం వెనుక నుంచి వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేయాల్సి ఉంటుంది. దీని నుంచి సాయన్నకు మినహాయింపు ఇచ్చారు.

సీఎంకు పలువురి పాదాభివందనం

పది మంది వరకు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కాగానే సీఎం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. తిరిగి మధ్యాహ్నం 1.10 గంటలకు వచ్చారు. ఆ సమయంలో ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, శంకర్‌నాయక్.. ఆయనకు పాదాభివందనం చేశారు. అంతకుముందు రేఖానాయక్ కూడా సీఎంకు పాదాభివందనం చేశారు. ప్రమాణ పత్రం చదివిన తర్వాత హరీశ్‌రావు నేరుగా సీఎం కేసీఆర్‌ను కలిసి షేక్‌హ్యాండ్ ఇచ్చారు. అటు తర్వాత ప్రొటెం స్పీకర్ దగ్గరకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

సైడ్‌లైట్స్

- ఉదయం 11.28 గంటలకు సీఎం కేసీఆర్ సభలోకి వచ్చారు. ఆయనతోపాటు హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వచ్చారు.
- సీఎం సభలోకి రాగానే నేరుగా కాంగ్రెస్ సభ్యుల వద్దకు వెళ్లి పలకరించారు.
- సరిగ్గా 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ రాగానే సభ ప్రారంభమైంది.
- అసెంబ్లీలోకి మొదట గంగుల కమలాకర్ వచ్చారు. తర్వాత రసమయి బాలకిషన్, టి. పద్మారావు, దివాకర్‌రావు వచ్చారు.
- కొందరు ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారమప్పుడు కొద్దిగా తడబడ్డారు.
- కేటీఆర్ ప్రమాణం చేశాక, కాంగ్రెస్ సభ్యుల వద్దకు వెళ్లి పలకరించారు.
- అసెంబ్లీ పరిసర ప్రాంతాలు ఫార్చునర్ కార్ల పరేడ్‌ను తలపించాయి. ఎక్కువ మంది సభ్యులు ఇవే కార్లలో వచ్చారు.



జూబ్లీహాల్‌లో లంచ్

సమావేశాలు శుక్రవారానికి వాయిదా పడగానే ఎమ్మెల్యేలు జూబ్లీహాల్‌లో సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన లంచ్‌కు వెళ్లారు. భోజన సమయంలో కేసీఆర్ అన్ని పార్టీల సభ్యుల్ని ఆత్మీయంగా పలకరించారు. వివిధ పక్షాల నాయకులతో కూర్చొని ఆయన భోజనం చేశారు.

ఎమ్మెల్యేలందరిలో కేసీఆరే సీనియర్

రాష్ట్ర రెండో అసెంబ్లీలో ఎన్నో విశేషాలు ఉన్నాయి. ఈ సభలో సభ్యుడిగా సీఎం కేసీఆరే అందరికన్నా సీనియర్. ఆయన వరుసగా ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు (ఉప ఎన్నికతో కలిపి). సీఎం కేసీఆర్ తర్వాతి స్థానంలో ముంతాజ్ అహ్మద్‌ఖాన్, రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్ ఉన్నారు. వీరు ఆరుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. రాష్ట్ర తొలి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన 76 మంది ఎమ్మెల్యేలు మరోసారి గెలిచారు. 23 మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు (73) ఎక్కువ వయసు గల సభ్యుడిగా.. ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ (29) పిన్నవయస్కురాలిగా నిలిచారు. మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో టీఆర్ఎస్ 88 స్థానాలను గెలుచుకోగా.. కాంగ్రెస్ నుంచి 19 మంది , మజ్లిస్ నుంచి ఏడుగురు, టీడీపీ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు గెలిచారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి ఒకరు, స్వతంత్రులుగా ఒకరు విజయం సాధించారు. ఈ ఇద్దరు కూడా ఇటీవల టీఆర్ఎస్‌లో చేరారు. మొదటి అసెంబ్లీకి నామినేట్ అయిన స్టీఫెన్‌సన్ ఈ సారి కూడా నామినేట్ అయ్యారు.

ఇంకా నయం.. అసెంబ్లీకి వెయ్యలే!



అసెంబ్లీ ఆవరణలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, జర్నలిస్టుల మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. అసెంబ్లీ ప్రధాన హాల్‌కు వెళ్లేందుకు ఆమె సీఎల్పీ ఆఫీసు నుంచి బయటికి వస్తుండగా మీడియా ప్రతినిధులు పలకరించారు. మీడియా పాసులన్నీ గులాబీ రంగులో కనిపించడంతో 'ఏంటీ అలా ఉన్నాయి..?' అంటూ సబిత ఆరా తీశారు. 'ఏం చేస్తాం మేడం.. మాకు కూడా ఆ రంగు వేసేశారు' అంటూ కొందరు జర్నలిస్టులు బదులిచ్చారు. దీంతో ఆమె అసెంబ్లీ భవనాన్ని చూపిస్తూ.. 'ఇంకా నయం దానికి వెయ్యలే ఆ రంగు' అని అన్నారు. 'అవును మేడం' అని మీడియా ప్రతినిధులు బదులివ్వడంతో నవ్వులు పూశాయి.

ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కిట్స్

ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ అధికారులు భారత రాజ్యాంగం బుక్‌తోపాటు 17 రకాల వస్తువులతో కూడిన కిట్ బ్యాగ్‌లు అందజేశారు. భారత రాజ్యాంగం (న్యూ ఎడిషన్), భారత రాజ్యాంగం ఇంట్రడక్షన్, శాసనసభ ప్రవర్తన నియమావళి (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో), అబ్‌స్ట్రాక్ట్ సిరీస్ (ఇంగ్లిష్/తెలుగు), మెంబర్స్ హ్యాండ్ బుక్, లైబ్రరీ ఎట్ గ్లాన్స్, సభ్యులకు కల్పించే సౌకర్యాలు, లిస్టెడ్ కౌన్సిల్ క్వశ్చన్స్, లిస్టెడ్ అసెంబ్లీ క్వశ్చన్స్ గైడ్‌లైన్స్, సీపీఏ ఇన్ఫర్మేషన్ బుక్‌లెట్, బయోడేటా ఫాం, శాలరీ ఫామ్స్ (3), టీఏ ఫామ్స్, క్వశ్చన్ ఫామ్స్ (10), లెటర్ హెడ్స్ (బిగ్, మీడియం, స్మాల్), ఫాం3 (అండర్ డిఫెక్షన్ రూల్స్ 1986), స్క్రిబ్లింగ్ ప్యాడ్, బ్లూ, గ్రీన్ బాల్ పెన్స్ ఈ కిట్‌లో అందజేశారు. అలాగే యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ప్రసాదం, డైరీ, క్యాలెండర్, తిరుమల తిరుపతి దేవస్థానం డైరీ అందజేశారు.

ఒకే కారులో కేటీఆర్, హరీశ్

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం తర్వాత టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఒకే కారులో బయటకు వెళ్లారు. కేబినెట్ విస్తరణ, ఇతర పదవుల భర్తీపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతుండటంతో ఆ విషయంపైనా ఇద్దరు నేతలు చర్చించినట్టు తెలుస్తోంది.

అసెంబ్లీ లాబీల్లో..



సీఎల్పీ నాకే ఇవ్వాలి

నేను సీనియర్ నాయకుడిని. నాకే సీఎల్పీ ఇవ్వాలి. కష్టకాలంలోనూ పార్టీని అంటిపెట్టుకుని ఉన్నా. పార్టీలో కీలక పదవుల్లో కొనసాగుతున్న కొంతమందికి వాళ్ల కుటుంబ సభ్యులే ఓటు వేయరు. ఏదేమైనా సీఎల్పీ నాయకుడి విషయం లో రాహుల్‌గాంధీదే తుది నిర్ణయం.

- ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మా ఎమ్మెల్సీ వల్లే నా మెజార్టీ తగ్గింది

మా పార్టీ ఎమ్మెల్సీ వల్లే నాకు మెజార్టీ తగ్గింది. త్రిముఖ పోటీలో కష్టంగా 3,500లోపే మెజార్టీ వచ్చింది. ఆ ఎమ్మెల్సీ సహకరించి ఉంటే 25 వేలు దాటేది. దీనిపై సీఎంకు ఫిర్యాదు చేశా. ఇంటెలిజెన్స్ నుంచి కూడా సీఎంకు సమాచారముంది.

- మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ టీఆర్ఎస్ ఎమ్మెల్యే



సభలో నవ్వుల్ పువ్వుల్

కాంగ్రెస్ సభ్యులు మల్లు భట్టి విక్రమార్క, సీతక్క తదితరులను పలకరిస్తున్న సీఎం కేసీఆర్

'సీఎల్పీ' బాధ్యత హై కమాండ్‌కు

కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఏక వాక్య తీర్మానం

హైదరాబాద్, వెలుగు:

కాంగ్రెస్ శాసన సభాపక్ష నేత ఎంపిక బాధ్యతను హై కమాండ్‌కు అప్పగిస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏకవాక్య తీర్మానం చేశారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, ఎవరిని ఎంపిక చేసినా తమకు అభ్యంతరం లేదని మెజార్టీ ఎమ్మెల్యేలు తెలిపారు. దీంతో తీర్మానాన్ని గురువారం ఏఐసీసీ చీఫ్ రాహుల్ గాంధీకి పంపించారు.

సీనియర్లు, ఎమ్మెల్యేలతో చర్చలు

సీఎల్పీ నేత ఎన్నిక కోసం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్ బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకుని పార్టీ సీనియర్లతో సమావేశమయ్యారు. గురువారం ఉదయం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. వారితో విడివిడిగా మాట్లాడి అభిప్రాయాలను తీసుకున్నారు.

రాహుల్ నామినేట్ చేస్తారు: కేసీ వేణుగోపాల్

సీఎల్పీ నేతను రాహుల్ గాంధీ నామినేట్ చేస్తారని వేణుగోపాల్ వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ తర్వాత అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ సభ్యుల అభిప్రాయాలను అధిష్టానానికి నివేదించామని తెలిపారు. వీలైనంత త్వరగా హై కమాండ్ తన నిర్ణయం ప్రకటిస్తుందని భావిస్తున్నామన్నారు.

రేసులో ముందున్న భట్టి

సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయన వైపే అధిష్టానం మొగ్గు చూపుతోందని పార్టీలో చర్చ సాగుతోంది. సామాజిక వర్గం, పార్టీలో ఆయన చేపట్టిన పదవులు, ఆయన ప్రాతినిధ్యం వహించే జిల్లా నుంచే అత్యధికంగా పార్టీ ఎమ్మెల్యేలు ఉండడం ఆయనకు అనుకూలాంశమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పీసీసీ చీఫ్ ఉత్తమ్ కూడా పోటీ పడుతుండటంతో అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. తనకు ఇవ్వని పక్షంలో శ్రీధర్‌బాబుకైనా సీఎల్పీ నేత పదవి ఇవ్వాలని ఉత్తమ్ అధిష్టానంపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, దీంతో సీఎల్పీ నేత ఎంపికలో జాప్యం జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ల భేటీ

పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతల సమావేశం జరిగింది. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, 33 జిల్లాలకు డీసీసీ అధ్యక్షుల నియామకంపై చర్చించారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్సీ కుంతియా, ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, సలీం అహ్మద్, శ్రీనివాస్ కృష్ణన్, రాష్ట్ర ముఖ్య నేతలు రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కుసుమకుమార్, శ్రీధర్ బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, జగ్గారెడ్డి హాజరయ్యారు.

సందడే సందడి

కుటుంబాలతో ప్రమాణ స్వీకారానికి వచ్చిన కొత్త ఎమ్మెల్యేలు

హైదరాబాద్, వెలుగు:

శాసనసభకు తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. వారితో గ్రూప్ ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఎమ్మెల్యేల కుటుంబీకులు గ్యాలరీ నుంచి చూశారు. తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తన కూతురు, అల్లుడితో కార్యక్రమానికి వచ్చారు. అసెంబ్లీ లాబీలోకి వెళ్లే ముందు గడపకు నమస్కరించారు. అందోల్ నుంచి ఎన్నికైన సీనియర్ జర్నలిస్టు చంటి క్రాంతి కిరణ్‌ను పెన్నుల దండతో జర్నలిస్టులు సన్మానించారు. అసెంబ్లీకి కలం వీరుడు ఎన్నికయ్యాడంటూ లోపలికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ ఎంపీ కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియాతో గ్రూప్ ఫొటో దిగి అసెంబ్లీలోకి వెళ్లారు. కోదాడ నుంచి అసెంబ్లీకి ఎన్నికైన బొల్లం మల్లయ్య యాదవ్ తన 30 ఏళ్ల కల ఫలించిందని, జన్మ ధన్యమైందని మీడియాతో వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధనసరి సీతక్క, హరిప్రియ నాయక్, రేగ కాంతారావు కుటుంబ సభ్యులతో అసెంబ్లీకి వచ్చారు. ఆవరణలో గ్రూప్ ఫొటో దిగారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రమాణ స్వీకారం చేసేటపుడు సీఎం కేసీఆర్ సభలో లేకపోవడంతో ఆయన లోపలికి వచ్చాక పాదాభివందనం చేశారు. తరువాత కేటీఆర్ ఆశీస్సులూ తీసుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ముందు కూతురు చేతుల మీదుగా బీ ఫాం తీసుకున్న శంకర్ నాయక్ ఎన్నికల్లో గెలిచాక ధ్రువీకరణ పత్రాన్నీ కూతురు చేతుల మీదుగానే అందుకున్నారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కుటుంబసభ్యులతో హాజరయ్యారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి భార్య, తల్లిదండ్రులతో అసెంబ్లీకొచ్చారు.



రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆయన కూతురు

హుషారుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు





అమరుల యాదిలో..

అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ముందు సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. సీఎంతో పాటు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ వినోద్ ఒకే వాహనంలో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల నుంచి సీఎం కేసీఆర్ గౌరవ వందనం స్వీకరించారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు గన్‌పార్క్‌కు చేరుకొని నివాళులర్పించారు. నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లారు.



గురువారం ప్రమాణ స్వీకారానికి ముందు అసెంబ్లీ ఆవరణలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా

హైదరాబాద్, వెలుగు: శాసనసభ సమావేశాల తొలిరోజు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హుషారుగా కనిపించారు. శాసనసభ్యులు సభలోకి వెళ్లే ప్రవేశ ద్వారం వద్ద 19 మంది పార్టీ ఎమ్మెల్యేలు గ్రూప్ ఫోటోలు దిగి సందడి చేశారు. తొలిసారి ఎన్నికైన ఆరుగురు ఎమ్మెల్యేలు హరిప్రియ నాయక్, రోహిత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సురేందర్, ఉపేందర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి అందరినీ పలకరించడం, పార్టీ ఎమ్మెల్యేలతో హుషారుగా తిరగడం కనిపించింది. ముగ్గురు మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సీతక్క, హరిప్రియ ఉత్సాహంగా ముచ్చటించుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, సీతక్క, హరిప్రియ నాయక్, సుధీర్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చారు. జూబ్లీహాల్‌లో ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన లంచ్‌కు కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క, గండ్ర వెంకటరమణారెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు.

పోచారమే స్పీకర్



స్పీకర్ పదవికి నామినేషన్ వేస్తున్న పోచారం. పక్కన కేసీఆర్, భట్టి తదితరులు

- ఏకగ్రీవంగా ఎన్నిక.. నేడు ప్రకటన
- కాంగ్రెస్, మజ్లిస్, బీజేపీ మద్దతు
- పోచారం పేరును ప్రతిపాదిస్తూ ఆరు సెట్ల నామినేషన్లు
- బలపరిచిన కేసీఆర్, భట్టి, బలాల తదితరులు

హైదరాబాద్, వెలుగు:

అసెంబ్లీ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవి ఎన్నిక కోసం గురువారం నామినేషన్ల ప్రక్రియ చేపట్టగా గడువు ముగిసే సమయానికి ఒకే నామినేషన్ దాఖలైంది. పోచారం ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన్ను స్పీకర్‌గా శుక్రవారం అధికారికంగా ప్రకటిస్తారు. ఉదయం 11 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. గురువారం ఉదయం పోచారం అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. సీఎం కేసీఆర్, కాంగ్రెస్ నేత మల్లు భట్టి విక్రమార్కతో పాటు మజ్లిస్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేఖా నాయక్, అబ్రహం, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 6 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సీఎం విజ్ఞప్తి మేరకు స్పీకర్ ఏకగ్రీవానికి ఎంఐఎం, బీజేపీ, కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు అంగీకరించాయి.

ఊరి పేరే.. ఇంటి పేరుగా

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ మండలం పోచారానికి చెందిన పరిగె శ్రీనివాస్‌రెడ్డి ఊరి పేరునే ఇంటి పేరుగా మార్చుకున్నారు. 1949 ఫిబ్రవరి 10న పాపవ్వ, రాజిరెడ్డి దంపతులకు జన్మించారు. శ్రీనివాసరెడ్డికి భార్య పుష్ప, ముగ్గురు కొడుకులు, ఒక కూతురున్నారు. బీటెక్‌లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరిన ఆయన చదువు మధ్యలోనే వదిలేసి 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. 1976లో రాజకీయాల్లోకి వచ్చారు. 1977 లో దేశాయిపేట సింగిల్‌విండో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1987లో డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. 1994లో తొలిసారి బాన్సువాడ నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యే గెలిచారు. 1998లో మంత్రిగా పనిచేశారు. 1999లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి భూగర్భ గనులు, జల వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. కొంతకాలం పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్నారు. 2004లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2009లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా నెగ్గారు. 2011లో టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. తర్వాత జరిగిన ఉప ఎన్నికలో 49 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బాన్సువాడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. బాన్సువాడ ఆరుసార్లు పోటీ చేసిన ఆయన ఐదుసార్లు నెగ్గారు.



30 ఏళ్ల కల నెరవేరింది

విద్యార్థి జీవితం నుంచే రాజకీయాల్లో ఉన్నా. 30 ఏళ్లుగా ఎమ్మెల్యే కావాలనే నా కల నెరవేరింది. నా దృష్టిలో కేసీఆర్ దేవుడు. నన్ను ఆశీర్వదించిన ప్రజలకు రుణపడి ఉంటా. తెలంగాణకు ముఖద్వారమైన కోదాడ నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ సహకారంతో తాగునీటితోపాటు, ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగునీరందించేందుకు కృషి చేస్తా.

- కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య



ఉక్కు ఫ్యాక్టరీ సాధిస్తా

ఇల్లందు నియోజకవర్గ ప్రజలు తొలిసారిగా ఓ మహిళను అసెంబ్లీకి పంపారు. ప్రజలకు, కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు. శాసన సభ్యులందరిలో చిన్న వయస్కురాలిగా గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. పోడు భూముల సమస్య పరిష్కారం, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు కృషిచేస్తా. పార్టీ మారే ఆలోచన లేదు.

- ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

రేపు ప్రమాణం చేస్తా: సండ్ర

'టీఆర్ఎస్‌లో చేరినా, చేరకున్నా...' అంటూ వ్యాఖ్యలు

హైదరాబాద్, వెలుగు:

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారానికి టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య గైర్హాజరయ్యారు. సండ్ర గైర్హాజరుపై టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణను ప్రశ్నించగా, పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఆయన తీరిక లేకుండా ఉన్నారని వెల్లడించారు. మరోవైపు తొలి రోజు సమావేశాలకు సండ్ర రాకపోవడంతో అసెంబ్లీ, లాబీల్లో పలువురు చర్చించుకున్నారు. త్వరలో టీఆర్ఎస్‌లో చేరుతున్నారని, అందుకే రాలేదని గుసగుసలు వినిపించాయి. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ముందు ఎన్టీఆర్ సమాధికి పార్టీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర్‌రావు, టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ నివాళులర్పించారు.

గైర్హాజరుపై సండ్రను 'వెలుగు' ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించగా, శనివారం అసెంబ్లీకి హాజరవుతానని, ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా ఉన్న మాట వాస్తవమేనన్నారు. కొన్ని పంచాయతీలను ఏకగ్రీవం చేయటం కోసమే నియోజకవర్గంలో ఉన్నానన్నారు. టీఆర్ఎస్‌లో చేరుతున్నారన్న వార్తలపై స్పందిస్తూ, 'టీఆర్ఎస్‌లో చేరినా, చేరకున్నా ప్రమాణ స్వీకారం అయితే కచ్చితంగా చేయాల్సిందే కదా' అని ప్రశ్నించారు.





పార్టీ మారను

టీడీపీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు

హైదరాబాద్, వెలుగు: పదవులు, డబ్బుకు లొంగేది లేదని, టీఆర్ఎస్ నుంచి ఒత్తిళ్లు వచ్చినా తిరస్కరించానని టీడీపీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చెప్పారు. గురువారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారానికి ముందు ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పించాక మీడియాతో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నానని, పార్టీ నమ్మకాన్ని వమ్ముచేయనన్నారు. నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తానన్నారు. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో బిజీ ఉండటంతో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రమాణ స్వీకారానికి రాలేదన్నారు.



చల్లంగ చూడు తల్లీ..

అసెంబ్లీ ఆవరణలోని ఆలయంలో అమ్మవారిని సీఎం కేసీఆర్ గురువారం దర్శించుకున్నారు. రాష్ట్ర రెండో శాసనసభ తొలి సమావేశాల సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అసెంబ్లీ స్పీకర్‌గా పోచారం శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయడానికి ముందు ఆయనను తన వెంట తీసుకెళ్లి పూజలు చేయించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు.

- హైదరాబాద్, వెలుగు

దుర్గ గుళ్లో రాజకీయాలు మాట్లాడలే

హైదరాబాద్, వెలుగు:



- శవరాజకీయాలు చేసే బాబే ప్రశ్నించడమా?
- ఏపీ సీఎం వ్యాఖ్యలకు తలసాని కౌంటర్

గుళ్ల దగ్గర రాజకీయాలు చేసే అలవాటు తనకు లేదని మాజీ మంత్రి, టీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై గురువారం అసెంబ్లీ మీడియా పాయింటులో ఆయన మాట్లాడారు. శవ రాజకీయాలు చేసే చంద్రబాబు గుళ్ల వద్ద రాజకీయాలు మాట్లాడటమేంటని తనను ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బంధాలు, బంధుత్వాల విలువ తెలియనందునే వాటిని ఇంటివరకే పరిమితం చేయాలని ఏపీ సీఎం మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తాను అమ్మవారి దర్శనం చేసుకుని బయటికి వచ్చిన సమయంలో అక్కడికి వచ్చిన మీడియా ప్రతినిధులు మాట్లాడమని కోరారన్నారు. ఆలయ ప్రాంగణంలో రాజకీయాలు మాట్లాడటం సమంజసం కాదని చెప్పినట్లు వివరించారు. కొద్ది దూరం వెళ్లాక మీడియా పాయింట్ వద్ద మాత్రమే తాను మాట్లాడినట్టు తెలిపారు. 'ఆయన బావమరిది హరికృష్ణ శవం వద్ద సైతం రాజకీయం చేశాడు. ఇలాంటి చిల్లర రాజకీయాలు ఏపీలో నడుస్తయేమోగానీ తెలంగాణలో నడువవు' అని తలసాని మండిపడ్డారు. ఇకపై ఏపీలో కూడా బాబు శవరాజకీయాలు నడువనివ్వబోమని, అక్కడి ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఫెడరల్ ఫ్రంట్ నిర్మాణంలో భాగంగా ఏపీకి వస్తున్న తమ అధినేత సీఎం కేసీఆర్‌ను కలిసి అభివృద్ధి పాలన అందించడం ఎలాగో నేర్చుకోవాలని చంద్రబాబుకు హితవు పలికారు.

టీఆర్ఎస్‌లోకి వంటేరు?

- రోజంతా ప్రచారం.. కరెక్టేనన్న కొడుకు విజయేందర్‌రెడ్డి

హైదరాబాద్, వెలుగు: సీఎం కేసీఆర్‌పై గజ్వేల్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన వంటేరు ప్రతాప్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరుతారంటూ గురువారం జోరుగా ప్రచారం జరిగింది. టీఆర్ఎస్ కీలక నేత ఒకరు వంటేరుతో చర్చించి పార్టీలోకి ఆహ్వానించారని, శుక్రవారం సీఎం సమక్షంలో ఆయన టీఆర్ఎస్ కండువా కప్పుకుంటారని ప్రచారం సాగింది. ఇది నిజమేనని వంటేరు కొడుకు విజయేందర్ రెడ్డి కూడా చెప్పారు. దాంతో ఉమ్మడి మెదక్ జిల్లా టీఆర్ఎస్ పార్టీలోనూ దీనిపై చర్చ జరిగింది. మెదక్ టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దీన్ని ఖండించారు. వంటేరు వస్తానన్నా చేర్చుకోబోమన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులను గందరగోళంలోకి నెట్టేందుకే ఈ ప్రచారం చేస్తున్నారన్నారు.

స్కెచ్ వేసి.. సొరంగం తవ్వి
డీజిల్ దోపిడీ

మూడు మీటర్లలోతున తవ్వకం ■ పైప్ ఏర్పాటు చేసి ఏడు ట్యాంకర్లతో డీజిల్ చోరీ

ముంబై జైల్లో ఉండగా స్కెచ్ వేశారు. పెట్రోల్, డీజిల్ పైప్‌లైన్లే టార్గెట్‌గా పక్కాగా ప్లాన్ చేశారు. హైదరాబాద్ శివార్లలోని చర్లపల్లిని టార్గెట్‌గా ఫిక్స్ చేసుకున్నారు. ఓ ప్లాట్‌ను లీజ్‌కు తీసుకుని.. చుట్టూ రేకులతో కాంపౌండ్ వాల్ కట్టారు. ఎవరికీ అనుమానం రాకుండా డీజిల్ పైప్‌లైన్‌పై మూడు మీటర్ల లోతున సొరంగం తవ్వారు. ఏడు ట్యాంకర్లతో 1,30,601 కిలో లీటర్ల డీజిల్‌ను కొట్టేశారు. 12 మంది అంతర్రాష్ట్ర దొంగల ముఠా డీజిల్ దోపిడీ సాగింది ఇలా.. ఆయిల్ కంపెనీల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన రాచకొండ పోలీసులు ఈ టీమ్‌లలోని నలుగురిని అరెస్ట్ చేసి.. రూ.90 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో ఎనిమిది మంది పరారీలో ఉన్నారు. ఈ డీజిల్ చోరీ కేసులో పట్టుబడ్డ దొంగల క్రైమ్ హిస్టరీని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్ గురువారం మీడియాకు వెల్లడించారు.

హైదరాబాద్, వెలుగు:

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్‌కు అడ్డా అయిన మహారాష్ట్ర థానే జిల్లాలోని ముమ్రా ఈ దొంగల ముఠా లీడర్ హఫీజ్ అజీజ్ చౌదరి అలియాస్ హఫీజ్(42) స్వస్థలం. హఫీజ్ భార్యది హైదరాబాద్ పాతబస్తీలోని కిషన్‌బాగ్. దీంతో హఫీజ్‌కు గ్రేటర్‌పై మంచి అవగాహన ఉంది. హఫీజ్ కొంతకాలం క్రితం ఓల్డ్ సిటీలో ఉన్నాడు. దొంగనోట్ల చెలామణి చేస్తూ 2013లో నాంపల్లి పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ తర్వాత ముమ్రాకు వెళ్లిపోయాడు. అక్కడ నగదు అక్రమ రవాణా చేస్తూ 2015లో అరెస్టై ముంబై జైలుకు వెళ్లాడు. జైల్లో ఉన్న సమయంలో హఫీజ్‌కు పశ్చిమబెంగాల్‌కు చెందిన జియాఉల్ చాంద్ షేక్ అలియాస్ చెడ్డి బెంగాలి(42), ముంబైకి చెందిన సర్జూ అలియాస్ అజ్మాద్‌ఖాన్(52)తో పరిచయమైంది. ట్యాంకర్ డ్రైవరైన చాంద్ షేక్ పైప్‌లైన్ల నుంచి డీజిల్, పెట్రోల్ దొంగిలించేవాడు. సర్జూతో కలిసి దొంగిలించిన డీజిల్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించేవారు. అయితే డీజిల్ చోరీ చేస్తూ 2013లో అరెస్ట్ అయ్యారు. డీజిల్ చోరీలో తమకున్న అనుభవంతో హైదరాబాద్‌లో పెట్రోలియం పైప్ లైన్లను టార్గెట్ చేశారు. సిటీపై అవగాహన ఉన్న హఫీజ్‌తోపాటు మరో 9 మందితో ముఠాను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా రామచంద్రాపురానికి చెందిన బిన్ని శ్రీనివాసులు అలియాస్ శ్రీను(32), బహదూర్‌పురాకు చెందిన మహ్మద్ అబ్జుల్ అబ్రార్ అలియాస్ అబ్బు(25) ఈ ముఠాలో ఉన్నారు. బిన్ని శ్రీనివాసులు రూ.15లక్షలు పెట్టుబడిగా పెట్టాడు.

- ఐఓసీఎల్, బీపీసీఎల్ పైప్‌లైన్‌కు కన్నం
- పైప్‌లైన్ చుట్టూ రేకులతో కాంపౌండ్ వాల్
- ప్రధాన నిందితుడు హఫీజ్‌తోపాటు నలుగురు అరెస్ట్
- పరారీలో ఎనిమిది మంది.. రూ.90 లక్షలు స్వాధీనం



పోలీసుల అదుపులో దొంగల ముఠా

ఏడు ట్యాంకర్ల డీజిల్ చోరీ

చర్లపల్లి నుంచి ఘట్‌కేసర్ వెళ్లే 17 కిలోమీటర్ల డీజిల్ పైప్ లైన్‌ను ఈ ముఠా టార్గెట్ చేసింది. చర్లపల్లిలోని బీపీసీఎల్, ఐఓసీఎల్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో డీజిల్ పైప్ లైన్ వెళ్లే ప్రాంతాన్ని స్థల యజమాని మహేందర్‌గౌడ్ వద్ద హఫీజ్ లీజ్‌కు తీసుకున్నాడు. ప్లాన్ ప్రకారం ఆ ప్రాంతం చుట్టూ ఫెన్సింగ్ వేసి రేకులతో ప్రహరీ గోడ కట్టారు. పైప్ లైన్ వరకూ మూడు మీటర్ల లోతులో టన్నెల్ తవ్వారు. పైప్ లైన్‌కు రంధ్రం చేసి దాని నుంచి మరో పైపును బయటకు తీశారు. ఈ సిస్టమ్ ద్వారా ఏ అనుమానం రాకుండా డీజిల్ చోరీ చేసేవాళ్లు. ఇలా బీపీసీఎల్‌కు చెందిన 84,365 కిలో లీటర్ల డీజిల్, ఐఓసీఎల్‌కు చెందిన 46,236 కిలో లీటర్ల డీజిల్‌ను దొంగిలించి ఏడు ట్యాంకర్లతో బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. డీజిల్‌ను తరలించేందుకు ముంబైకి చెందిన సునీల్ అనీల్ మదివార్(40), వాసు, రంగీలాల్ రాంబలి యాదవ్(56), సురేశ్‌కుమార్‌ప్రజాపతి(40)తోపాటు సూర్యాపేట జిల్లా కర్విరాల కొత్తగూడేనికి చెందిన మారోజ్ జయకృష్ణ(39), నరేశ్ రెడ్డి, వరంగల్ పోచమ్మ మైదాన్‌కు చెందిన వజినేపల్లి శ్రీకాంత్(45)ను వాడేవారు. దొంగిలించిన డీజిల్‌ను వరంగల్, బాచుపల్లి, బూరుగుల, కోయల్ కొండా, మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు తరలించేవారు.

డీజిల్ పంపింగ్‌లో తేడాలతో ఫిర్యాదు

డిసెంబర్ 3 నుంచి 22వ తేదీ మధ్య డీజిల్ పంపింగ్‌లో వేల లీటర్ల వ్యత్యాసం రావడంతో చర్లపల్లి నుంచి ఘట్‌కేసర్ వరకు ఉన్న 17 కిలోమీటర్ల పైప్ లైన్‌ను ఆయిల్ కంపనీల ప్రతినిధులు చెక్ చేశారు. తమ పైప్ లైన్‌పై అర ఎకరం స్థలంలో షెడ్‌ను గుర్తించారు. డీజిల్ చోరీ అవుతున్నట్టు అనుమానం వచ్చి కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. కీసర పోలీసులు, మల్కాజ్‌గిరి సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాన నిందితుడైన హఫీజ్‌ను ముంబైలో అరెస్ట్ చేశారు. బిన్ని శ్రీనివాసులు, మహ్మద్ అబ్జుల్ అబ్రార్, మారోజ్ జయకృష్ణను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.90.4 లక్షల నగదు, మొబైల్ ఫోన్, హోండా యాక్టివాతోపాటు ఆయిల్ ట్యాంకర్, స్కార్పియో స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఎనిమిది మంది కోసం గాలిస్తున్నారు. ఈ ముఠాను అరెస్ట్ చేసిన మల్కాజ్‌గిరి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. లింగయ్య, జగన్నాథ్‌రెడ్డి, రుద్రభాస్కర్‌తో పాటు ఎస్సైలు, కానిస్టేబుళ్లను సీపీ మహేశ్ భగవత్ అభినందించారు.



ఇలా సొరంగం తవ్వారు..



డీజిల్ మెయిన్ పైపుకు ఇలా కనెక్షన్ ఇచ్చారు..



ఇలా ట్యాంకర్లతో నింపి మార్కెట్‌కు తరలించారు..



ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు
పేదల కోసమే

గుజరాత్ టూర్‌లో ప్రధాని మోడీ

అహ్మదాబాద్ : అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడానికే అగ్రకులాల్లోని పేదలకు తమ ప్రభుత్వం రిజర్వేషన్లు తీసుకువచ్చిందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. ఆర్థికంగా వెనకబడ్డ అగ్రకుల పేదలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లు తొలిసారి అమలు చేస్తున్నందుకు గుజరాత్ ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అన్ని విద్యా సంస్థల్లో ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు అమలు జరుగుతాయన్నారు. ప్రధాని మోడీ గురువారం గుజరాత్ లో పర్యటించారు. ఈ సందర్భంగా గాంధీ నగర్ లో వైబ్రంట్ గ్లోబల్ ట్రేడ్ ను ప్రారంభించారు.

వైద్య ఆరోగ్య రంగానికి ప్రయారిటీ

వైద్య ఆరోగ్య రంగంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడానికే ఆయుష్మాన్ భారత్ పథకం తీసుకొచ్చామన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రకటించిన వంద రోజుల్లోపే 7 లక్షల మంది పేదలు వైద్య సేవలు పొందారని చెప్పారు. నాలుగేళ్ల కాలంలో మెడికల్ కాలేజీల్లో సీట్ల సంఖ్య పెంచామన్నారు. దేశవ్యాప్తంగా 450 జిల్లాల్లో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

ఇండోర్ చెత్త సమస్యకు
ఐఏఎస్ సమాధానం

ఇండోర్. దేశంలోనే అతి శుభ్రమైన నగరం. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో రెండేళ్లుగా నంబర్‌వన్. అలాంటి నగరాన్ని మొన్నటివరకూ చెత్త సమస్య వేధించేది. ఓ ఆఫీసర్ ఆ కష్టం నుంచి ఇండోర్‌ను గట్టెంక్కించారు. ఆయనే ఆశీష్ సింగ్. 2018 మే నెలలో ఇండోర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆరంటే ఆరే నెలల్లో నాలుగేళ్లుగా ఎటూ కదలని చెత్తను కనిపించకుండా చేశారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇండోర్‌లోని 100 ఎకరాల డంప్ సైట్‌ను క్లియర్ చేయాలని 2014లో మధ్యప్రదేశ్ సర్కారు నిర్ణయించింది. కానీ రెండేళ్లుగా కేవలం 2 లక్షల టన్నుల చెత్తను మాత్రమే డంప్ యార్డు నుంచి తరలించారు. ఈ నేపథ్యంలో 2010 ఐఏఎస్ కేడర్ ఆఫీసర్ ఆశీష్ మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. క్యూబిక్ మీటర్ చెత్తను తొలగించినందుకు ప్రైవేట్ కంపెనీలు రూ. 475 వసూలు చేసేవి. ఇలా డంప్ మొత్తం క్లీన్ చేయడానికి 60 నుంచి 65 కోట్ల రూపాయలు అవుతుందని ఆశీష్ అంచనా వేశారు. దీంతో టెక్నాలజీని వాడుకుని కేవలం 10 కోట్లతో మొత్తం యార్డును క్లీన్ చేయాలని భావించారు. అందుకోసం బయో మైనింగ్‌ను ఎంచుకుని సక్సెస్ అయ్యారు. 'నిధులే సమస్యని మేం గుర్తించాం. తక్కువగా ఖర్చు చేస్తూ, ఎక్కువ పని జరిగేలా ప్లాన్ చేశాం. బయో మైనింగ్ కోసం మెషీన్లను అద్దెకు తీసుకున్నాం. ఒక్కో మెషీన్‌కు నెలకు 7 లక్షలు ఖర్చయ్యాయి.' అని ఆశీష్ వెల్లడించారు. మున్సిపాలిటీ సిబ్బందే రోజుకు 15 గంటలపాటు డంప్ యార్డును మెషీన్లతో క్లీన్ చేశారని తెలిపారు. ఆరే నెలల్లో 13 లక్షల టన్నుల చెత్తను తొలగించి, యార్డును క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చారన్నారు.



- ఇండోర్ డంప్ యార్డును ఆరు నెలల్లో క్లీన్ చేసిన ఆఫీసర్

నేడే సుప్రీం కొత్త జడ్జీల ప్రమాణం

న్యూఢిల్లీ: కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సుప్రీం కోర్టు జడ్జీలుగా శుక్రవారం ప్రమాణం చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ వారితో ప్రమాణం చేయించనున్నారు. జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ ఖన్నాలను జడ్జీలుగా నియమించాలంటూ సుప్రీం కోర్టు కొలీజియం జనవరి 10న ప్రతిపాదించడంతో ఈ మేరకు బుధవారం కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే జస్టిస్ ఖన్నాకు పదోన్నతి కల్పించాలన్న ప్రతిపాదనను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీవ్రంగా వ్యతిరేకించింది. ఆయనకన్నా సీనియర్ జడ్జీలున్నారని, ఇది ఏకపక్ష నిర్ణయమని ఆరోపించింది.



ఈసారి ఫ్యాషన్'డాగ్' వాక్

డిజైనర్ దుస్తుల్లో ర్యాంప్ పై వయ్యారంగా క్యాట్‌వాక్ చేస్తున్న మోడల్స్ మధ్యలో వీధి కుక్క.. ఎప్పుడూ క్యాట్ వాకేనా ఈసారి నన్ను ఫాలో కండి అన్నట్లు స్టేజిపై నడిచి చూపించింది. ముంబయిలోని బ్యాండ్ స్టాండ్ ఫోర్ట్ ఆవరణలో నిర్వహిస్తున్న బ్లెండర్స్‌ప్రైడ్ ఫ్యాషన్ టూర్2019లో గురువారం చోటుచేసుకున్న ఘటన ఇది. గుల్దస్తాహ్ పేరుతో రోహిత్ బాల్ డిజైనర్‌సమ్మర్ కలెక్షన్ దుస్తులతో మోడల్స్ హొయలుపోయారు.

గట్టెక్కిన థెరిసా సర్కారు

బ్రిటన్ పార్లమెంటులో వీగిన అవిశ్వాస తీర్మానం

లండన్ : బ్రిటన్‌లో ప్రధానమంత్రి థెరిసా మే ప్రభుత్వం బతికిపోయింది. అవిశ్వాస పరీక్షలో 19 ఓట్ల తేడాతో కన్జర్వేటివ్ పార్టీ అధికారాన్ని నిలబెట్టుకుంది. బ్రెగ్జిట్‌పై జరిగిన ఓటింగ్‌లో మేను వ్యతిరేకించిన సొంత పార్టీ(కన్జర్వేటివ్) ఎంపీలు, అవిశ్వాస పరీక్షలో మద్దతుగా నిలిచారు. గురువారం ప్రతిపక్ష లేబర్ పార్టీ చీఫ్ జెరెమీ కార్బిన్ సర్కారుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. సుదీర్ఘ చర్చ అనంతరం ఓటింగ్ జరిగింది. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 306, వ్యతిరేకంగా 325 మంది ఓటేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం వీగింది. గెలుపు తర్వాత మే మాట్లాడుతూ "బ్రెగ్జిట్‌పై ముందుకెళ్లడానికి ఇది మా ప్రభుత్వానికి వచ్చిన అవకాశం. ప్రజలు యూరోపియన్ యూనియన్(ఈయూ) నుంచి బయటపడాలనుకుంటున్నారు. బ్రెగ్జిట్‌పై సోమవారం కొత్త ప్లాన్‌తో పార్లమెంటుకు వస్తాను" అని పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై రాజకీయాలొద్దు

ఏపీ ప్రభుత్వం కొత్త నిబంధన

విజయవాడ, వెలుగు: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఏపీ ప్రభుత్వం కొత్త నిబంధనలు విధించింది. దుర్గగుడి ఆలయ పరిసరాల్లో రాజకీయాలు మాట్లాడొద్దని, ప్రెస్‌మీట్‌లకు అనుమతిలేదని స్పష్టం చేసింది. పోస్టర్లు, ఫ్లెక్సీలు పెడితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఇటీవల దుర్గమ్మ దర్శనానికి వెళ్లిన తలసాని శ్రీనివాస్ యాదవ్ రాజకీయ ప్రకటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

యూఎస్ ఇంటెలిజెన్స్ కమిటీలో
ఇండియన్ అమెరికన్

డెమోక్రాట్ నేత రాజా కృష్ణమూర్తికి కీలక పదవి

వాషింగ్టన్: అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ సర్కారులో కీలక పదవికి ఇండియన్ అమెరికన్ రాజా కృష్ణమూర్తి ఎంపికయ్యారు. అమెరికా జాతీయ భద్రత బలోపేతానికి కృషిచేసే కీలకమైన ఇంటలిజెన్స్ కమిటీలో ఆయనకు చోటు దక్కింది. డెమోక్రాటిక్ నేత కృష్ణమూర్తిని స్పీకర్‌నాన్సీ పెలొసి ఈ కమిటీలో సభ్యుడిగా నియమించారు. అమెరికాలోని వివిధ ఇంటలిజెన్స్‌ఏజెన్సీల పనితీరును, బడ్జెట్, ఇతరత్రా వివరాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీలో నియమితులైన తొలి దక్షిణాసియా వ్యక్తిగా కృష్ణమూర్తి రికార్డు సృష్టించారు. రాజా కృష్ణమూర్తి ఇల్లినాయి నుంచి కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా, ముఖ్యమైన కమిటీలో తనను సభ్యుడిగా తీసుకోవడంపై కృష్ణమూర్తి సంతోషం వ్యక్తంచేశారు.





శని చంద్రుడిపై మేఘాల్లేని వర్షం

మాస్కో: శని చంద్రుడు టైటాన్‌పై వర్షాలు కురిశాయట. కాసిని స్పేస్‌క్రాఫ్ట్ డేటాను విశ్లేషించి సైంటిస్టులు చెబుతున్న మాట ఇది. ఉత్తర ధృవంలో మీథేన్‌తో కూడిన వర్షాలు పడ్డాయని రష్యాలోని యూనివర్సిటీ ఆఫ్ ఇదాహో సైంటిస్టులు చెబుతున్నారు. అక్కడ వర్షాలు పడుతున్నాయంటే ఇప్పుడు ఉత్తరార్ధగోళంలో వేసవి ప్రారంభమవుతున్నట్టు అని అంటున్నారు. వర్షమొస్తున్నా మేఘాలు మాత్రం కనిపించలేదంటున్నారు. 2016 జూన్ 7న కాసిని పంపిన ఫొటోను విజువల్, ఇన్‌ఫ్రారెడ్ మ్యాపింగ్ స్పెక్ట్రోమీటర్‌తో విశ్లేషించిన సైంటిస్టులు.. 74,564 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ప్రతిబింబాలను గుర్తించారు. తడిగా ఉన్న ఉపరితలంపై నుంచి సూర్యుడి కిరణాలు పడడం వల్లే ఇవి కనిపిస్తున్నాయంటున్నారు. వర్షం పడిన తర్వాత చాలా రోజులకు ఆ తడంతా ఆవిరైపోయినట్టు చెబుతున్నారు.

ప్రైవసీ మరింత కట్టుదిట్టం

ఓరియో.. ఆండ్రాయిడ్ ఫోన్లలో ఇప్పుడు నడుస్తున్న ఓఎస్. ఆ తర్వాత 'ఆండ్రాయిడ్ 9.0 పై' క్యూలో ఉంది. ఈ ఏడాదిలోనే అది ఫోన్లలోకి చేరుతుంది. అదింకా ఫోన్లలోకి రాను కూడా లేదు.. అప్పుడే 'ఆండ్రాయిడ్ క్యూ' క్యూ కట్టేసింది. కొన్ని ఆకర్షణీయమైన ఫీచర్లతో యూజర్లకు అందుబాటులోకి రాబోతోంది. సిస్టం డార్క్ థీం సహా పటిష్ఠమైన 'ప్రైవసీ' భద్రతతో ముందుకు రాబోతోంది. దానికి సంబంధించిన వివరాలను ఆండ్రాయిడ్ క్యూ అభివృద్ధిలో భాగస్వామి అయిన ఎక్స్‌డీఏ డెవలపర్స్ వెల్లడించింది. కొత్త డార్క్ థీం ప్రకారం.. ఫోన్లోని ఐకాన్లన్నింటినీ గ్రే (బూడిద రంగు)లో పెట్టేసుకోవచ్చు. పర్మనెంట్‌గా ఆ థీంను పెట్టుకోవడమే గాకుండా.. ఏ టైంలో అది ఆన్‌లో ఉండాలో.. ఏ టైంలో ఉండకూడదో కూడా ఆప్షన్లను పెట్టుకోవచ్చు. అంటే టైం ప్రకారం డార్క్ థీం మారుతుందన్నమాట. ఒకవేళ దానిని సపోర్ట్ చేయని యాప్ ఏదైనా ఉంటే.. బలవంతంగా దానిని తన దార్లోకి తెచ్చేసుకుంటుందట. బాగా వెలుతురు ఉన్నప్పుడు, ఓఎల్ఈడీ స్క్రీన్లున్న ఫోన్లలో బ్యాటరీని ఈ డార్క్ థీం సేవ్ చేస్తుందని అంటున్నారు.

డార్క్ థీం కాకుండా మరో పెద్ద అంశం ప్రైవసీ. ఫోన్లలో యాప్‌లను క్లోజ్ చేసినా లొకేషన్ వివరాలు మాత్రం వాటికి చేరుతుంటాయి. ఆండ్రాయిడ్ క్యూ వాటికి చెక్ పెట్టనుంది. అంటే ఒక్కసారి యాప్‌ను క్లోజ్ చేస్తే లొకేషన్ వివరాలేవీ దానికి తెలవవు. క్లోజ్ చేయగానే లొకేషన్ పర్మిషన్‌ను వ్యతిరేకిస్తుందన్న మాట. అంతేకాదు.. ఏయే యాప్‌లు తమ లొకేషన్లను తీసుకుంటున్నాయో, తెలుసుకుంటున్నాయో యూజర్ తెలుసుకునే వెసులుబాటును ఆండ్రాయిడ్ క్యూ కల్పిస్తోంది. స్టేటస్ బార్‌ను కిందకు లాగి పైన కుడివైపున ఉండే హ్యాండ్ లొకేషన్ ఐకాన్‌ను క్లిక్ చేస్తే ఆ వివరాలు తెలిసిపోతాయి. ఏ యాప్ ఏయే పర్మిషన్లను వాడుకుంటున్నాయో కూడా తెలుసుకోవచ్చు. 'డెస్క్‌టాప్ మోడ్' అనే కొత్త ఫీచర్‌తో ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్‌కు ఫోన్‌ను కనెక్ట్ చేసుకునే అవకాశం ఉంటుంది. వచ్చిన మెసేజ్‌ను ఎప్పుడు చదవాలో కూడా టైంను సెట్ చేసుకోవచ్చు.



- 'పై' రాకముందే ఆండ్రాయిడ్ క్యూ ఓఎస్
- డార్క్ థీం మోడ్ సహా ఆకర్షణీయమైన ఫీచర్లు

అన్ని ఆస్పత్రుల్లో ఒకేలా ఫీజులు

హైదరాబాద్, వెలుగు:

పేదలు, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులో ఉండటం లేదని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. రాష్ట్రంలో అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ప్రామాణిక ధరలు ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్ బేగంపేట్‌లోని ఓ హోటల్‌లో జరిగిన వాయికాన్ 12 వార్షిక సదస్సును గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. "కార్పొరేట్ ఆస్పత్రుల్లో ప్రామాణిక ధరలు ఉండేలా విధివిధానాలు రూపొందించాలి. ఏదైనా ఓ వ్యాధికో, మెడికల్ టెస్టుకో అపోలో అసుపత్రికి వెళ్లినా, కిమ్స్, నిమ్స్.. ఎక్కడికి వెళ్లినా ఫీజులు ఒకేలా ఉండాలి. ఇలాంటి ఫీజుల విధానం ఉన్నప్పుడే జనాలు దోపిడీకి గురికారు. సామాన్యులు భరించే స్థాయిలో వైద్య సేవలు ఉన్నప్పుడే సమాజానికి మంచి జరుగుతుంది" అని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలు మెడికల్ టెస్టుల బిల్లులను భరించలేని పరిస్థితిలో ఉన్నారని, ఈ విధానం మారాలన్నారు.

మాటల్లోనే ఉంది..

రోగిని వైద్యులు ఆత్మీయంగా పలకరించాలని, వారు చెప్పేది ఓపికగా వినాలని గవర్నర్ సూచించారు. "రోగి తన సమస్య చెబుతున్న సమయంలో చాలా మంది డాక్టర్లు ప్రిస్క్రిప్షన్ రాయడం, ఇంకేదో పనిలో బిజీగా ఉండటం సరికాదు. వైద్యులు మాట్లాడే విధానంతోనే జబ్బు నయమవుతుందన్న విశ్వాసం రోగిలో పెరుగుతుంది. అవసరం లేకుండా టెస్టులు చేయటం, పేషెంట్లను భయపెట్టేలా వ్యవహరించటం మంచిది కాదు. వైద్యులు ప్రాణాలు కాపాడే దేవుళ్లు. చాలా బాధ్యతగా ఉండాలి" అని అన్నారు. వీనస్ అసోసియేషన్ ఇండియా ఏర్పాటు చేసిన ఈ సదస్సులో 350 మందికి పైగా డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు. వాయ్ (వీనస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) యాప్‌ను గవర్నర్ నరసింహన్ ఆవిష్కరించారు.



- కార్పొరేటు వైద్యం సామాన్యులకు అందుబాటులో ఉండాలి
- 'వాయికాన్' సదస్సులో గవర్నర్ నరసింహన్

గురువారం హైదరాబాద్‌లో వాయికాన్ 12 సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ నరసింహన్



మేఘాలయ బొగ్గు గనిలో ఒకరి మృతదేహం గుర్తింపు

కొనసాగుతున్న సహాయ చర్యలు

న్యూఢిల్లీ/షిల్లాంగ్: మేఘాలయలో బొగ్గు గనిలో చిక్కుకున్న 15 మంది కార్మికుల్లో ఒకరి మృతదేహాన్ని నేవీ డైవర్లు గురువారం గుర్తించారు. రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ ద్వారా 60 నుంచి 210 అడుగుల లోతులో మృతదేహాన్ని గుర్తించినట్లు నేవీ అధికార ప్రతినిధి ట్వీట్ చేశారు. దానికి సంబంధించిన వీడియోను పోస్ట్ చేశారు. డాక్టర్ల బృందం పర్యవేక్షణలో మృతదేహాన్ని వెలికి తీస్తామన్నారు. మరోవైపు కొన్ని అస్థిపంజరాలు కూడా బయటపడినట్లు ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. గనిలో సల్ఫర్ ఎక్కువగా ఉండటం వల్ల మృతదేహాలు కుళ్లిపోయి ఉంటాయన్నారు. డీఎన్ఏ ఆధారంగా అస్థిపంజరాలను గుర్తించేందుకు ఫోరెన్సిక్ అధికారులు ఘటనాస్థలికి వస్తారని ఆయన అన్నారు. ఈస్ట్ జయంతియా హిల్స్ జిల్లాలో డిసెంబరు 13న అక్రమంగా నిర్వహిస్తున్న బొగ్గు గనిలోకి వెళ్లిన 15 మంది కార్మికులు నది నీరు ముంచెత్తడంతో చిక్కుకుపోయారు. కొందరు ప్రాణాలతో బయటపడ్డారు. 370 అడుగుల లోతు నుంచి నీటిని బయటకు పంపడం కష్టంగా మారింది. దీంతో కార్మికుల ఆచూకీ గుర్తించడం ఆలస్యమవుతోంది. కార్మికులు గల్లంతై నెల రోజులకుపైనే కావడంతో వారు బతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గనిలో చిక్కుకున్న కార్మికులను కాపాడే విషయంలో మేఘాలయ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. సహాయ చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో మైనింగ్ చేయకుండా వదిలేసిన ఇలాంటి గనులు 80 నుంచి 100 వరకు ఉన్నట్లు ఈస్ట్ జయంతియా హిల్స్ జిల్లా కలెక్టర్ చెప్పారు.

డోక్లాంలో చైనా దూకుడు

ఇండియన్ ఇంటలిజెన్స్ వర్గాల వెల్లడి

- 12 కి.మి. మేర రోడ్ల నిర్మాణం
- నేషనల్ హైవేలను కలిపే వ్యూహం
- దాదాపుగా పూర్తి కావచ్చిన పనులు

న్యూఢిల్లీ: సిక్కిం రాష్ట్రానికి ఆనుకుని ఉన్న డోక్లాం బోర్డర్‌లో రోడ్డు నిర్మాణ పనుల్లో చైనా దూకుడు ప్రదర్శిస్తోంది. ప్రధాన జాతీయ రహదారులను కలుపుతూ డోక్లాం పీఠభూమి వరకు రోడ్డు నిర్మిస్తోంది. మేరుగ్ లా నుంచి యాటుంగ్ వరకు సుమారు 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది. ఇది ఫినిషింగ్ టచ్‌లో ఉందని ఇంటలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే డోక్లాం పీఠభూమిలో చైనా పలు నిర్మాణాలు పూర్తి చేసింది. తాజాగా చేపట్టిన రోడ్డు నిర్మాణం పూర్తయితే, సైనిక బలగాలు, ఆయుధాల తరలింపులో వేగం పెరుగుతుందని ఇండియన్ ఆర్మీ పేర్కొంది. గతేడాది సెప్టెంబర్‌లోనే పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) ఈ పనులు ప్రారంభించినట్లు ఇంటలిజెన్స్ వర్గాలు చెప్పాయి. ప్రస్తుతం ఈ రోడ్డుపై తారు వేయడం పూర్తయిందని, త్వరలో పూర్తిస్థాయిలో సిద్ధం కానుందని సమాచారం. అంటే డోక్లాం సరిహద్దుల్లో పీఎల్ఏ బలగాల మోహరింపు మరింత పెరగనుందని ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

గతంలో బలగాలు తలపడింది ఇక్కడే

2017లో చైనా సైనికుల దుందుడుకు చర్యల ఫలితంగా డోక్లాంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. రెండు దేశాల సైనికులు రెండు నెలలకు పైగా ఇక్కడే తిష్టవేశారు. ఆ తర్వాత డ్రాగన్ కంట్రీ వెనక్కు తగ్గడంతో ఇండియన్ ఆర్మీ కూడా సైన్యాన్ని ఉపసంహరించుకుంది. అంతా సద్దుమణిగిందని అనుకుంటుండగా చైనా రోడ్డు నిర్మాణ పనులు మొదలెట్టింది. బోర్డర్‌లో రోడ్ల నిర్మాణంపై ఇండియా అభ్యంతరం వ్యక్తం చేసినా లెక్కచేయడంలేదు. ఈ ప్రాంతంలో చైనా మొత్తం 150 టెంట్లను నిర్మించిందని, ఆరు వేల కు పైగా వాహనాలను తిప్పుతోందని ఇంటలిజెన్స్‌వర్గాలు వెల్లడించాయి. ఇండియా అభ్యంతరాలను చైనా కొట్టిపారేస్తోంది. 'మా భూభాగంలో మేం చేపట్టే నిర్మాణాలతో మీకేంట'ని ఎదురు ప్రశ్నిస్తోంది. దీంతో మరోసారి ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉందని రక్షణశాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మేం కూడా నిర్మిస్తాం: ఆర్మీ చీఫ్

చైనా దూకుడు నేపథ్యంలో బోర్డర్‌లో రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు ఇండియన్ ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ చెప్పారు. సరిహద్దుల్లో నిర్మాణ పనులు చేపట్టడం సరికాదని ఇంతకాలం ఊరుకున్నామని, పీఎల్ఏ తీరుతో ఇప్పుడు తాము కూడా రోడ్లను నిర్మిస్తున్నామని ఆయన వివరించారు. సించల్ లా నుంచి అస్సాం మీదుగా టోర్సా నాలా దిశగా 4.9 కి.మి.ల రోడ్డును ఆర్మీ నిర్మించిందని చెప్పారు. మరోవైపు అమెరికా కాంగ్రెస్ హియరింగ్ లోనూ డోక్లాంలో చైనా తీరు చర్చకు వచ్చింది. సౌత్ చైనా సముద్రం వ్యవహారం మాదిరిగానే డోక్లాంలోనూ చైనా ప్రవర్తిస్తోందంటూ కాంగ్రెస్ సభ్యురాలు వాగ్నర్ ఆరోపించారు.



చైనా బెదిరింపుల నేపథ్యంలో తైవాన్ అప్రమత్తమైంది. సెంట్రల్ తైవాన్‌లో సైనిక విన్యాసాలను ముమ్మరం చేసింది. దీంట్లో భాగంగా గురువారం ఓహెచ్-58డీ కివా యుద్ధ హెలికాప్టర్ ఇలా ఫైర్ డ్రిల్ చేపట్టింది



డోక్లాం ఎక్కడుంది?

ఇండియా, చైనా, టిబెట్ సరిహద్దు ప్రాంతం.. బోర్డర్ లో పీఠభూమి, లోయ కలగలిపి ఉంటాయి. ఉత్తరాన టిబెట్ లోని చంబీ వ్యాలీ, తూర్పున భూటాన్ లోని హా వ్యాలీ, పశ్చిమాన సిక్కిం సరిహద్దులుగా ఉన్న ప్రాంతమే డోక్లాం.

ఇండో-పసిఫిక్‌లో చైనా స్థావరాలు

న్యూఢిల్లీ: చైనా తొలిసారిగా తన నావల్ బేస్‌ను ఆఫ్రికా శిఖరానగల జెబోటి దేశంలో 2017 ఆగస్టులో ఏర్పాటుచేసుకుంది. ఇప్పుడక్కడ మెరైన్లు, ఇన్‌ఫాంట్రీ కంబాట్ వాహనాలు, హెలికాప్టర్లు ఉన్నాయి. దీంతోపాటు పాకిస్థాన్, కంబోడియా, వనువాటు లాంటి ఇతర దేశాల్లో కూడా అదనంగా మిటలరీ బేస్‌లను ఏర్పాటుచేయాలని చైనా ఆలోచిస్తోంది. వ్యూహాత్మకంగా ఆ యాదేశాల్లో తన బలాన్ని పెంచుకోవడంతోపాటు కీలకమైన ఇండోపసిఫిక్ ప్రాంతంలో తిరుగులేని ఆధిపత్యం సాధించాలన్నది చైనా ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

అమెరికా గుండెల్లో రైళ్లు

సైనికపరంగా చైనా వ్యూహాత్మకంగా దూసుకుపోవడంతో అమెరికా గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. సైనిక, సైనికేతర విధానాల ద్వారా ప్రపంచంలో ఆధిపత్యాన్ని సాధించడానికి చైనా ప్రయత్నిస్తోందని అమెరికా అంచనావేస్తోంది. 2012-2016 మధ్య కాలంలో 20 బిలియన్ డాలర్ల విలువచేసే ఆయుధాలను, ఇతరత్రా మిలటరీ వస్తువుల్ని అమ్మడం ద్వారా ప్రపంచంలో నే ఐదో అతిపెద్ద ఆయుధాల సరఫరాచేసే దేశంగా చైనా ఉందని అమెరికా రక్షణశాఖ వర్గాలు చెప్పాయి. వీటిలో 8 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను ఒక్క ఇండోపసిఫిక్ దేశాలకే చైనా అమ్ముతోంది. చైనా ఆయుధాలను పాకిస్థాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలే ఎక్కువగా కొంటున్నాయి. మిడిల్ ఈస్ట్, నార్త్ ఆఫ్రికా దేశాలకు కూడా చైనా ఆయుధాలను అధికంగానే సరఫరా చేస్తోంది. పాకిస్థాన్ అయితే ఎనిమిది యూవాన్ క్లాస్ డీజిల్ ఎలక్ట్రిక్ సబ్‌మెరిన్లు, రెండు టైప్ 054ఏ మల్టీ రోల్ ఫ్రిగేట్స్, ఇతర ఆయుధాలను చైనా నుంచి కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మరోవైపు, జెబోటి బేస్ దగ్గర యుద్ధ నౌకల బెర్త్‌ను ఈ ఏడాది జూన్ నెలాఖరునాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

2020లోగా 13 లక్షల కిలోమీటర్ల రోడ్లు

- డ్రాగన్ కంట్రీ టార్గెట్ ఇదేనన్న అమెరికా
- 'చైనా మిలిటరీ పవర్' పేరుతో రిపోర్ట్ వెల్లడి

వాషింగ్టన్: పీపుల్స్‌లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) కదలికలను మరింత వేగవంతం చేసేందుకు వచ్చే ఏడాదిలోగా 1.3 మిలియన్‌కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించాలని చైనా లక్ష్యంగా నిర్ణయించుకుందని అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ వెల్లడించింది. దీంతో పాటు 26 వేల కి.మి.ల ఎక్స్‌ప్రెస్‌వేలు కూడా నిర్మించనుందని తెలిపింది. ఈమేరకు చైనా మిలిటరీ పవర్‌పేరుతో తయారుచేసిన ఓ రిపోర్టును కాంగ్రెస్‌కు అందజేసింది. చైనాలో ఇప్పటికే లక్ష కిలోమీటర్ల రైల్వే ట్రాక్, పదివేల కిలోమీటర్ల హైస్పీడ్ రైల్వే ట్రాక్‌ఉందని, దీనిపై గంటకు 250 కి.మి. వేగంతో రైళ్లు దూసుకెళ్లే వీలుంటుందని రిపోర్టులో పేర్కొంది. ఇక డొమెస్టిక్‌ఎయిర్ ఫీల్డ్స్‌ల సామర్థ్యాన్నీ పెంచుకునే చర్యలు చేపట్టిందని పెంటగాన్ తెలిపింది. ఎయిర్‌స్పేస్ ను నియంత్రించగల శక్తి కూడా పీఎల్ఏకుందని, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ తరహాలో అధికారాలు ఉన్నాయని చెప్పింది. దేశంలోని మూడింట ఒక వంతు ఎయిర్ పోర్టులు మిలిటరీకి కూడా సేవలందిస్తాయని పేర్కొంది.

శ్రీనగర్‌లో మిలిటెంట్ల అటాక్

ఇద్దరు పోలీసులకు గాయాలు

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో మిలిటెంట్లు ఘాతుకానికి పాల్పడ్డారు. జీరో బ్రిడ్జి వద్ద సెక్యూరిటీ సిబ్బంది పికెట్‌పై మిలిటెంట్లు గ్రెనేడ్‌తో అటాక్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు గాయాలవగా దగ్గర్లోని హాస్పిటల్‌కు తరలించారు. దాడి జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో అదనపు బలగాలను మోహరించి మిలిటెంట్ల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. నేషనల్ కాన్ఫరెన్స్ హెడ్ క్వార్టర్స్ కు అతిదగ్గరలోనే దాడి జరగడంతో ఆ ప్రాంతం అంతటా సెక్యూరిటీ సిబ్బంది హై అలర్ట్ ను ప్రకటించారు.

పందుల దిగుమతిపై మిజోరం నిషేధం

స్వైన్ ఫ్లూ అరికట్టే దిశగా చర్యలు

మిజోరం: స్వైన్ ఫ్లూను అరికట్టేందుకు మిజోరం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా ఇతర ప్రాంతాల నుంచి పందులు, పంది పిల్లల దిగుమతిని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా మయన్మార్ నుంచి పందులు, పందిపిల్లలను దిగుమతి చేసుకోవడంవల్లే ఈ వ్యాధి వ్యాపించినట్లు అధికారులు గుర్తించారు. గత ఐదేళ్లలో సుమారు 10 వేల మంది స్వైన్ ఫ్లూ బారినపడ్డట్టు అధికారులు చెప్పారు. ప్రావిన్స్ రిప్రొడక్టివ్ రెస్పిరేటరీ సిండ్రోమ్ (పీఆర్ఆర్ఎస్)తో శ్వాసకోశ వ్యాధులు, ఇతర సమస్యలతో ఎంతో మంది ఆస్పత్రుల్లో చికిత్సలు పొందారు.

అమెరికాలో 'హెచ్-1బీ' ఉద్యోగులకు వేధింపులు

వాషింగ్టన్: అమెరికాలో హెచ్ 1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగులు దోపిడీకి గురవుతున్నారా? అక్కడ పని వాతావరణం చాలా దారుణంగా ఉంటోందా? ఉద్యోగులు వేధింపులకు గురవుతున్నారా? అంటే అవుననే అంటోంది 'సౌతాసియా సెంటర్ ఆఫ్ ది అట్లాంటిక్ కౌన్సిల్ (ఎస్ఏసీఏసీ)' సంస్థ. ఉద్యోగుల వేతనాలు గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ మేరకు పలు సిఫార్సులతో ఓ రిపోర్టు విడుదల చేసింది.

ఉద్యోగ హక్కులు కల్పించాలి

"ప్రస్తుత హెచ్ 1బీ వీసా వ్యవస్థ అమెరికన్లకు హానికరం. అలాగే హెచ్ 1బీ వీసాపై పని చేసే ఉద్యోగులు కూడా దోపిడీకి గురవుతున్నారు. వేధింపులకు గురవుతున్నారు. వారికి తక్కువ జీతాలు చెల్లిస్తున్నారు. సరైన పని వాతావరణం కల్పించట్లేదు" అని ఎస్ఏసీఏసీ తెలిపింది. ఉద్యోగులకు సరైన పని వాతావరణం ఉండేలా చూసుకోవాలని, మరిన్ని ఉద్యోగ హక్కులు కల్పించాలని చెప్పింది. అప్పుడే వారి జీవితాలు మెరుగవుతాయని పేర్కొంది. ఈ రిపోర్టును హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన రోన్ హీరా, ఎస్ఏసీఏసీ హెడ్ భరత్ గోపాలస్వామి రూపొందించారు. హెచ్ 1బీ వీసా నిబంధనలను త్వరలోనే మారుస్తామని, వీటిని మరింత సులువు చేస్తామని, పౌరసత్వం కచ్చితంగా ఇచ్చేలా చూస్తామని ఈ మధ్యనే అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్ 1బీ ఉద్యోగుల జీతాలు, పరిస్థితులను మెరుగుపరచాలంటూ అట్లాంటిక్ కౌన్సిల్ రిపోర్టు విడుదల చేయడం గమనార్హం. హెచ్ 1బీ వీసాదారుల్లో ఎక్కువ మంది ఇండియన్లు ఉన్నారు.



- తక్కువ జీతాలిచ్చి దోపిడీ చేస్తున్నారు
- పని వాతావరణం కూడా దారుణం
- సౌతాసియా సెంటర్ ఆఫ్ ది అట్లాంటిక్ కౌన్సిల్ రిపోర్టులో వెల్లడి

మూడు సంస్కరణలు

ఎస్ఏసీఏసీ మూడు సంస్కరణలు సూచించింది. ఉద్యోగులందరికీ వీటిని వర్తింపజేయాలని చెప్పింది.

- హెచ్ 1బీ వర్కర్లకు జీతాలను పెంచాలి. ఉత్తమ, చురుకైన ఉద్యోగులను ఆహ్వానించాలని అమెరికా భావిస్తే.. నైపుణ్యానికి తగ్గట్లుగా వారికి భారీ స్థాయిలో జీతాలు చెల్లించాల్సిందే.
- అమెరికాకు చెందిన వర్కర్లను తరచూ నియమించుకుంటున్నామని, అర్హులకే ఉద్యోగాలిచ్చామని నిరూపించుకోవాలి.
- హెచ్ 1బీ వీసా విధానం అమలుకు సమర్థమైన ఎన్‌ఫోర్స్ మెంట్ మెకానిజం ఉండాలి.


డేరా బాబాకు యావజ్జీవం

హర్యానా: జర్నలిస్ట్ రామ్‌చంద్ర ఛత్రపతి హత్య కేసులో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్‌రామ్ రహీమ్‌సింగ్‌కు(డేరా బాబా) పంచకుల సీబీఐ ప్రత్యేక కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. జర్నలిస్టు హత్య కేసులో జనవరి 11న డేరా బాబాతో పాటు మరో ముగ్గురిని కోర్టు దోషిగా తేల్చింది. ఈ మేరకు గురువారం ఆయనతో పాటు దోషులుగా తేలిన వారికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పును ఇచ్చింది.

ట్రంప్ టీంలోకి ముగ్గురు ఇండో అమెరికన్లు!

వైట్ హౌస్ నుంచి సెనేట్‌కు జాబితా

వాషింగ్టన్: తన పాలన యంత్రాంగంలో కీలక పదవుల్లో నియమించేందుకు ముగ్గురు ఇండో అమెరికన్లను యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ నామినేట్ చేశారు. ఈ మేరకు నామినేషన్ల లిస్టును వైట్ హౌస్ నుంచి సెనేట్ పంపారు. అసిస్టెంట్ సెక్రెటరీ ఆఫ్ ఎనర్జీ (న్యూక్లియర్ ఎనర్జీ) పోస్టుకు రీటా బరన్వాల్, ప్రైవసీ, సివిల్ లిబర్టీస్ ఓవర్‌సైట్ బోర్డు మెంబర్‌గా ఆదిత్య బమ్జాయ్, అసిస్టెంట్ సెక్రెటరీ ఆఫ్ ట్రెజరీ పోస్టుకు బిమల్ పటేల్‌ను నామినేట్ చేశారు. రీటా, ఆదిత్య, బిమల్‌ను నియమించే యోచన ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన ట్రంప్, బుధవారం జాబితాను సెనేట్‌కు పంపారు. మరోవైపు ఇప్పటికే 30 మందికి పైగా ఇండో అమెరికన్లను ట్రంప్ పలు కీలక పదవుల్లో నియమించారు.



డ్యాన్స్ బార్లకు ఓకే

మహారాష్ట్ర సర్కార్ ఆంక్షలను సడలించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని డ్యాన్స్‌బార్లపై ఆ రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల్లో కొన్నింటిని సుప్రీం కోర్టు ఎత్తేసింది. డ్యాన్స్‌బార్లపైన కొన్ని నిబంధనలు ఉండాలే తప్ప పూర్తిగా నిషేధం ఉండకూడదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. బార్లపై నిబంధనలు విధిస్తూ 2016లో మహారాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ చట్టానికి వ్యతిరేకంగా రెస్టారెంట్లు, బార్ ఓనర్లు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను విచారించిన జస్టిస్ఎ.కె. సిక్రితో కూడిన బెంచ్ ఈ మేరకు గురువారం తీర్పు చెప్పింది. చట్టంలోని కొన్ని నిబంధనలను సమర్థించగా.. కొన్నింటిని వ్యతిరేకించింది. స్కూళ్లు, కాలేజీలు, ఆలయాలకు కిలోమీటర్ దూరంలో డ్యాన్స్‌బార్లు ఉండాలన్న ఆంక్షలను న్యాయస్థానం తోసిపుచ్చింది. ముంబై లాంటి సిటీల్లో ఈ నిబంధన లు అమలుచేయడం అసాధ్యమని కోర్టు అభిప్రాయపడింది.

సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 11:30 గంటలకు వరకు మాత్రమే డ్యాన్స్‌బార్లు పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిబంధనను కోర్టు సమర్థించింది. డ్యాన్స్‌బార్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేయడం తప్పనిసరి కాదని తీర్పు చెప్పింది. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తే వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. డ్యాన్స్‌చేసే వారికి టిప్‌ఇవ్వాలే తప్ప.. వారిపై డబ్బులు విసరకూడదని చెప్పింది. ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసుకోవచ్చని, డ్యాన్స్‌ఫ్లోర్లు, బార్‌రూమ్స్ వేర్వేరుగా ఉండాల్సిన అవసరం లేదని తేల్చింది. డ్యాన్స్‌చేసే ప్రదేశాల్లో లిక్కర్ అమ్మకాలకు కోర్టు అంగీకరించింది. డ్యాన్స్‌బార్ ఓనర్ మంచి వ్యక్తిత్వం కలిగి ఉండాలని, నేర చరిత్ర కలిగి ఉండకూడదనే నిబంధనను కోర్టు కొట్టేసింది. 2016లో డ్యాన్స్‌బార్ రెగ్యులేషన్ బిల్లులకు మహారాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. డ్యాన్స్‌చేసే ప్రదేశాల్లో లిక్కర్ సరఫరాను నిషేధించాలని, రాత్రి 11:30 తర్వాత బార్లను తప్పనిసరిగా మూసివేయాలని నిబంధనలు పెట్టింది. అంతే కాకుండా బార్లలో సీసీటీవీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయాలని, లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని అనేక నిబంధనలు తీసుకొచ్చింది.



సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముంబైలో మీడియాతో మాట్లాడుతూ విక్టరీ సింబల్‌ను చూపిస్తున్న బార్ డ్యాన్సర్లు

ప్రభుత్వ చట్టంలో ఏముంది?	సుప్రీంకోర్టు ఏం చెప్పింది?
స్కూల్స్, కాలేజీలు, ఆలయాలకు కిలోమీటర్ దూరంలో డ్యాన్స్‌బార్లు ఉండాలి	అది సాధ్యంకాదు
సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11:30 గంటలకు వరకు మాత్రమే డ్యాన్స్‌బార్లు పనిచేయాలి	దీంతో ఏకీభవిస్తున్నాం
సీసీటీవీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి	ఈ నిబంధన వ్యక్తిగత గోప్యతకు భంగం
డ్యాన్స్‌బార్ ఓనర్లకు మంచి వ్యక్తిత్వం ఉండాలి. వారికి నేర చరిత్ర ఉండకూడదు	మంచి వ్యక్తిత్వం, నేరచరిత్రకు సంబంధించి స్పష్టమైన నిర్వచనం లేదు



చట్టపరమైన చర్యలు తీసుకోండి: ఎన్సీపీ

డ్యాన్స్‌బార్ల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం బార్ల ఓనర్లతో ఒప్పందం కుదుర్చుకుందని, అందుకే కోర్టులో బలహీనంగా వాదించిందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ఆరోపించింది. డ్యాన్స్‌బార్లు తిరిగి తెరుచుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆపార్టీ నేత ధనుంజయ్ ముండే సీఎం ఫడ్నవీస్ ను కోరారు. మరోవైపు, తీర్పుపై ప్రతి వచ్చాక తగిన విధంగా స్పందిస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

తీర్పును స్వాగతించిన సామాజిక కార్యకర్తలు

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సామాజిక కార్యకర్తలు స్వాగతించారు. ఇది తమకు పెద్ద విజయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల దాదాపు 75,000 డ్యాన్సర్లు తమ ఉపాధిని కోల్పోయారని, వాళ్లందరు వేరే పనుల్లో స్థిరపడాల్సి వచ్చిందని భారతీయ బార్‌గార్ల్స్ యూనియన్ ప్రెసిడెంట్ వర్ష కాలే చెప్పారు. కోర్టు ఇచ్చిన తీర్పును నేపథ్యంలో ప్రభుత్వం డ్యాన్స్‌బార్లను పూర్తిగా నిషేధించొద్దని కోరారు.

మోడీ ఏంచేసినా తప్పేనా?

బ్లాగ్‌లో మండిపడ్డ కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: ఎన్డీయే సర్కార్ చేసే ప్రతి పనినీ కావాలని తప్పుపట్టే ఓ వర్గం తాజాగా తయారైందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆరోపించారు. మోడీ సర్కార్ ఏం చేసినా వ్యతిరేకించడానికే ఈ వర్గం అలవాటు పడిందని మండిపడ్డారు. అమెరికాలో కేన్సర్‌కు ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న జైట్లీ తన బ్లాగ్ లో ఈ మేరకు పోస్ట్ చేశారు. పరోక్షంగా కాంగ్రెస్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. "ఇలాంటివారు చేస్తున్న ఆరోపణలకు ఎన్ని సార్లు వివరణలు ఇస్తున్నా వారి ధోరణిలో మార్పు రావడం లేదు" అని ఆయన బ్లాగ్ లో పేర్కొన్నారు. ముఖ్యంగా లెఫ్ట్ పార్టీ ఐడియాలజీతో ఉన్న వారికి కేంద్రం చేపడుతున్న అన్ని పథకాల్లో తప్పులే కనిపిస్తున్నాయని దుయ్యబట్టారు. అనేక సామాజిక అంశాలపై ప్రజల అభిప్రాయాన్ని ఈ వర్గం పట్టించుకోవడం లేదన్నారు.



మోడీ సర్కార్ ను విమర్శించడమే ఆయన వ్యతిరేకులు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్రం ముందుకువస్తే ఆ నిర్ణయాన్ని కూడా వ్యతిరేకించారని మండిపడ్డారు.

ఇలాంటి వారు దేశ సమగ్రతను దెబ్బతీసేవారికి మద్దతు ఇస్తున్నారన్నారు. జస్టిస్ బీహెచ్ లోయా గుండెపోటుతో చనిపోతే, ఆయన చావుకు కుట్ర జరిగిందని అబద్ధాలు ప్రచారం చేశారన్నారు. రాఫెల్ డీల్ ను ప్రస్తావిస్తూ సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన తర్వాత కూడా ఆ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తారని రాహుల్ పేరు ప్రస్తావించకుండా విమర్శించారు. అలాగే సీబీఐ విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వానికి దురుద్దేశాలు ఆపాదించే ప్రయత్నాలు జరిగాయన్నారు. అబద్ధాలను ప్రచారం చేయడం ద్వారా ఈ కొత్తవర్గం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని అరుణ్ జైట్లీ విమర్శించారు.

పొగమంచు చంపేసింది



- రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వృద్ధ దంపతులు

నిజామాబాద్, వెలుగు: వేగంగా వెళ్తున్న కారు పొగమంచు కారణంగా డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న వృద్ధ దంపతులు అక్కడికక్కడి మృతి చెందారు. ఈ సంఘటన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్ పల్లి పరిధి నాకా తండా సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఆదిలాబాద్‌కు చెందిన గౌరిశెట్టివార్ ప్రకాష్(74), భార్య చంద(68), ఇతర కుటుంబ సభ్యులు 19 మందితో కలిసి రెండు వాహనాల్లో తీర్థయాత్రలు ముగించుకొని సొంతూరు వెళ్తున్నారు. గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో నాకా తండా సమీపంలోని జాతీయ రహదారిపై మంచు కారణంగా దారి సరిగా కనిపించలేదు. దీంతో వారు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. దాంతో ప్రకాష్, చంద అక్కడికక్కడే చనిపోయారు. ఎనిమిది మంది గాయాలతో బయటపడ్డారు. వారు స్థానిక హోప్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు మారెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, వెలుగు: పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా సిద్దిపేట జిల్లాకు చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. హైదరాబాద్‌లోని పౌర సరఫరాల భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్ అలీ, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరు కానున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ తొలి నామినేటెడ్ పదవికి మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని ఎంపిక చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని 33 గొర్రెలు మృతి

నిజామాబాద్, వెలుగు: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం బ్రిడ్జి వద్ద గురువారం గొర్రెలను తరలిస్తున్న ట్రాలీ ఆటోను బస్సు ఢీకొట్టింది. దీంతో 33 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. డిచ్‌పల్లి మండలం వద్యాట్ పల్లికి చెందిన ప్రకాశ్ ముదక్ పల్లి గ్రామానికి ట్రాలీ ఆటో 53 గొర్రెలను తీసుకుని వెళుతున్నాడు. ధర్మారం బ్రిడ్జి వద్ద బాన్సువాడ డిపోకు చెందిన బస్సు ఆటోను వెనక నుంచి వేగంగా ఢీకొట్టడంతో అందులోని 33 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ప్రమాదంలో ప్రకాశ్‌కు, అతని తమ్ముడు రతన్‌కు గాయాలయ్యాయి.

పేరిణిపై అవగాహన కోసం సదస్సు



పేరిణి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారిణి



మాట్లాడుతున్న యశోధా ఠాగూర్

హన్మకొండ సిటీ, వెలుగు : శాస్త్రీయంగా శబ్ద, శృతి లయలకు అనుగుణంగా నృత్య ప్రదర్శనలు ఉండాలని కూచిపూడి, దేవదాసి నర్తకి ప్రొఫెసర్ డాక్టర్ యశోదా ఠాగూర్ అన్నారు. హన్మకొండ నక్కల గుట్టలోని హరిత కాకతీయ హోటల్లో ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్, వరంగల్ కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ల నిర్వహణలో శాస్త్ర ప్రయోగ నృత్య రవళిపై రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. గణపతి దేవుని దగ్గర సేనాధిపతిగా పనిచేసిన జయసేనాపతి సంస్కృతంలో రాసిన నృత్యరత్నావళిపై పలువురు మాట్లాడారు. నృత్యరత్నావళిలో జయసేనాని లాస్యంగాన్ని విశ్లేషించారు. పేరిణి లాస్యాంగానికి మళ్లీ వైభవం తేవడానికి సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ పేరిణి కళాకారులు ప్రొఫెసర్ డాక్టర్ కళాకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ సంగీత కళాశాలలో పేరిణి నృత్యాన్ని ప్రవేశపెట్టారని, కళాకారులకు పేరిణిపై అవగాహన కలిపించేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కళాకారులు చేసిన పేరిణీ నృత్యం ఆకట్టుకుంది. సదస్సులో డాక్టర్ అరుణా భిక్షువు, సంప్రీతి , తేజస్విత, అద్వత వాదిని కౌల్, డాక్టర్ పాండురంగారావు పాల్గొన్నారు.

రామప్ప గుడిలో ఐజీ పూజలు



ములుగు, వెలుగు : వెంకటాపురం మండలం పాలంపేటలోని రామప్ప రామలింగేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ (టీఎస్ఎస్పీ) బెటాలియన్ ఐజీ అభిలాషా బిస్త్ కుటుంబ సభ్యులతోపాటు దర్శించుకున్నారు. బుధవారం లక్నవరం సందర్శించిన ఆమె గురువారం రామప్పకు వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ ఆమెకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామప్ప శిల్ప సంపద, నందీశ్వరుడిని చూసి అబ్బురపడ్డారు. గైడ్లు గోరంటల విజయ్‌కుమార్ , తాడవేన వెంకటేశ్ కాకతీయుల చరిత్రను వివరించారు. రామప్ప సరస్సు దగ్గర కొద్దిసేపు గడిపారు. ఎస్సై భూక్య నరహరి బందోబస్తు చేపట్టారు. కాగా, రామప్పను ఉక్రెయిన్ దేశస్థులు అర్టెం బిల్లీ, లెవిగన్ కొవాల్యూ, సర్గే పెట్రోవ్ దర్శించుకున్నారు. శిల్ప కళా నైపుణ్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు. శిల్ప సంపద, ఆలయ విశిష్ఠతను తెలుసుకున్నారు.



రామప్ప ఆలయ ప్రాంగణంలో ఐజీ కుటుంబసభ్యులు



పోలీస్‌పై నజర్

పోలీసుల మీద ప్రజల్లో ఎంతోకొంత వ్యతిరేకత ఉంటుంది. ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని ఎన్ని మార్పులు తెస్తున్నా పూర్తిగా ప్రజల నమ్మకాన్ని పొందలేకపోతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ఎలా అమలవుతుందో పరిశీలించడానికి థర్డ్‌పార్టీ సేవలను వినియోగించుకోనుంది. స్టేషన్‌కొచ్చే ప్రజలతో పోలీసులు ఎట్లా వ్యవహరిస్తున్నారు, కేసుల నమోదు, నేరాలు జరిగినప్పడు స్పందించే విధానం తదితర అంశాల మీద థర్డ్ పార్టీ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ విధానం కొన్ని కమిషనరేట్ల పరిధిలో విజయవంతం కావడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అమలు చేయాలని నిర్ణయించారు.

- పరిశీలనకు థర్డ్ పార్టీ వచ్చేసింది
- దేశంలోనే మొదటి సారి రాష్ట్రంలో అమలు
- ఫీడ్‌బ్యాక్ ఆధారంగా చర్యలు

భైంసా, వెలుగు: పోలీసుల పని తీరును థర్డ్‌పార్టీ ద్వారా పరిశీలించి వారి ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టనున్నారు. మంచి ఫీడ్ బ్యాక్‌వచ్చిన అధికారులకు, సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించనున్నారు. బాగా పని చేయనివారిని గుర్తించి వారి పనితీరు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సంబంధాలను మెరుగుపర్చేందుకు ఈ విధానం పనికొస్తుందని అంటున్నారు.

జిల్లాలో అమల్లోకి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ , నిర్మల్ జిల్లాల్లోని పోలీ సు కా ర్యాలయాలు, పోలీసు స్టేషన్లలో థర్డ్‌పార్టీ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరిస్తారు. స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితులతో మాట్లాడి సిబ్బంది, అధికారులు ఎలా ప్రవర్తిస్తున్నారు, రిసెప్షన్ కౌంటర్లలో ఉండే సిబ్బంది ఏ విధంగా స్పందిస్తున్నారు, ఘటన స్థలాలకు పెట్రోలింగ్, బ్లూ కోట్స్, స్టేషన్ అధికారులు ఎంత సేపట్లో చేరుకుంటున్నారు అనే విషయాలను తెలుసుకుంటారు. తాము సేకరించిన వివరాలను ప్రతినెలా ఉన్నతాధికారులకు అందజేస్తారు.

దేశంలోనే మొదటి సారి...

పోలీసు శాఖ పనితీరుపై థర్డ్‌పార్టీ సమాచారాన్ని సేకరించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. జిల్లాలో ఈ విధానం ఈ నెల 1న మొదలైంది. బాధితుడు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే ఆ సమాచారం డీజీపీ కార్యాలయానికి వెళ్తుంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైన వెంటనే థర్డ్‌పార్టీ పరిశీలన కూడా మొదలవుతుంది. ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదయినట్టు ఫిర్యాదుదారుడి ఫోన్‌కు మెస్సేజ్ వస్తుంది. కేసు పురోగతి గురించి ఫిర్యాదుదారుల నుంచి ప్రైవేటు ఏజెన్సీలు ఎప్పటికప్పుడు వివరాలను సేకరిస్తాయి. బాధితుడు తన కేసు ఏ స్టేజీలో ఉందో ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఉంటుంది.

పారదర్శకంగా సేవలందిస్తాం



ప్రజలకు పారదర్శకంగా సేవలందించేందుకు, మరింత నమ్మకాన్ని పొందేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. శాంతి భద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం లేకుండా చూసేందుకు థర్డ్ పార్టీ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీనివల్ల అవినీతి తగ్గడంతో పాటు సత్వర న్యాయం అందుతుంది.
శశిధర్‌రాజు, ఎస్పీ నిర్మల్

ప్రజల్లో మరింత నమ్మకం



పోలీసు శాఖ అందిస్తున్న సేవలపై ప్రజల్లో మరింత నమ్మకం కలిగించేందుకే రాష్ట్ర శాఖ థర్డ్ పార్టీ ఫీడ్ బ్యాక్ తీసుకుంటుంది. ఈ విధానం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలులోకి వచ్చింది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారుడి నుండి మా సిబ్బంది అందించిన సేవలను, తీరును ఎజన్సీలు రహస్యంగా సేకరిస్తాయి..
రాజేష్ భల్లా, డీఎస్పీ భైంసా

రెండు లారీలు, బస్సు ఢీ

- ఇద్దరికి గాయాలు
- ప్రమాదానికి పొగమంచే కారణం

మహబూబ్‌నగర్, వెలుగు: రెండు లారీలు, ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన గురువారం ఉదయం మహబూబ్‌నగర్ జిల్లాలోని దివిటిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగింది. ప్రమాదానికి గురైన వాటిలో సిలిండర్ లారీ కూడా ఉంది. కానీ అందులో ఖాళీ సిలిండర్లు ఉండడంతో భారీ ప్రమాదం తప్పినట్లయింది. ఉదయం సమయంలో ముందు వెళ్తున్న లారీని సిలిండర్ల లోడుతో వెళ్తున్న మరో లారీ ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీకొట్టింది. మంచు భారీగా ఉండడం, ముందు వెళ్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వెనుక నుంచి వచ్చిన బస్సు ఈ లారీలను ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు, సిలిండర్ల లోడు లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయ. వారిని చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



మేడిగడ్డ వద్ద బ్లాక్ ఫోర్ పనులను పరిశీలిస్తున్న స్మితాసబర్వాల్



గ్రావిటి కెనాల్ వద్ద సూచనలిస్తూ

మార్చి నెలాఖరే గడువు

- కాళేశ్వరం పనులు పరిశీలించిన స్మితాసబర్వాల్
- 15 రోజులుల్లో మళ్లీ వస్తా.. మార్పు కనించాలని ఆదేశం

కాటారం ,వెలుగు : మహాదేవపూర్ మండలం మేడిగడ్డలో నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులను ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితాసబర్వాల్ గురువారం పరిశీలించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వచ్చిన ఆమె ముఖ్యమంత్రి ఓఎస్డీ దేశ్‌పాండే, ఇరిగేషన్ లిఫ్ట్ సిస్టం అడ్వైజర్ పెంటరెడ్డి తో కలసి మేడిగడ్డ ,అన్నారం బ్యారేజీలు, కన్నేపల్లి పంప్ హౌస్లను చూశారు. బ్లాక్ ఫోర్ వ్యూ పాయింట్ వద్ద ఎల్ అండ్ టీ ఇంజినీర్లు ఏర్పాటు చేసిన ఫొటోలను పరిశీలించారు. బారేజ్ సీఈ నల్ల వెంకటేశ్వర్లు సీఎం కేసీఆర్ వచ్చివెళ్ళిన తరువాత పనులెలా జరుగుతున్నాయి, కాంక్రీట్ వర్క్ రోజుకు ఎంత జరుగుతోంది, ఎంతమంది కూలీలను పెంచారు, యంత్రాల వినియోగం పెరిగిందా తదితర అంశాల మీద ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. మహారాష్ట్ర వైపు జరుగుతున్న కరకట్టల పనులనుచూసిన స్మిత, భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని, మార్చిలోగా కరకట్టలు, ప్రధాన పనులు పూర్తిచేయాలని సూచించారు.

పంపు హౌజు లోకి దిగారు..

మేడిగడ్డ బ్యారేజీ పరిశీలించిన తర్వాత స్మితాసబర్వాల్ కన్నేపల్లి పంపుహౌజ్‌కు వెళ్లారు. పంపులు బిగిస్తున్న ప్రదేశానికి లిఫ్ట్ ద్వారా చేరుకొని పనులను చూశారు. ఇప్పటికి ఐదు పంపులు బిగించినట్టు, మరో రెండు పంపులను బిగిస్తున్నట్టు అధికారులు వివరించారు.

కాంట్రాక్టర్ల మీద ఆగ్రహం

గ్రావిటీ కెనాల్ వెంట పదమూడు కిలోమీటర్లు తిరిగి అన్నారం బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. గ్రావిటీ కెనాల్ పనులు ఏమాత్రం జరగడం లేదని తెలిసి ఆమె కాంట్రాక్టర్ల మీద మండిపడ్డారు,పది రోజుల్లో మళ్లీ వస్తా.. అప్పటివరకు పనిలో వేగం కనబడకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జనవరి 1న ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రాజెక్ట్ ను సందర్శించారు. వేగం పెంచాలని ఆదేశించారు. ఈ పదిహేను రోజులలో కలెక్టర్ రెండుసార్లు వచ్చి పనులు పరిశీలించారు. ఇప్పుడు స్మిత సందర్శించి మార్చు నాటికి నీరందించేలా పనులు చేయాలని ఆదేశించారు.

గోలివాడ పంపుహౌజ్ సందర్శన

రామగుండం, వెలుగు: అంతర్గాం మండలంలోని గోలివాడ పంప్ హౌజ్ పనులను కూడా స్మిత సబర్వాల్ పరిశీలించారు. ఆమె వెంట పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన ఉన్నారు. గోలివాడ పంప్ హౌజ్ పనుల్లో వేగం పెంచాలని, మార్చి చివరి నాటికి మోటార్ల బిగింపు పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. పంప్ హౌజ్ ల డ్రైరన్ పూర్తి చేసి, ఏప్రిల్‌లో వెట్ రన్ నిర్వహించేలా ప్లాన్ చేయాలన్నారు. . గోలివాడ పంప్ హౌజ్ పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసారు. పంప్ హౌజ్ పనుల్లో యంత్రాలను, లేబర్ పెంచాలన్నారు. పంప్ హౌజ్ పరిధిలో 1కోటి 09 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనిలో ఇప్పటి వరకు 1కోటీ 08 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయిందని, 5,65,588 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులలో భాగంగా 5,22,239 క్యూబిక్ మీటర్ల పని పూర్తి చేసామన్నారు. గోలివాడ పంప్ హౌజ్ లో 9 మోటార్లకు గాను ఇప్పటి వరకు 2 మోటార్ల బిగింపు పూర్తయిందని, జనవరి 28 నాడు డ్రై రన్ నిర్వహించాలని అన్నారు. మరో 2 మోటర్లను బిగించి ఫిబ్రవరి 25న డ్రై రన్ నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 10 నాటికి అన్ని మోటర్లను బిగించాలన్నారు.

క్విక్ బైట్స్



ఏపీ ప్రజల్ని మోసగిస్తున్న బాబు

- టీఆర్ఎస్ మీద ఏపీ మంత్రులది దుష్ప్రచారం : గుత్తా

నల్లగొండ, వెలుగు : టీఆర్ఎస్ , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు పొత్తు పెట్టుకున్నాయన్న టీడీపీ నేతల ప్రచారం అక్కడి ప్రజలను మోసం చేయడానికేనని ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఏపీలో టీఆర్ఎస్ ఎలా పోటీ చేస్తుందని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు అతీతంగా ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసేందుకు కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా జగన్‌తో మాట్లాడారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని అక్కడి ప్రజలను కోరారు. గురువారం ఆయన నల్లగొండలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోవడం ఖాయమని, జగన్మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ ఓర్వలేకనే టీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల మీద దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తులు, నదీ జలాల పంపకాలు సజావుగా జరగాలంటే రెండు రాష్ట్రాల నడుమ సుహృద్భావ వాతావరణం అవసరమని, దానికోసమే జగన్‌ను ఫెడరల్ ఫ్రంట్‌లోకి ఆహ్వానిస్తున్నామన్నారు.



పండుగకు పోయి వస్తుంటే ప్రమాదం

- లారీ కిందకు దూసుకెళ్లిన కారు
- ఐదుగురికి గాయాలు

మిర్యాలగూడ, వెలుగు: అదుపు తప్పి లారీ కిందకు కారు దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం మిర్యాలగూడ మండలం కొత్తగూడెం వద్ద అద్ద-నార్కట్‌పల్లి హైవేపై జరిగింది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా గుడ్లూరుకు చెందిన కందుకూరి మాధవన్ హైదరాబాద్‌లో కాంట్రాక్టర్‌గా పనిచేస్తుంటారు. సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబ సభ్యులందరితో కలిసి స్వగ్రామం వెళ్లాడు. పండుగ ముగియడంతో తల్లి వరమ్మ, భార్య సునీతతో పాటు, కుమార్తె మృదుల, కుమారుడు అఖిల్‌తో కలిసి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో కొత్తగూడెం వద్దకు రాగానే కారు అదుపు తప్పి పక్కనే ఉన్న లారీ కిందకు దూసుకెళ్లింది. దీంతో కారు నడుపుతున్న మాధవన్‌తో పాటు, పక్కనే కూర్చున్న సునీతకు తీవ్రగాయాలు కాగా, మిగతా ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు.

ఎట్టకేలకు గ్రామానికి రానున్న మృతదేహాలు

- 24వ తేదీన అమెరికాలో ముగ్గురు చిన్నారులు మృతి
- శనివారం గుర్రపుతండాలో అంత్యక్రియలు

దేవరకొండ, వెలుగు: అమెరికాలోని కొలివిరిలో గత నెల 24న జరిగిన అగ్నిప్రమాదంలో చనిపోయిన చిన్నారుల మృతదేహాలు ఎట్టకేలకు స్వగ్రామానికి చేరుకోనున్నాయి. నల్లగొండ జిల్లా నేరడుగొమ్ము మండలం గుర్రపుతండాకు చెందిన ముగ్గురు చిన్నారులు సాత్విక షరోన్‌నాయక్, ఆరోన్ సుహాస్‌నాయక్, జాయ్‌సుచితనాయక్‌లు అమెరికాలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. మృతదేహాలను తల్లిదండ్రులు శ్రీనివాస్‌నాయక్, సుజాతలు గురువారం అమెరికా నుంచి ప్రత్యేక విమానంలో తీసుకొస్తున్నట్లు మృతుల బంధువులు తెలిపారు. మృతదేహాలు శుక్రవారం ఉదయం శంషాబాద్‌ఎయిర్‌పోర్టుకు చేరుకుంటాయని అనంతరం నారాయణగూడలోని బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు నిర్వహించి స్వగ్రామానికి తరలించనున్నారు. స్వగ్రామానికి తీసుకొచ్చిన అనంతరం శనివారం అంత్యక్రియలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు మృతుల పెదనాన్న చంద్రునాయక్ తెలిపారు.

నేటి నుంచి యూత్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్

- ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ కవిత
- ప్రారంభ వేడుకకు అన్నా హజారే, ముగింపు రోజు గవర్నర్ హాజరు

హైదరాబాద్, వెలుగు : తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు జరగనుంది. నోవాటెల్ హోటల్‌లో నిర్వహించే ఈ సదస్సుకు 135 దేశాల నుంచి 550 మంది డెలిగేట్స్ హాజరవుతున్నారు. 16 దేశాల నుంచి 70 మంది వక్తలు ప్రసంగిస్తారు. 40 మంది ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొంటారు. సదస్సు ఏర్పాట్లను జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత గురువారం పరిశీలించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి గం.9.30వరకు గాలా డిన్నర్‌తో సదస్సు ప్రారంభమవుతుందన్నారు. శనివారం ఉదయం సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే సదస్సును ప్రారంభిస్తారని తెలిపారు. సార్క్ మాజీ సెక్రెటరీ జనరల్ అర్జున్ బహదూర్ తపా, ప్రముఖ పాత్రికేయుడు శేఖర్‌గుప్తా, ఎంపీలు గౌరవ్‌గోపాల్, అసదుద్దీన్ ఒవైసీ ప్రసంగిస్తారన్నారు. 19న సాయంత్రం జరిగే ముగింపు వేడుకకు గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్టు తెలిపారు. 'గాంధేయమార్గంలో సుస్థిర అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై సదస్సులో చర్చ ఉంటుందన్నారు. 2030 వరకు భవిష్యత్ మానవాళి మనుగడకు అవసరమైన లక్ష్యాలను సాధించేందుకు ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 17 అంశాల సాధనకు సదస్సు నిర్వహిస్తున్నట్లు కవిత చెప్పారు.

ఆర్టీసీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ

- ఆర్టీసీ ఈడీ పురుషోత్తం

హైదరాబాద్, వెలుగు: ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ) పురుషోత్తం తెలిపారు. సంస్థ ఖాళీ స్థలాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని నిర్ణయించామన్నారు. గురువారం బస్‌భవన్ లో హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ ప్రతినిధులతో ఆర్టీసీ అధికారులు సమావేశమయ్యారు. ఆయిల్ అవుట్‌లెట్లలో సౌకర్యాల కల్పన విషయాల్లో సమన్వయంతో పనిచేసేందుకు ఆర్టీసీ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు అంగీకరించారన్నారు. ఇంధన అవుట్‌లెట్స్ నిర్వహణలో సమస్యలను పరిష్కరిస్తేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు.



గురువారం అగ్రివిజన్ 2019 సదస్సులో మాట్లాడుతున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

యువత వ్యవసాయం చెయ్యాలి

- టెక్నాలజీ జోడించి కొత్త ఒరవడులు సృష్టించాలి
- సర్కార్ క్రాప్ కాలనీల ఏర్పాటు చాలా బాగుంది: వెంకయ్య
- అగ్రివిజన్ 2019 సదస్సును ప్రారంభించిన ఉపరాష్ట్రపతి

హైదరాబాద్, వెలుగు: నేటి యువత వ్యవసాయంపై దృష్టి పెట్టాలని, టెక్నాలజీని జోడించి కొత్త ఒరవడులు సృష్టించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఓ డాక్టర్ తన కొడుకు డాక్టర్ కావాలనుకుంటున్నాడుగానీ ఓ రైతు మాత్రం తన కొడుకు రైతు కావాలని కోరుకోవట్లేదని అన్నారు. వ్యవసాయ రంగంలో సరైన లాభాలు లేకపోవడం వల్లే రైతన్నలు వేరే మార్గం చూసుకోవాల్సి వస్తోందన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్రివిజన్ 2019 సదస్సును ఆయన ప్రారంభించారు. కష్టపడేది రైతులైతే లాభపడుతోంది మాత్రం దళారులున్నారు. కోల్డ్ స్టోరేజీలు లేకపోవడం వల్ల రైతులు తమ పంటను మధ్యవర్తులకు అమ్మేస్తున్నారని, ప్రభుత్వం చొరవ చూపి వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు రుణమాఫీ శాశ్వత పరిష్కారం కాదని, 24 గంటల నాణ్యమైన కరెంట్‌ను అందించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన క్రాప్ కాలనీల ఏర్పాటు మంచి ఆలోచన అన్నారు.

బీఫ్ ఫెస్టివల్‌తో హెచ్‌సీయూలో న్యూసెన్స్

వేదాలు, ఉపనిషత్తులను చాలామంది విమర్శిస్తున్నారని, కానీ, వాటిలో శాస్త్రీయత ఉందని వెంకయ్య అన్నారు. జ్ఞానంలో ప్రపంచానికే దేశం గురువుగా ఉండేదన్నారు. అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో అధికారులు మాతృభాషలో మాట్లాడితే బాగుంటుందన్నారు. గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ కంప్యూటర్ డిపార్ట్‌మెంట్ తీసుకొచ్చిన భాషా అనువాద సాఫ్ట్‌వేర్ (సారా)పై జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఓ సర్వే ప్రకారం దేశంలో పది శాతం మందే ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నారని, మిగతా వాళ్లు మాతృభాషలో మాట్లాడేందుకే ఇష్టపడుతున్నారని తేలిందని చెప్పారు. కిస్ ఫెస్టివల్, బీఫ్ ఫెస్టివల్ పేరుతో హెచ్‌సీయూలో కొందరు విద్యార్థులు న్యూసెన్స్ క్రియేట్ చేశారని, రాజకీయ నాయకులు దీని ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నించారని వెంకయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలింగ్‌కు భారీ భద్రత

రోజువారీ రిపోర్టులివ్వండి.. కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశం

హైదరాబాద్, వెలుగు:

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారులకు ఎన్నికల సంఘం సూచించింది. రెండోదశ ఎన్నికలకు గురువారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తి అయ్యింది. తొలిదశ పోలింగ్ 21న, రెండో దశ పోలింగ్ 25న జరగనుంది. జిల్లాల్లో ఇప్పటికే ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిస్టిక్ సర్వేలైన్స్ టీమ్‌లు పనితీరుపై రోజూ నివేదికలు అందజేయాలని కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. పంచాయతీ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తున్నందున బ్యాలెట్లకు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే తొలిదశ ఎన్నికలకు 756 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. 4116 పంచాయతీలకు నిర్వహించే మూడో దశ పోలింగ్‌కు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగుస్తుంది.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వనపర్తి జిల్లా ఘన్‌పూర్ ఎంపీడీవో ఎం.ఫయాజుద్దీన్‌ను జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) సస్పెండ్ చేశారు. స్థానిక హెడ్‌క్వార్టర్‌లో ఉండకపోవడం, అత్యవసర ఎన్నికల రిపోర్టును ఇవ్వకపోవడం వంటి కారణాలతో ఆయన్ను సస్పెండ్ చేశారు. డీఆర్‌డీఏ ఏపీవో కృష్ణయ్యకు ఆ బాధ్యతలను అప్పగించారు.

ఆ డిగ్రీ, పీజీలు చెల్లవు



- రాష్ట్రంలో ఇతర యూనివర్సిటీల స్టడీ సెంటర్లు
- యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు
- పాస్ గ్యారంటీ అంటూ విద్యార్థులకు ఎర
- అవి చెల్లవంటున్న ఉన్నత విద్యామండలి
- విద్యార్థులకు అవగాహన కల్పించడంలో విఫలం

హైదరాబాద్, వెలుగు: ఒక రాష్ట్ర యూనివర్సిటీ స్టడీ సెంటర్ మరో రాష్ట్రంలో కొనసాగడానికి వీల్లేదు. ఇది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధన. కానీ మన రాష్ట్రంలో 200 వరకు ఇతర రాష్ట్రాల డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్లు నడుస్తున్నాయి. అవి ఇచ్చే సర్టిఫికెట్లు చెల్లవని ఉన్నత విద్యామండలి అధికారులు చెబుతున్నారు. విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం, ఉన్నత విద్యామండలి దీన్ని సీరియస్‌గా తీసుకోకపోవడంతో రాష్ట్రంలో ఇతర వర్సిటీల అడ్మిషన్లు ఆగడం లేదు. పాస్ గ్యారెంటీ స్కీమ్‌తో మరింత మందిని చేర్చుకుంటున్నాయి.

యూజీసీ ఏం చెబుతోంది?

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తీసుకొచ్చిన 'దూర విద్యా కేంద్రాల ప్రాదేశిక పరిధి 2013' ప్రకారం ఒక రాష్ట్రంలోని స్టేట్ యూనివర్సిటీ లేదా డీమ్డ్ యూనివర్సిటీ లేదా ప్రైవేటు యూనివర్సిటీ ఇతర రాష్ట్రాల్లో స్టడీ సెంటర్లను పెట్టొద్దు. వాటి ద్వారా కోర్సులు నిర్వహించొద్దు. ఈ విషయమై 2013 ఆగస్టు 23న అన్ని రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లకు యూజీసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలతో మన ఆచార్య జి.రామిరెడ్డి దూర విద్యాకేంద్రం (ఓయూ), ఎస్‌డీఎల్‌ఈసీఈ (కేయూ) ఇతర రాష్ట్రాల్లోని స్టడీ సెంటర్లను ఎత్తేశాయి. కానీ ఇతర రాష్ట్రాల యూనివర్సిటీలు ఇక్కడ అడ్మిషన్లు ఇస్తున్నాయి.

రాష్ట్రంలో 200కుపైగా స్టడీ సెంటర్లు

రాష్ట్రంలో కేయూ (ఎస్డీ ఎల్‌సీఈ) ఆధ్వర్యంలో 117 స్టడీ సెంటర్లు ఉండగా, ఉస్మానియా దూర విద్యాకేంద్రం 10 స్టడీ సెంటర్లు, మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను) మూడు స్టడీ సెంటర్లు నిర్వహిస్తోంది. ఇతర రాష్ట్రాల స్టడీ సెంటర్లు 200కుపైగా నడుస్తున్నాయి. వీటిలో ఏపీకి చెందిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్య కేంద్రానివే 122 స్టడీ సెంటర్లున్నాయి. శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ స్టడీ సెంటర్లు 20కిపైగా, ద్రవిడ యూనివర్సిటీ స్టడీ సెంటర్లు 28, పెరియార్ యూనివర్సిటీ 22, భోజ్ యూనివర్సిటీ 13, సిక్కిం మణిపాల్ యూనివర్సిటీ 10, మదురై కామరాజ్ 5, ఆంధ్రా యూనివర్సిటీ 2, అన్నామలై యూనివర్సిటీ 2 స్టడీ సెంటర్లు, పాండిచ్చేరి, మద్రాసు వర్సిటీ, వెంకటేశ్వర, గీతం యూనివర్సిటీలకు చెందిన స్టడీ సెంటర్లు మూడు చొప్పున ఉన్నాయి.

సమయం, డబ్బు వృథా

రాష్ట్రంలో ఇగ్నో, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సర్టిఫికెట్లనే అనుమతిస్తున్నారు. ఇతర రాష్ట్రాల డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డిగ్రీలు కనీసం పీజీలో చేరేందుకూ ఉపయోగపడడం లేదు. గతంలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎంబీఏ, లా తదితర కోర్సుల్లో చేరిన విద్యార్థుల అడ్మిషన్లను ఉన్నత విద్యామండలి రద్దు చేసింది. నాగార్జున యూనివర్సిటీ అధికారులు మాత్రం రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పదేళ్ల వరకు ఉమ్మడి విద్యా అవకాశాల విధానం అమల్లో ఉన్నందున తమ సర్టిఫికెట్లు చెల్లుతాయంటున్నారు. అయితే 2013 నుంచి ఇప్పటివరకు వేలాది మంది ఈ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కూడా పొందారు. ఇంకొందరు ఉన్నత విద్య చదువుతున్నారు.

వాటిల్లో చేరొద్దు

రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల డిస్టెన్స్ ఎడ్యుకేషన్ స్టడీ సెంటర్లు నిర్వహించడం చట్ట విరుద్ధం. వాళ్లిచ్చే డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లు రాష్ట్రంలో చెల్లవు. ఈ సెంటర్లలో అడ్మిషన్ పొందేవారు జాగ్రత్తగా ఉండాలి. వీటిపై చర్యలు తీసుకోవాలని యూజీసీకి లేఖ రాస్తాం.

- తుమ్మల పాపిరెడ్డి,
రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్

వర్మీ కంపోస్ట్ విధానం బాగుంది



వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న విదేశీ ప్రతినిధులు

యాదాద్రి, వెలుగు: యాదాద్రి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను గురువారం పలువురు విదేశీయులు సందర్శించారు. ఎరువు తయారీ విధానంపై అధ్యయనం చేసేందుకు వియత్నాం, కొలంబియా, ఉగాండా, శ్రీలంక, జింబాబ్వే, కెన్యా, అర్జెంటీనా, మారిషస్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, ఇథియోపియా, తజకిస్థాన్ దేశాలకు చెందిన 19 మంది పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో భువనగిరికి వచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో తడి, పొడి చెత్త సేకరించే విధానం, డంపింగ్ యార్డుకు తరలింపు, వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో సేకరించే చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేసే విధానం బాగుందన్నారు. తమ దేశాల్లో కూడా వర్మీ కంపోస్ట్ తయారీకి శ్రీకారం చుడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ బి.కళ్యాణ చక్రవర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ నువ్వుల ప్రసన్న, విదేశీ ప్రతినిధులు అబ్దుల్‌షేక్ అహ్మద్, మినయిలాల్‌సిసయ్, ఫరీద్ ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

ఆర్మూర్, వెలుగు: ఈనెల 21 నుండి 24 వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరుగనున్న జాతీయ స్థాయి అండర్ 16 బాలబాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును గురువారం ఆర్మూర్‌లో ఎంపిక చేశారు. కబడ్డీ అసోసియేషన్‌రాష్ట్ర కార్యదర్శి ఉషిరెడ్డి, ఉపాధ్యక్షులు కర్తయ్య, అజీజ్‌ఖాన్, జిల్లా కార్యదర్శి ఎం.గంగాధర్ సమక్షంలో రాష్ట్ర జట్టు ఎంపిక చేశారు.

అంతర్రాష్ట్ర బదిలీలకు జూన్ వరకు గడువు

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీల గడువును జూన్ నెలాఖరు వరకు పొడిగిస్తూ రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతర్రాష్ట్ర బదిలీల కోసం 2018 డిసెంబర్ చివరి వరకు ధరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే అవకాశం ఉంటుందని జీవోలో పేర్కొన్నారు.

ఆ 15మందిని ఇండియాకు పంపించండి

- ఇరాక్‌లోని ఇండియన్ కాన్సులేట్‌కు రాష్ట్ర సీఎస్ లేఖ
- ఏజెంట్ మోసంతో ఇరాక్‌లో కల్లివెల్లి అయిన నిజామాబాద్ జిల్లావాసులు

హైదరాబాద్, వెలుగు: ఏజెంట్ మోసాలకు బలై ఇరాక్‌లో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న నిజామాబాద్‌కు చెందిన 15మందిని ఇండియాకు పంపించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ ఎస్‌కే జోషి అక్కడి ఇండియన్ కాన్సులేట్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన లేఖ రాశారు. ఏజెంట్ మోసం చేయడంతో కూడు, గూడు లేకుండా పోయిందని, దేశానికి తిరిగి రావడానికి వాళ్ల దగ్గర డబ్బులు కూడా లేవని వివరించారు. భద్రత విషయంలోనూ వారి కుటుంబ సభ్యులు ఇక్కడ ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందించి, వీలైనంత త్వరగా ఇండియాకు పంపించేలా చర్యలు తీసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

చర్యలు తీసుకోండి: తమ్మినేని

బతుకుదెరువు కోసం ఇరాక్ వెళ్లి మోసపోయిన నిజామాబాద్ జిల్లా వాసులను వెంటనే ఇండియాకు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఇలాంటి సమస్యలు మళ్లీ రాకుండా అధికారులతో కమిటీ వేసి వలస కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు కనుక్కోవాలన్నారు. రాష్ట్రం నుంచి అరబ్ దేశాలకు ఎంతమంది వలస వెళ్లారో సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. మోసాలకు పాల్పడే ఏజెంట్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, వెలుగు: ఎస్సీ కార్పొరేషన్, కెల్ట్రాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధి శిక్షణకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం భూక్యా తెలిపారు. టెన్త్ క్లాస్ పూర్తయిన 18 నుంచి 35 ఏళ్ల వయసున్న నిరుద్యోగులు అర్హులన్నారు. వర్డ్ ప్రాసెసింగ్, డేటా ఎంట్రీ, ఎంఎస్ ఆఫీస్, బేసిక్ ఆటోమేషన్, ట్యాలీ కోర్సులలో మూన్నెళ్ల పాటు శిక్షణ ఉంటుందన్నారు. గ్రామీణుల వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షల లోపు ఉన్నవారు జిల్లా ఎస్సీ కోఆపరేటివ్ అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ బోడుప్పల్‌లోని కెల్ట్రాన్ సంస్థలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.



కాస్ట్లీ పోరు

ఒక క్యాండిడేట్ రూ.30 లక్షలు ఖర్చు పెడతానంటే.. మరో లీడర్ రూ.40 లక్షల నుంచి దిగుతలేడు. ఇన్ని లక్షలు ఖర్చు పెడ్తామంటున్నారంటే ఇదేదో అసెంబ్లీ ఎలక్షన్ల కోసమనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఇది గ్రామ పంచాయతీ ఎన్నికల ముచ్చట. బాగా పైసలున్నోళ్లు సర్పంచు పదవి కోసం ఎంత ఖర్చుకైనా వెనకాడడం లేదు. గెలిచిన తర్వాత చూసుకోవచ్చు లే అని పోటీకి సై అంటూ ఓటర్లకు గాలం వేయడానికి ట్రై చేస్తున్నారు.

- సర్పంచ్ పదవులకు పెరిగిన డిమాండ్
- రూ.30-40 లక్షలు ఖర్చుకు రెడీ అవుతున్న అభ్యర్థులు

మెదక్, వెలుగు:

ఆయా పంచాయతీల్లో ఒక్కో క్యాండిడేట్ రూ.30 నుంచి 40 లక్షలు ఖర్చు పెట్టేందుకు రెడీ అవుతున్నారు. మెదక్ జిల్లాలోని పలు పంచాయతీల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. ప్రధాన పార్టీల సపోర్టుతో పోటీ చేస్తున్న క్యాండిడెట్ల ఖర్చు అసెంబ్లీ ఎలక్షన్లను మరిపిస్తుండటం గమనార్హం. గ్రామ పంచాయతీ ఎలక్షన్లలో సర్పంచ్‌కి పోటీచేసే క్యాండిడేట్లు ఐదు వేల జనాభా ఉన్న పంచాయతీల్లో రూ.2.50 లక్షలు, అంతలోపు ఉన్న పంచాయతీల్లో రూ.1.50 లక్షలు మాత్రమే ఖర్చుపెట్టాలి. కానీ పలు చోట్ల పదవులు చాలెంజ్‌గా మారడం, సంపాదనకు అవకాశం ఉండటంతో పోటాపోటీగా లక్షలు ఖర్చు పెట్టేందుకు రెడీ అవుతున్నారు. మెదక్‌కి నాలుగు కి.మీ. దూరంలో ఉన్న మాచవరం గ్రామ ఎలక్షన్లు ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఈ గ్రామ సర్పంచ్ పదవి మహిళలకు రిజర్వు అయ్యింది. ఇక్కడ టీఆర్ఎస్ సపోర్టుతో మాజీ సర్పంచ్ భార్య పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ తరపున ప్రముఖ ఎడ్యుకేషన్ ట్రస్ట్ యజమాని భార్య పోటీ చేయనున్నారు. రెండు పార్టీలు ప్రిస్టేజ్‌గా తీసుకుని ఎలాగైనా గెలవాలని దండిగా ఖర్చు పెట్టేందుకు ప్లాన్ చేసుకొంటున్నాయి. ఓటర్ల మద్దతు కోసం పొద్దున టిఫిన్లు, మధ్యాహ్న భోజనాలు, రాత్రికి మందు, మటన్, చికెన్‌లతో దావత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలకు చీరలు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. మాచవరంలో ఎలక్షన్ ఖర్చు రూ.40 లక్షలు దాటుతుందని ప్రచారం జరుగుతోంది.

ఇండస్ట్రియల్ ఏరియాలో డిమాండ్

మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, కూచారం, ముప్పిరెడ్డిపల్లి, చేగుంట, చిన్నశంకరంపేట, ఖాజాపూర్, మిర్జాపల్లి పంచాయతీ ఎలక్షన్లు కూడా కాస్ట్లీగా మారాయి. ఆయా పంచాయతీల పరిధిలో ఇప్పటికే పలు పెద్దపెద్ద కంపెనీలు ఉండగా, ఇండస్ట్రియల్ పార్కులుగా అభివృద్ధి చెందుతుండటం, నేషనల్ హైవే మీద ఉన్న భూముల రేట్లు దండిగా పెరగడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం ఇందుకు కారణం. కొత్తగా కంపెనీలు ఏర్పాటు చేయాలన్నా, ఉన్నవాటిని విస్తరించాలన్నా పంచాయతీ పర్మిషన్ అవసరం. వెంచర్లు ఏర్పాటు చేయాలంటే అగ్రికల్చర్ ల్యాండ్‌ను నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా కన్వర్షన్ చేయించేందుకు, లేఔట్ చేసేందుకు జీపీ పర్మిషన్ తీసుకోవాలి. అందువల్ల ఆయా పంచాయతీలకు ట్యాక్స్‌ల రూపంలో ఇన్‌కం రావడంతోపాటు, సర్పంచ్‌లకు కూడా ఇన్‌కం ఉంటుంది. దీంతో సర్పంచ్ పదవులకు బాగా డిమాండ్ ఏర్పడింది. గెలిస్తే ఐదేళ్లదాకా పవర్ చేతిలో ఉంటుందని పలువురు లీడర్లు సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఇంట్రెస్టు చూపిస్తున్నారు. నామినేషన్ వేసింది మొదలు పోలింగ్ రోజు వరకు వెంట తిరిగే లీడర్లు, కార్యకర్తల ఖర్చుతోపాటు, మెజారిటీ ఓటర్ల మద్దతు కోసం ఎంత ఖర్చుకైనా వెనకాడటం లేదు. పలు చోట్ల గంపగుత్తగా కుల సంఘాల ఓట్లను కొనేందుకు లక్షలు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు.

రోహిత్ వర్ధంతి సభ ఉద్రిక్తం

- హెచ్ సీయూ గేటు వద్ద రోహిత్ తల్లి, నేతలను అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థుల ఆందోళనతో అనుమతి

హైదరాబాద్, వెలుగు:

పీహెచ్ డీ స్కాలర్ రోహిత్ వేముల మూడో వర్ధంతి సందర్భంగా గురువారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయూ)లో ఉద్రిక్తత నెలకొంది. బయటి వ్యక్తులను వర్సిటీలోకి అనుమతించేది లేదని రాధిక వేములతోపాటు దళిత, ప్రజాసంఘాల నేతలను వర్సిటీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, ప్రజాసంఘాల నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. విద్యార్థులు గేటువరకు ర్యాలీగా వచ్చి వీసీ అప్పారావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థి నేతలతో చర్చలు జరిపిన పోలీసులు ముఖ్యనేతలను మాత్రమే పంపేందుకు అనుమతించారు. రాధిక వేములతో పాటు పలువురు దళిత నేతలు వెలివాడ వరకు ర్యాలీగా వెళ్లారు. రోహిత్ వేముల విగ్రహానికి పూల మాలలతో నివాళులు అర్పించారు. వర్ధంతి సభలో మాట్లాడిన రాధిక వేముల " నా కుమారుడి చావుకు వీసీ అప్పారావే కారణం, అతడిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడుతున్నాయి. నిందితులపై చర్యలు తీసుకునేవరకూ పోరాటం కొనసాగిస్తా" అని అన్నారు. సభలో ఫాతిమా నఫీజ్ (జేఎన్‌యూ విద్యార్థి నజీబ్ తల్లి), మ్యాదరి రాజు (మ్యాదరి వెంకటేశ్ సోదరుడు), అడ్వకేట్ జై భీంరావ్, పుల్యాల రవి (పుల్యాల రాజు సోదరుడు), పెరుమల్ల బాలస్వామి (ప్రణయ్ తండ్రి), అనూప్, కేవీ రత్నం, జేబీరాజు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు అభినందనలు

- సింగపూర్ మంత్రి ఈశ్వరన్ లేఖ

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన సీఎం కేసీఆర్‌కు సింగపూర్ పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి ఎస్.ఈశ్వరన్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు లేఖ రాసిన ఆయన తెలంగాణలో సింగపూర్ కంపెనీల ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఉందన్నారు. కేసీఆర్ హయాంలోనే హైదరాబాద్‌లో డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ సింగపూర్ (డీబీఎస్) టెక్నాలజీ హబ్ ఏర్పాటైందని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వృద్ధిరేటు 17.17 శాతం మేరకు పెరిగిందన్నారు. తెలంగాణతో సింగపూర్ ఆర్థిక సంబంధాలు మరింతగా బలపడుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏమన్నారంటే



శెభాష్ ఇండియా

పేదలకు వైద్యం అందించటంలో ఇండియా ముందుంది. 'ఆయుష్మాన్ భారత్'లో 6.85 లక్షల మంది లబ్ధి పొందటం గొప్ప విషయం.

– బిల్‌గేట్స్, మైక్రోసాఫ్ట్ ఫౌండర్



బోనీ కపూర్‌కి భయపడను

ఒక నటికి లండన్‌లో ఏం జరిగిందనేదే నేను చూపిస్తున్నా. దానిపై బోనీ కపూర్‌కి ధైర్యంగా జవాబిస్తా.

– ప్రశాంత్ మాంబుల్లి, 'శ్రీదేవి బంగ్లా' సినిమా డైరెక్టర్



ఐయామ్ వెరీ బిజీ

సినిమాలు చూసే టైం లేదు. వెయిట్ తగ్గించుకోవటానికి వర్కౌట్లు చేస్తున్నా. 'ఆర్ఎక్స్ 100'ని మమ్మీతో కలిసి చూసి ఇబ్బందిపడ్డా.

– పాయల్ రాజ్‌పుత్, నటి



అమిత్ షాకు మరిన్ని రోగాలు

కర్ణాటకలో కాంగ్రెస్–జేడీఎస్ సర్కార్‌ను కూల్చాలని అమిత్ షా పన్నాగం వేశాడు. అందుకే స్వైన్ ఫ్లూ సోకింది. భవిష్యత్‌లో ఫివర్, డయేరియా కూడా రావొచ్చు.

– బీకే హరిప్రసాద్, కాంగ్రెస్ లీడర్



కొలీజియంలో ఏం జరిగింది యువరానర్?

హైకోర్టుల్లోని సీనియర్ జడ్జిలను కాదని జూనియర్‌లకు సుప్రీంకోర్టు జడ్జిలుగా ప్రమోషన్ ఇవ్వటం ఇందిరాగాంధీ హయాంలోనూ ఇష్టారాజ్యంగా జరిగినా అప్పట్లో కాస్తో కూస్తో ట్రాన్స్‌పరెన్సీ ఉండేది. ఎందుకలా చేయాల్సి వచ్చేదో చెప్పేవాళ్లు. 1973లో ముగ్గురు సీనియర్ జడ్జిలను పక్కన పెట్టి జూనియర్లకు పదోన్నతి కల్పించారు. సీనియర్ల సోషల్ ఫిలాసఫీ 'రియాక్షనరీ' ఉందన్న కారణంతో పట్టం కట్టేందుకు పరిగణనలోకి తీసుకోలేదు. 1977లోనూ ఒక అనుభవజ్ఞుడైన న్యాయమూర్తికి ఇలాగే అందలం ఎక్కే అవకాశం చేజారింది. హెబియస్ కార్పస్ కేసులో గవర్నమెంట్‌కి వ్యతిరేకంగా తీర్పివ్వటం ఆయనకు ప్రతికూలంగా మారింది.

రీసెంట్‌గా ఢిల్లీ హైకోర్టులోని ముగ్గురు సీనియర్ జడ్జిలకూ జుడీషియల్ కొలీజియం నుంచి ఇలాంటి చేదు అనుభవమే ఎదురుకావటం మిస్టరీగా మారింది. దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ఒకరు తన నిరసనను వ్యక్తం చేశారు. దీంతో ఈ ప్రక్రియ మొత్తం చట్ట ప్రకారం జరగలేదన్న భావన న్యాయ వర్గాల్లో ఏర్పడింది. 2018 డిసెంబర్ 12న సమావేశమైన సుప్రీంకోర్టు కొలీజియం ఆ రోజు కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు 2019 జనవరి 10 నాటి కొలీజియంలో ఆమోదం పొందిన తీర్మానాన్ని బట్టి తెలుస్తోంది. రాజస్థాన్, ఢిల్లీ హైకోర్టు సిట్టింగ్ చీఫ్ జస్టిస్‌లను సుప్రీంకోర్టు జడ్జిలుగా ఎలివేట్ చేయటం కోసమే కొలీజియం తొలి సిట్టింగ్‌లో నిర్ణయాలు తీసుకున్నట్లు క్లియర్‌గా కనిపిస్తోంది. అయితే ఆ డెవలప్‌మెంట్లను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదు. అంతేకాదు. ప్రభుత్వానికీ తెలియజేయలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కొలీజియం కొత్త నిర్ణయాలేవైనా తీసుకుంటే వాటిని సర్కారుకు చెప్పటం దాని బాధ్యత. రిక్రూట్‌మెంట్లు జరిగినా, ప్రమోషన్లు ఇచ్చినా సంబంధితులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లను జారీ చేసే ప్రాసెస్‌కి ఇది తప్పనిసరి కూడా. కానీ, అప్పుడు అది జరగలేదు.

జనవరి 10 నాటి తీర్మానాన్ని బట్టి గత కొలీజియం సంప్రదింపుల ప్రక్రియను చేపట్టలేకపోయిందని, పూర్తి చేయలేకపోయిందని అనుకోవటం సరికాదు. కన్సల్టేషన్స్ అనేది కంపల్సరీగా చేయాల్సిన పని. దీనికోసం కొలీజియం తనకుతానుగా 'మెమొరండం ఆఫ్ ప్రొసీజర్'ని ఏర్పాటుచేసుకుంది. ఏ జడ్జిలకు ప్రమోషన్ ఇవ్వాలనే అంశంపై చర్చలు జరపకపోయి ఉంటే అంతకుమించిన షాకింగ్ విషయం మరొకటి ఉండదు. దేశంలోనే సీనియర్ మోస్ట్ జడ్జిలు ఉన్న కొలీజియం అనుసరించిన మెతక వైఖరికి ఇది నిదర్శనంగా నిలిచేది. తొలి మీటింగ్‌లో కన్సల్టేషన్స్ పూర్తి కాలేదని, వాటిని కొత్త సభ్యుడి రాకతో ఏర్పడిన నూతన కొలీజియం ఈ నెల 5, 6 తేదీల్లో కొలిక్కి తెచ్చిందని తీర్మానం వివరిస్తోంది. ఈలోపు జూనియర్ జడ్జిలకు సంబంధించి అదనపు డేటా రావటం, దాన్ని పరిగణనలోకి తీసుకోవటంతో గతంలో షార్ట్ లిస్ట్ చేసిన ఇద్దరు సీనియర్‌లను సైడ్ చేసినట్లు భావించొచ్చు. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. కొలీజియం రహస్యంగా వ్యవహరించి అనవసర పుకార్లకు, నిందలకు అవకాశం ఇచ్చింది. కొలీజియంలోకి కొత్తగా వచ్చిన సభ్యుడిని పక్కన పెడితే మిగతా నలుగురూ నెల రోజుల వ్యవధిలోనే తమ ఆలోచనలను ఎందుకు మార్చుకున్నారనేది అంతుచిక్కటంలేదు.

కేంద్రంలో బీజేపీ పవర్‌లోకి రాకముందు కొలీజియం సిస్టం వద్దన్నవాళ్లు తర్వాత మనసు మార్చుకున్నారు. అదే కావాలని కోరుకున్నారు. దాని ద్వారానే న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా ఉంటుందని ఆశించారు. నేషనల్ జ్యుడిషియరీ అపాయింట్‌మెంట్స్ కమిషన్‌ని సుప్రీంకోర్టు కొట్టేయడంతో ఆనందించారు. వాళ్లంతా ఇప్పటికైనా రియలైజ్ కావాలి. న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు తెస్తుందన్న ఆశతో అప్పుడు కొలీజియం కోసం ఎంత అమాయకంగా డిమాండ్ చేశారో ఆలోచించాలి. కోరి తెచ్చుకున్న ఆ వ్యవస్థ ఇప్పుడు తమ ముందరి కాళ్లకు ఎలా బంధం వేస్తోందో గుర్తించాలి.

- రాజు రామచంద్రన్, సీనియర్ లాయర్

ఎందుకంత తొందర?

సుప్రీంకోర్టు జడ్జి పోస్టులు ఐదు ఖాళీగా ఉన్నాయని జనవరి 10 నాటి కొలీజియం తీర్మానం చెప్పింది. కానీ, ప్రస్తుతానికి ఇద్దర్నే తక్షణం నియమించాలని నిర్ణయించారు. దేశంలోని అన్ని న్యాయ స్థానాల మాదిరిగానే సుప్రీంకోర్టులోనూ పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతుంటే నాలుగు పోస్టులను ఖాళీగా ఉంచటం ఎంత వరకు కరెక్ట్?. గతేడాదీ ఇలాగే ఆరుగురు న్యాయమూర్తులు కావాలని చెప్పి ఇద్దర్నే(జస్టిస్ ఇందు మల్హోత్రా, జస్టిస్ కేఎం జోసెఫ్‌లను) సిఫారసు చేశారు. అత్యున్నత న్యాయస్థానంలోనే అన్ని వేకెన్సీలను భర్తీ చేయనప్పుడు ఇక హైకోర్టుల్లోని, కింది కోర్టుల్లోని ఖాళీల మాటేంటి?. వాటిలో విచారణలు వేగవంతమయ్యేదెలా?

పంటకు కాలుష్యం పీడ

వాతావరణ మార్పుల ప్రభావాలు, పెరుగుతున్న కాలుష్యం పబ్లిక్ హెల్త్‌తోపాటు పంటల ఆరోగ్యానికీ చేటు చేస్తున్నాయి. వరి, గోధుమ, మొక్కజొన్న, జొన్న, ఆవాలు, ఆలుగడ్డలు, పత్తి, కొబ్బరిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దీని నివారణకు సకాలంలో చర్యలు తీసుకోకపోతే 2050 నాటికి గోధుమ ఉత్పత్తి 6–23 శాతం, మొక్కజొన్న దిగుబడి 18 శాతం తగ్గుతుంది. టెంపరేచర్ ఒక్క డిగ్రీ సెంటీగ్రేడ్ పెరిగితే వీట్ ప్రొడక్షన్ ఆరు వేల కిలోలు పడిపోతుంది. వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించటానికి సరైన చర్యలు చేపడితే మొక్కజొన్న ఉత్పత్తి వాస్తవానికి 21 శాతం వృద్ధి చెందాల్సింది. కానీ, దానికి భిన్నమైన పరిస్థితి నెలకొంది.

క్లైమేట్ ఛేంజ్ ప్రభావం భూగోళం మొత్తం పైనా పడుతోంది. వ్యవసాయంపై మరింత తీవ్రంగా ఉంటుంది. 2020 నాటికి వరి దిగుబడి 4-6 తగ్గుతుంది. వరి నాణ్యతా దెబ్బతింటుంది. వాతావరణ మార్పులకు అడ్డు కట్ట వేస్తే మొక్కజొన్న మాదిరిగా ధాన్యం దిగుబడి కూడా 17-20 శాతం ఎక్కువే ఉంటుంది. గాలిలో కార్బన్‌డైఆక్సైడ్ ఎంత పెరిగితే ఆహార ధాన్యాల్లో ప్రొటీన్, జింక్, ఐరన్, ఇతర ఖనిజాలు అంతగా తగ్గుతాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో ఆలుగడ్డల దిగుబడి 2020 నాటికి 2.5 శాతం, 2050 నాటికి 6 శాతం, 2080 నాటికి 11 శాతం మైనస్ అవుతుంది.



సోయాబీన్ ఉత్పత్తి మాత్రం 2030-2080 మధ్య కాలంలో 8-13 శాతం పెరిగే అవకాశం ఉంది. పశ్చిమ తీర రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, తూర్పు తీరంలోని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో కొబ్బరి దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. వాతావరణ మార్పులతో యాపిల్ ప్రొడక్షన్‌పై నెగెటివ్ ఎఫెక్ట్ పడనుంది. పాల దిగుబడి 2020 నాటికి 1.6 మెట్రిక్ టన్నులు, 2050 నాటికి 15 మెట్రిక్ టన్నులు పడిపోతుంది. ఈ నష్టం ఉత్తరప్రదేశ్‌లో భారీగా ఉంటుంది. తమిళనాడు, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ కూడా ప్రభావితం కానున్నాయి. టెంపరేచర్ పెరిగితే కోడిగుడ్ల, మాంసం ఉత్పత్తీ కొండెక్కుతాయి. నేల కోతకు గురవుతుంది. నీటి కొరత ఏర్పడుతుంది.

వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కోవటానికి దేశంలోని రైతులు క్రమంగా రెడీ అవుతున్నారు. ప్రస్తుతం ఉన్న పంటల రకాల కన్నా ఉత్తమమైనవాటిని, భిన్నమైనవాటిని ఎంచుకుంటున్నారు. పంటలు, పశువులు, నీటి యాజమాన్యం తదితరాలపై దృష్టి పెడుతున్నారు. నాలుగు ఎకరాల కన్నా తక్కువ భూమిగల చిన్న, సన్నకారు రైతులు కేవలం వ్యవసాయంపైనే ఆధారపడి బతకలేరు. వారికి ఆ ఆదాయం ఎటూ సరిపోదు. అందువల్ల ఇలాంటి వ్యవసాయ అనుకూల వ్యూహాలతో సొంత సేద్య విధానాలను తయారుచేసుకోవాలి.

క్లైమేట్‌పై 'అగ్రి' ఎఫెక్ట్

వాతావరణ మార్పులు పంటలపై ఎలా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయో అలాగే వ్యవసాయ విధానాలు, సాంకేతికతలు వాతావరణంపై నేరుగా చెడు ప్రభావం చూపుతున్నాయి. రసాయన ఎరువులను, పురుగుల మందులను, కీటక నాశనులను విచ్చలవిడిగా వాడటం వల్ల గాల్లో గ్రీన్ హౌస్ వాయువులు పెరిగాయి. పంటల వ్యర్థాలు, కంచెలు, పిచ్చి చెట్లు, కలుపు మొక్కలకు మంట పెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడుతోంది. 1970-2014లో గ్రీన్ హౌస్ వాయువులు 80 శాతం పెరిగాయి. వరి పొలాల నుంచి 33 టన్నుల మీథేన్ గ్యాస్ గాల్లో కలిసింది. హెక్టార్ వరి పొలం 0.5-2 కిలోల నైట్రస్ ఆక్సైడ్‌ని వెలువరిస్తోంది.

కెమికల్ ఎరువులు యమ డేంజర్

వాతావరణంలోని మొత్తం నైట్రస్ ఆక్సైడ్‌లో 75-80 శాతం కెమికల్ ఫెర్టిలైజర్స్ నుంచే వస్తున్నట్లు తేలింది. దేశంలో ఏటా 500-550 టన్నుల పంట వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా. 600-620 టన్నుల చెత్త చేరుతోందనేది మరో ఎస్టిమేషన్. ఇందులో 15.9 శాతం వ్యర్థాలను ప్రతి సంవత్సరం దహనం చేస్తున్నారు. ఫలితంగా కార్బన్‌డైఆక్సైడ్, మీథేన్, కార్బన్ మోనాక్సైడ్ వంటివి చేరి గాలి కలుషితమవుతోంది. చివరికి గ్లోబల్ వార్మింగ్ ఏర్పడుతోంది. వరి పొలంలోని టన్ను చెత్తాచెదారాన్ని మండిస్తే మూడు కిలోల పర్టిక్యులేట్ మేటర్, 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్, 1460 కిలోల కార్బన్‌డైఆక్సైడ్, 2 కిలోల సల్ఫర్‌డైఆక్సైడ్ రిలీజ్ అవుతున్నాయి.

ఉరీ.. టెక్నికల్‌గా టాప్!



జమ్ముకశ్మీర్‌లోని ఉరీ ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రవాదుల దాడి, దానికి ప్రతీకారంగా పాకిస్తాన్ టెర్రరిస్ట్ స్థావరాలపై ఇండియన్ ఆర్మీ చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ వంటి వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన సినిమా 'ఉరీ: ది సర్జికల్ స్ట్రైక్'. జనవరి 11న విడుదలైన ఈ యాక్షన్ మూవీకి ప్రశంసలతోపాటు భారీ స్థాయిలో వసూళ్లు కూడా దక్కాయి. కథ ఆర్మీది కాబట్టి ఈ సినిమా చూసే విషయంలో ఆర్మీ పర్సనల్స్ కోణం సగటు ప్రేక్షకుడి కంటే ఎంతో కొంత భిన్నంగా ఉంటుంది. కాబట్టే, నిజజీవితంలో ఉరీ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేసిన లెఫ్టినెంట్ జనరల్ సయీద్ అతా హస్నేన్.. ఉరీ సినిమాపై రాసిన రివ్యూ చర్చనీయాంశమైంది. ఆయన రాసింది తెలుగులో అందిస్తున్నాం..



ఉరీ: ది సర్జికల్ స్ట్రైక్ సినిమాపై జడ్జిమెంట్ కావాలనుకునేవాళ్లు సింపుల్‌గా రివ్యూలను ఫాలోఅయితే సరిపోతుంది. నిజానికి నేను కూడా అక్కడి నుంచే మొదలుపెడతాను. అత్యంత వినోదాత్మకంగా తీసిన(హైలీ ఎంటర్‌టెయిన్డ్) సినిమాలో మంచి నటన, స్టోరీలైన్, చక్కటి డైరెక్షన్‌ను మనం చూడొచ్చు.

కన్‌ఫ్యూజన్ లేని క్లియర్ థీమ్

కొత్త దర్శకుడు ఆదిత్య ధర్.. ఎలాంటి కన్‌ఫ్యూజన్‌కు తావులేని థీమ్‌ను తీసుకున్నాడు. ఉరీ ఆర్మీ క్యాంప్‌ని ఉగ్రవాదులు ఎటాక్ చేయటం, ఆర్మీ చరిత్రలోనే అత్యంత భీకరదాడుల్లో ఒకటిగా నిలిచిన ఆ ఘటనల్లో మన జవాన్లు 20 మంది చనిపోవడం, దీనికి ప్రతీకారంగా ఎల్‌వోసీ వెంబడి ఉన్న టెర్రరిస్ట్ స్థావరాలపై ఇండియన్ ఆర్మీ స్పెషల్ ఫోర్స్(ఎస్ఎఫ్) సర్జికల్ స్ట్రైక్ చేపట్టడం 'ఉరీ' మెయిన్ థీమ్. మొత్తం సినిమాను చాప్టర్లుగా విభజించి ప్రెజెంట్ చేసిన తీరు బాగుంది. అసలీ 'సర్జికల్ స్ట్రైక్'కు బీజం పడింది ఉరీ ఉగ్రదాడి నేపథ్యంలోనో, జమ్ముకశ్మీర్ వేదికగానో కాదు, ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో. 2015, జూన్ 4న మణిపూర్ సరిహద్దుల్లో ఎన్ఎస్‌సీఎన్ (నాగా) తీవ్రవాదులు జరిపిన మెరుపుదాడిలో 18 మంది ఇండియన్ ఆర్మీ జవాన్లు చనిపోయారు. సరిగ్గా ఆరు రోజుల తర్వాత, అంటే జూన్ 10న మనవాళ్లు.. ఇండో-మయన్మార్ సరిహద్దు వెంబడి ఉన్న నాగా ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడ్డారు. ఇటీవలి కాలంలో ఇండియా చేపట్టిన తొలి సర్జికల్ స్ట్రైక్ అది. పారా స్పెషల్ ఫోర్స్ అధికారి మేజర్ విహాన్ సింగ్ షెర్గిల్ (విక్కీ కౌషల్) కథ కూడా అక్కడే మొదలవుతుంది. సర్జికల్ దాడుల్లో ఉరి రెండోదన్నమాట.

యాక్షన్ సీన్స్ బాగున్నాయ్


హెలికాప్టర్ల నుంచి దిగి, శత్రుస్థావరాలపై మనవాళ్లు విరుచుకుపడే దృశ్యాలు.. సోకాల్డ్ బాలీవుడ్ సినిమాల్లో కంటే 'ఉరీ'లో చాలా బాగా చూపించారు. స్పెషల్ ఫోర్స్ కమాండర్లు ఫిజికల్‌గా, మెంటల్‌గా ఎంత ఫిట్‌గా ఉంటారో సినిమాలోనూ అలానే చేశారు. ఆయుధాలను ఎలా వాడాలన్నదానిపైనా యాక్టర్లకు స్పెషల్ ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలుస్తుంది. సర్జికల్ స్ట్రైక్ కంటే ముందు, మేజర్ విహాన్ సింగ్ స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలనుకుంటాడు. ముసలి తల్లి కోసం ఉద్యోగాన్ని వదిలేయాలనుకున్న అతను.. పై అధికారుల సూచన మేరకు ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లో ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్(ఐడీఎస్) విభాగంలో డెస్క్ జాబ్‌లో చేరతాడు. తన ప్రాణమిత్రుడు(అతను కూడా స్పెషల్ ఫోర్స్ ఆఫీసరే) ఉరీ ఉగ్రదాడిలో చనిపోవడంతో విహాన్ మళ్లీ ఫీల్డ్ మీదికి బయలుదేరుతాడు. పారా స్పెషల్ ఫోర్స్‌కు సంబంధించిన సీన్లు చక్కగా చిత్రీకరించారు. మేజర్ విహాన్ తన మదిలోని సర్జికల్ స్ట్రైక్స్ ఐడియాను నేరుగా ఆర్మీ చీఫ్‌కు చెప్పి, అనుమతి పొందుతాడు. ఆర్మీ చీఫ్ నుంచి అప్రూవల్ వచ్చిన తర్వాత సినిమా మొత్తం సర్జికల్ స్ట్రైక్స్ చుట్టూ తిరుగుతుంది.

టెర్రరిస్టులకు సంబంధించిన పక్కా సమాచారాన్ని ఇంటెలిజెన్స్ ద్వారా సేకరించడం, దాడి ఎలా చేయాలో ప్లాన్ చేయడం, ఎలాంటి ఆయుధాలు, సాధనాలు వాడాలో డిసైడ్ కావడం, వాటన్నింటినీ విజయవంతంగా ఎలా అమలు చేశారు లాంటి సీన్లన్నీ ప్రేక్షకులను తలతిప్పనీయకుండా అద్భుతంగా తీశారు. మనం శత్రువులను అంతం చేయబోతున్నామనే ఫ్యాంటసీలోకి ప్రేక్షకులను తీసుకెళ్లడంలో దర్శకుడు సఫలమయ్యాడు. నిజానికి సర్జికల్ స్ట్రైక్ లాంటి భారీ ఆపరేషన్లకు సంబంధించిన ప్లానింగ్‌లో చిన్నస్థాయి అధికారుల పాత్ర పరిమితంగా ఉంటుంది. ఆర్మీలో అంతర్భాగమైన స్పెషల్ ఫోర్స్ తన సర్జికల్ స్ట్రైక్స్ ఐడియాని మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టరేట్ (డీజీఎంవో)తో షేర్ చేసుకోవడానికి నిరాకరించినట్లు, డీజీఎంవోకు బదులు హెడ్‌క్వార్టర్స్‌లోని ఐడీఎస్ విభాగానికి రిపోర్ట్ చేసినట్లు సినిమాలో చూపించారు. రియాలిటీ ఏంటంటే, ఐడియాలు పంచుకోవడం సినిమాలో చూపెట్టినదానికి పూర్తి వ్యతిరేకంగా జరుగుతుంది. ఇక ఆర్మీ చీఫ్, నార్తర్న్ ఆర్మీ కమాండర్ల పాత్రల్ని బలహీనంగా చూపెట్టడం, కీలకమైన డీజీఎంవోను అసలు ప్రస్తావించకపోవడం సినిమా చూసే సగటు సైనికుడిని నిరాశకు గురిచేస్తుంది. అయితే, ఇది రియాలిటీ కాదు సినిమా అన్న స్పృహ గుర్తొచ్చినప్పుడల్లా మమ్మల్ని మనం సముదాయించుకుంటాం.



ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్లు

ఎంతో ప్రాధాన్యం ఉండే ఆర్మీ సింబల్స్‌ని ఉరీ సినిమాలో ఇష్టారీతిగా వాడేశారు. నిజానికి పారా స్పెషల్ ఫోర్స్ సిబ్బంది సెరిమోనియల్ పీక్ టోపీని అస్సలు పెట్టుకోరు. సినిమాలో మాత్రం హీరో దర్జాగా ఆ టోపీ పెట్టేసుకుంటాడు. ప్రధానమంత్రికి భద్రతా సలహాదారుడు లాంటి సివిలియన్‌లు ఆర్మీలో కింది స్థాయి అధికారులతో నేరుగా మాట్లాడటం కూడా వాస్తవదూరమే. వాస్తవ ఘటనలకు తెరరూపమిచ్చానన్న దర్శకుడు ఆదిత్య ధర్.. కథనానికి ఫ్యాంటసికల్ టచ్ ఇచ్చి నేటి తరాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు.



ఎల్వీ ప్రసాద్ ఎందరికో స్ఫూర్తి

::: బాలకృష్ణ

ఒకప్పుడు బుడి బుడి అడుగులు వేస్తోన్న తెలుగు సినిమాని వడివడి నడకలు నడిపించి, తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచిన దర్శక నిర్మాత ఎల్వీ ప్రసాద్. గురువారం ఆయన 111వ జయంతి. ఈ సందర్భంగా ప్రసాద్ ల్యాబ్స్‌లో సినీ ప్రముఖులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన జయంతిని నిర్వహించారు. అనంతరం రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ 'ఎన్నో సంవత్సరాలు సినిమానే నమ్ముకుని, తన శక్తిసామర్థ్యాలన్నీ సినిమా అభివృద్ధికే వెచ్చించారు మా నాన్నగారు. మాకంటే కూడా ఆయన సినిమానే ఎక్కువగా ప్రేమించారు. సినిమాతోనే ఎక్కువ సమయం గడిపారు. ఒక స్టూడియో నుంచి మరో స్టూడియోకి వెళ్లేటప్పుడు కారులో విశ్రాంతి తీసుకునేవారు. అప్పట్లో మాక్కూడా ఆయనతో గడిపే సమయం ఎక్కువ లభించేది కాదు. ఎన్నో విషయాల్లో గెలిచిన ఆయన నన్ను నటుడిగా చూడాలనుకున్న విషయంలో మాత్రం ఓడిపోయారు. ఆయన సినిమా మనిషి. సినిమా లేకుండా ఆయన లేరు' అన్నారు. సీనియర్ నటి గీతాంజలి మాట్లాడుతూ "సీతారామకళ్యాణం చిత్రంతో రామారావు గారు నన్ను పరిచయం చేస్తే.. 'ఇల్లాలు' చిత్రంలో అద్భుతమైన పాత్రనిచ్చి ఎల్వీ ప్రసాద్ ప్రోత్సహించారు. ఇప్పటికీ నాతో చాలామంది ఆ రెండు సినిమాల గురించి, అందులోని పాత్రల గురించి మాట్లాడతారు. ఆ రెండు పాత్రలూ వారిద్దరూ నాకు ఇచ్చిన వరాలు. జీవితాంతం వారిని స్మరించుకుంటాను' అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలకృష్ణ మాట్లాడుతూ 'తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆద్యుల్లో ఎల్వీ ప్రసాద్ ఒకరు. తెలుగు చిత్ర పరిశ్రమ సత్తాను యావత్ భారతదేశానికీ చాటారాయన. ఆయన ఓ నిఘంటువు. అలాంటి వ్యక్తి గురించి చెప్పడమంటే సూర్యుడికి వెలుగు చూపించడమే అవుతుంది. సినిమా పట్ల ఆయనకు ఎంతో ప్యాషన్. సినిమాని నమ్ముకోవడమే కాదు.. అదే సినిమా రంగానికి పదింతలు తిరిగి ఇవ్వడం కూడా ఆయనకు తెలుసు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అనే నానుడికి ఉదాహరణగా నిలిచారు ఎల్వీ ప్రసాద్. కళ.. కళ కోసమే కాదు, సమాజ సేవ కోసం కూడా అన్నట్టుగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించి సమాజ సేవ చేశారు. ఆయన కుటుంబ సభ్యులు దాన్ని కొనసాగిస్తున్నారు. అలాంటి మహోన్నత వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకుని మనం కూడా సమాజానికి కొంత ఉపయోగపడాలి' అన్నారు. రమేష్ ప్రసాద్ కూతురు రాధ మాట్లాడుతూ 'ఎల్వీ ప్రసాద్ గారి కుటుంబ సభ్యురాలినయినందుకు సంతోషంగా ఉంది. ఆయన జీవితం మాకందరికీ స్ఫూర్తి. అందుకే నాన్నగారు ఆయన బయోపిక్ తీయాలనుకుంటున్నారు' అని చెప్పారు. వైవీఎస్ చౌదరి, క్రియేటివ్ మెంటర్స్ సురేశ్ పాల్గొన్నారు.



మజ్ను కోసం రాఘవుడు



ఒక హీరో సినిమా ఈవెంట్‌కి మరో హీరో వచ్చి విషెస్ అందించడం టాలీవుడ్లో మామూలే. ఆ వచ్చే హీరో మంచి ఇమేజ్ ఉన్నవాడయితే హైప్ మామూలుగా రాదు. 'మిస్టర్ మజ్ను'కి అలాంటి హైప్ క్రియేట్ చేయబోతున్నాడు ఎన్టీయార్. అఖిల్ హీరోగా నటించిన ఈ సినిమా ప్రీ రిలీజ్‌కి ఆయనే ముఖ్య అతిథిగా హాజరవుతున్నాడు. శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ రిలీజుకి రెడీ అవుతోంది. ఈ క్రమంలో రేపు సాయంత్రం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరగనుంది. దీనిలో ఎన్టీఆర్ స్పెషల్ అట్రాక్షన్ కానున్నాడు. నిజానికి నాగార్జునతో ఎన్టీయార్‌కి మంచి అనుబంధం ఉంది. నాగ్‌ని బాబాయ్ అని పిలుస్తాడు. ఆ అనుబంధంతోనే అఖిల్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు అతిథిగా హాజరవబోతున్నాడు తారక్. అఖిల్ కెరీర్‌కి 'మిస్టర్ మజ్ను' విజయం కీలకంగా మారిన తరుణంలో... ప్రీ రిలీజ్‌కి ఎన్టీయార్ రాక హెల్ప్ అయ్యే అవకాశాలున్నాయి.



కొత్త చిత్రం షురూ


'ఆర్ ఎక్స్ 100' లాంటి సంచలన విజయం తర్వాత 'హిప్పీ' చిత్రంలో నటిస్తున్నాడు కార్తికేయ. ఈ సినిమా పూర్తవకముందే అతను హీరోగా మరో సినిమా మొదలైంది. జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్స్, స్ప్రింట్ టెలీ ఫిలిమ్స్ బ్యానర్లపై అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కొత్త దర్శకుడు అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమా గురువారం ఒంగోలులో ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'బోయపాటి శ్రీను దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశాను. కార్తికేయ వల్లే ఈ సినిమా పట్టాలెక్కింది. కథపై నమ్మకంతో నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా రూపొందించడానికి సిద్ధపడ్డారు. కథానుగుణంగా ఒంగోలులో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం' అన్నాడు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఫిబ్రవరి 8 వరకు జరిగే తొలిషెడ్యూల్‌లో కీలక సన్నివేశాలతో పాటు రెండు పాటలను చిత్రీకరించనున్నాం. త్వరలోనే టైటిల్‌ను వెల్లడిస్తాం' అని తెలిపారు. దర్శకుడు అర్జున్ చెప్పిన కథ నచ్చడంతో వెంటనే ఈ సినిమాకు అంగీకరించానన్నాడు హీరో కార్తికేయ. 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ రామ్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి చైతన్య భరద్వాజ్ సంగీత దర్శకుడు.

సుల్తాన్‌నే మెప్పించాడు



మనకి 'ఈగ'తో పరిచయమయ్యాడు కన్నడ నటుడు సుదీప్. క్రూరమైన హావభావాలతో తన నటనను రుచి చూపించి మెప్పించాడు. మనకు అతడు విలనేమో కానీ కన్నడిగులకు మాత్రం ఫేవరేట్ హీరో. ప్రస్తుతం సుదీప్ నటిస్తోన్న 'పహిల్వాన్' చిత్రం కోసం వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పలు భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్ర టీజర్ రీసెంట్‌గా రిలీజైంది. అచ్చమైన పహిల్వాన్ బాడీతో కుస్తీకి రెడీ అవుతున్న సుదీప్‌ని చూసిన ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజైన నాటి నుంచీ ఇది బాలీవుడ్ 'సుల్తాన్'కి రీమేక్ అన్న కామెంట్లు వినబడుతున్నాయి. దానికి తోడు టీజర్ చూశాక సల్మాన్ స్వయంగా స్పందించాడు. 'సుదీప్... మేం మొదలు పెట్టినదాన్ని నువ్వు మరో స్థాయికి తీసుకెళ్లావ్. ఆల్ ద బెస్ట్ టు పహిల్వాన్' అని సల్మాన్ అనడం చూస్తుంటే అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఏదేమైతేనేం... పహిల్వాన్ సుల్తాన్‌ని మెప్పించాడు. అది చిన్న విషయమైతే కాదు.

ఫస్ట్ లుక్



కమల్ హాసన్, శంకర్ కలయికలో వచ్చిన సంచలన చిత్రం 'భారతీయుడు'కు సీక్వెల్ రూపొందుతోంది. రెగ్యులర్ షూటింగ్ ఈ రోజు ప్రారంభం కానున్న సందర్భంగా భారతీయుడు గెటప్‌లో కమల్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.

స్టూడెంట్ లీడర్ కథ



దశాబ్దాల క్రితం విద్యార్థి విప్లవోద్యమ నాయకుడిగా పాపులర్ అయిన 'జార్జిరెడ్డి' జీవితం ఆధారంగా ఒక చిత్రం తెరకెక్కుతోంది. హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్శిటీలో చదువుతూ.. విద్యార్థి ఉద్యమాల్లో తిరుగులేని నాయకుడుగా ఎదిగిన జార్జిరెడ్డిని చిన్న వయసులోనే ప్రత్యర్థులు క్యాంపస్‌లోనే హత్య చేశారు. అతని జీవితం ఇప్పుడు వెండితెరపై ఆవిష్కృతం కాబోతోంది. 'దళం' ఫేమ్ జీవన్‌రెడ్డి దర్శకుడు. మైక్ మూవీస్ అధినేత అప్పిరెడ్డి త్రీ లైన్స్ సినిమా బ్యానర్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ మూవీ ప్రీ లుక్ పోస్టర్ విడుదలైంది. జార్జిరెడ్డి విపరీతమైన పఠనాసక్తి కలిగినవాడు అని ఆయన మిత్రులు చెబుతుంటారు. ఆ విషయాన్నే ప్రతిబింబిస్తూ చేతిలో పుస్తకాలతో నాటి కాలపు డ్రెస్సింగ్ స్టైల్ తో కాలేజీకి నడిచి వెళుతోన్న 'జార్జిరెడ్డి' లుక్‌ను రిలీజ్ చేశారు. అతి త్వరలో ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయడంతో పాటు నటీనటుల వివరాలు కూడా తెలియజేస్తామని దర్శక నిర్మాతలు చెప్పారు.

ట్విటర్ టాక్



"ఎప్పుడూ సంతోషంగా ఉండటానికి ఒక్కటే మార్గం. ఏం జరుగుతుందా అని ఎదురు చూడాలి. జరిగేదాన్ని జరగనివ్వాలి.ఏది జరిగినా మంచికే అనుకోవాలి. వచ్చినదాన్ని వచ్చినట్టు స్వీకరించాలి. వీలైతే ఎవరికైనా కాసింత సాయపడాలి. ఆ సాయం కూడా నవ్వుతూనే చేయాలి. ఇలా ఉంటే సంతోషం ఎప్పుడూ మన వెంటే ఉంటుంది. ఇది నా అనుభవం నాకు నేర్పింది."

– ప్రీతి జింటా, బాలీవుడ్ నటి

రకుల్ రప్పాడించింది



ఎప్పుడూ నవ్వుతూ కూల్‌గా కనిపిస్తుంది రకుల్ ప్రీత్ సింగ్. కానీ ఆమెకి ఉన్నట్టుండి పట్టరానంత కోపమొచ్చింది. ఒక నెటిజన్ తన డ్రెస్సింగ్ మీద కామెంట్ చేయడంతో చాలా సీరియస్ అయ్యింది రకుల్. రీసెంట్‌గా ఆమె దిగిన ఒక ఫొటో చూసి చెప్పడానిక్కూడా వీల్లేనంత అసభ్యంగా కామెంట్ పెట్టాడో కుర్రాడు. అది చదివిన రకుల్ అగ్గిమీద గుగ్గిలమయ్యింది. 'నా గురించి కామెంట్ చేసేముందు నువ్వెలాంటివాడివో ఆలోచించు. ఓ ఆడపిల్ల గురించి ఎంత అసభ్యంగా మాట్లాడుతున్నావ్! సంస్కారం లేనివాళ్లు మాత్రమే నీలా మాట్లాడతారు. నీకూ ఓ ఫ్యామిలీ ఉంటుందిగా. వాళ్ల గురించి ఇలా మాట్లాడితే నీకెలా ఉంటుంది? ఈపాటిని నీ మాటలు విని మీ అమ్మ కచ్చితంగా లాగి కొట్టే ఉంటుంది' అంటూ కాస్త గట్టిగానే క్లాస్ పీకింది. 'సమానత్వం గురించి, స్వేచ్ఛ గురించి చర్చించడం అనవసరం, ఎందుకంటే నీలాంటి వాళ్లు ఉన్నంతవరకూ ఆడపిల్లలకు రక్షణ లేదు' అంటూ రప్పాడించేసింది రకుల్. బాగా చెప్పావు అని కొందరు నెటిజన్స్ మెచ్చుకుంటుంటే, అలాంటివన్నీ పట్టించుకోకు అంటూ కొందరు నచ్చజెబుతున్నారు.

ఆన్ లొకేషన్




మోహన్‌లాల్ హీరోగా ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కిస్తోన్న బహు భాషా చిత్రం 'మరాక్కర్'. పదహారో శతాబ్దంలో జరిగిన ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో ప్రియదర్శన్ కూతురు కళ్యాణి కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఆ షూటింగ్ లొకేషన్లో తండ్రితో కళ్యాణి.

అంత కష్టం దేనికో!



లోఫర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన బాలీవుడ్ హీరోయిన్ దిశా పటాని. నాజూకైన తన శరీరాకృతితో మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేస్తూ ఈ మధ్య తరచూ సోషల్ మీడియాలో తన ఫోటోలతో హల్‌చల్ చేస్తోంది. తాజాగా బాక్సింగ్ కోచింగ్ తీసుకుంటున్నట్టుగా కూడా ఒక పోస్ట్ పెట్టింది. పైగా 'నాతో పెట్టుకోవద్దు.. ట్రైనింగ్‌లో ఉన్నాను' అని కోట్ చేసింది. దాంతో సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. ఇప్పటికే దిశా ప్రేమకథ చాలా ఫేమస్ అయ్యింది. ఆమె టైగర్‌ష్రాఫ్‌తో ప్రేమలో ఉందన్న విషయం ఎప్పటి నుంచో వినిపిస్తోంది. అయితే ఆ ఇద్దరూ అలాంటిదేం లేదని చెబుతూ వస్తున్నారు. కానీ టైగర్ తన బాక్సింగ్ ప్రాక్టీస్ వీడియోని పోస్ట్ చేసిన కొంత సమయానికే దిశా అలాంటి వీడియో పెట్టడంతో కావాలనే పెట్టిందని కొందరు, బాయ్ ఫ్రెండ్ అడుగు జాడల్లో నడుస్తోందని కొందరు కామెంట్ చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ కసరత్తంతా ఆమె సల్మాన్‌తో చేస్తోన్న 'భారత్' సినిమా కోసం గానీ, 'కిక్ 2' కోసం గానీ అయ్యుండొచ్చని కూడా కొందరు అంటున్నారు. ఎందుకంటే వాటిలో దిశా డైనమిక్ రోల్స్ చేస్తోందని గతంలోనే అన్నారు. నిజం ఆమెకే తెలియాలి.

గప్‌చుప్



'2.ఓ'తో సౌత్‌లో అడుగు పెట్టాడు అక్షయ్ కుమార్. విలన్‌గా అతడి నటనకు ఫిదా అయిపోయారంతా. దాంతో అతని విలనిజాన్ని మరోసారి మనకి రుచి చూపించాలనుకుంటున్నాడట దర్శకుడు శంకర్. భారతీయుడు సీక్వెల్‌లో అక్షయ్యే విలన్‌గా నటించే అవకాశం ఉందని కోలీవుడ్ టాక్. నిజానికి మొదట అజయ్ దేవగన్‌ని తీసుకోవాలని అనుకున్నారట. కలిసి మాట్లాడారట కూడా. అయితే ఆయన కాల్షీట్లు ఖాళీ లేకపోవడంతో ఆల్రెడీ తనతో పని చేసిన అక్షయ్ వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. నిజమో కాదో.

నెక్ గుడ్ల ధరలు (100కు)

	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.418	రూ.4.80
వరంగల్	రూ.420	రూ.4.80

మార్కెట్

సెన్సెక్స్ 52.79 ↑ 36,374


నిఫ్టీ 14.90 ↑ 10,905



ఊగిసలాట... లాస్ట్‌లో లాభాలు

- సెన్సెక్స్‌కి 53, నిఫ్టీకి 15 పాయింట్ల లాభం

ముంబై : తీవ్ర ఒడిదుడుకులు పాలైన దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం లాభాలతో ముగిసింది. ఫైనాన్షియల్, టెక్నాలజీ, ఆటో స్టాక్స్ లాభాలు పండించడంతో, మార్కెట్ వరుసగా మూడో రోజు లాభాలతో క్లోజైంది. సెన్సెక్స్ 52.79 పాయింట్ల లాభంతో 36,374 వద్ద, నిఫ్టీ 14.90 పాయింట్ల లాభంతో 10,905 వద్ద స్థిరపడ్డాయి. సెన్సెక్స్‌లో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ, టాటా కన్సల్టెన్సీ, కొటక్ మహింద్రా బ్యాంక్, ఎం అండ్ ఎం షేర్లు 1.19 శాతం నుంచి 1.91 శాతం వరకు లాభపడ్డాయి. గురువారం ఇంట్రాడేలో 147.13 పాయింట్లు జంప్ చేసిన సెన్సెక్స్ 36,468.42 వద్ద గరిష్ట స్థాయిలను తాకింది. నిఫ్టీ కూడా 40.35 పాయింట్లు ఎగిసి 10,930.65 వద్ద గరిష్ట స్థాయిని పొందింది. కార్పొరేట్ కంపెనీల ఫలితాలు, మధ్యంతర బడ్జెట్ నేపథ్యంలో దేశీయ ఈక్విటీ సూచీలు సెషన్ అంతా పాజిటివ్, నెగిటివ్ ధోరణిలో ఊగిసలాడినట్టు అఫికా గ్రూప్ ఈక్విటీ రీసెర్చ్ ప్రెసిడెంట్ పరాస్ బోత్ర తెలిపారు. డాలర్ మారకంలో రూపాయి బలహీనపడటంతో ఐటీ స్టాక్స్ మార్కెట్‌కు సహకరించాయి. లార్జ్ క్యాప్ కంపెనీల అక్టోబర్ డిసెంబర్ క్వార్టర్ ఫలితాలపై ఇన్వెస్టర్లు ఎక్కువగా దృష్టిసారించినట్టు విశ్లేషకులు పేర్కొన్నారు.



క్యాబ్‌లో తిరిగేయ్.. తర్వాత పే చెయ్

ఓలా కొత్త ఆఫర్

హైదరాబాద్, వెలుగు : క్యాబ్ సేవల సంస్థ ఓలా తమ వినియోగదారులకు ఓ తీపి కబురు అందించింది. ఓలా మనీ పోస్ట్ పెయిడ్ పేరిట కొత్త సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో క్యాబ్ సేవలు ఉపయోగించుకున్న తరువాత 15 రోజుల్లోపు ఎప్పుడైనా మీరు చెల్లింపులు చేయవచ్చు. విడిగా కాకుండా ఒకేసారి 15 రోజులకు కలిపి చెల్లింపులు చేయవచ్చు. ప్రస్తుతం కొంత మంది కస్టమర్లకే ఈ అవకాశాన్ని అందిస్తున్నప్పటికీ త్వరలోనే అందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఓలా తెలిపింది. గతేడాది పైలట్ ప్రాజెక్టు కింద ఈ ఆఫర్ ప్రారంభించగా నెల నెలా కస్టమర్లు 30 శాతం వృద్ధి చెందారని, అందుకే పూర్తి స్థాయిలో త్వరలోనే 15 కోట్లకు పైగా కస్టమర్లకు ఈ సేవలను అందించాలనే లక్ష్యంతో ఉన్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఇన్విటేషన్ ద్వారా ఎంపిక చేసిన కస్టమర్లకే ఈ సేవలను అందిస్తోంది. క్యాబ్ సర్వీసులు వినియోగించుకున్న తరువాత 15 రోజుల్లోపు ఎలాంటి పాస్‌వర్డ్, ఓటీపి అవసరం లేకుండా డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లింపులు జరపవచ్చు. ప్రస్తుతం 10 శాతానికి పైగా ఓలా కస్టమర్లు ఓలా మనీ పోస్ట్ పెయిడ్ సర్వీసులను తరుచూ వాడుతున్నారని ఓలా ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో నితిన్ గుప్తా తెలిపారు. త్వరలోనే అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు బిల్లు చెల్లింపులకు గడువును నెల రోజులకు పెంచుతామని అన్నారు. దీంతో పాటు ఫుడ్, ఎంటర్టైన్మెంట్, యుటిలిటీస్ వంటి విభాగాల్లో కూడా ఇలాంటి వెసులుబాటు కల్పిస్తామని వెల్లడించారు.

అంచనాలు మించిన రిలయన్స్

ఒక క్వార్టర్‌లో రూ. 10 వేల కోట్ల నికర లాభం ఆర్జించిన తొలి కార్పొరేట్‌గా అవతరణ



- జియో, రిటైల్ భేష్....
- ఆదాయం రూ. 1.5 లక్షల కోట్లు
- నికర లాభం రూ. 10,251 కోట్లు
- 28 కోట్లకు జియో కస్టమర్లు

ముంబై : ఆయిల్, టెలికం రంగాల దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) డిసెంబర్ 2018తో ముగిసిన మూడో క్వార్టర్‌లో అంతకు ముందు క్వార్టర్‌తో పోలిస్తే 7.7 శాతం వృద్ధితో రూ. 10,251 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇతర ఆదాయం పెరగడంతోపాటు టెలికం, రిటెయిల్ విభాగాలు పనితీరు మెరుగ్గా ఉండటంతో, విశ్లేషకుల అంచనాలకు మించిన లాభాన్ని ప్రకటించింది. రిలయన్స్ గ్రూప్‌లోని ఫ్లాగ్‌షిప్ కంపెనీగా వెలుగొందుతున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇండియాలో రూ. 10 వేల కోట్ల క్వార్టర్లీ లాభం సంపాదించిన తొలి కార్పొరేట్‌గా గుర్తింపును తెచ్చుకుంది. డిసెంబర్ క్వార్టర్‌కు ఆదాయం 9.1 శాతం పెరిగి రూ. 1.56 లక్షల కోట్లకు చేరింది. కంపెనీ కింద ఉన్న అన్ని విభాగాలూ ఆదాయ పరంగా వృద్ధి సాధించాయి. అంతకు ముందు ఏడాది ఇదే క్వార్టర్‌తో పోలిస్తే కంపెనీ నికర లాభం 8.8 శాతం, ఆదాయం 56.7 శాతం పెరిగాయి. రిఫైనింగ్‌లో స్థూల మార్జిన్ డిసెంబర్ క్వార్టర్‌లో బ్యారెల్‌కు రూ. 626గా నమోదైందని, గత 5 క్వార్టర్స్‌లో ఇదే అత్యల్పమని కంపెనీ తెలిపింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో ఈ మార్జిన్ బ్యారెల్‌కు రూ. 676గా ఉండేదని పేర్కొంది. అంతకు ముందు ఏడాది ఇదే క్వార్టర్‌లోనైతే రిఫైనింగ్ స్థూల మార్జిన్ బ్యారెల్‌కు రూ.825 ఉందని రిలయన్స్ వివరించింది. మొత్తం ఆదాయంలో 70 శాతం అంటే రూ. 1.1 లక్షల కోట్లు రిఫైనింగ్ విభాగం నుంచే సమకూరినట్లు తెలిపింది. ఈ ఆదాయం అంతకు ముందు క్వార్టర్‌తో పోలిస్తే 13.1 శాతం పెరిగిందని పేర్కొంది. పెట్రోకెమికల్ బిజినెస్ అంతకు ముందు క్వార్టర్‌తో పోలిస్తే 5.7 శాతం పెరిగి రూ. 46,246 కోట్లకు చేరింది. ఈ విభాగంలో లాభం రూ. 8,221 కోట్లకు చేరినా, మార్జిన్స్ 17.8 శాతానికే పరిమితమయ్యాయి. రిటైల్ విభాగం పటిష్టమైన వృద్ధి సాధించింది. తాజా క్వార్టర్‌లో ఈ విభాగపు ఆదాయం 9.7 శాతం వృద్ధితో రూ. 35,577 కోట్లకు చేరింది. డిసెంబర్ క్వార్టర్‌లో కంపెనీ ఇతర ఆదాయం అంతకు ముందు క్వార్టర్‌తో పోలిస్తే దాదాపు రెట్టింపు పెరిగి రూ. 2,460 కోట్లకు చేరడం విశేషం. పెట్రో కెమికల్, రిఫైనింగ్ వ్యాపారాలలో ధరల రియలైజేషన్, పరిమాణంతోపాటు, కన్స్యూమర్ బిజినెస్ వృద్ధి కారణంగానే తాజా క్వార్టర్‌లో ఆదాయం పెరిగిందని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తెలిపింది. రిలయన్స్ ఆదాయం రూ. 1.38 లక్షల కోట్లు, నికర లాభం రూ.9,690 కోట్లు ఉండొచ్చని ఎక్కువ మంది విశ్లేషకులు అంచనా వేశారు. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్‌లో ఇంటిగ్రేషన్ బెనిఫిట్స్ వల్లే మెరుగైన పనితీరు సాధ్యమైందని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ వెల్లడించారు. రిటైల్, జియో ప్లాట్‌ఫామ్స్ కూడా మంచి వృద్ధి సాధించాయని, కన్స్యూమర్ వాణిజ్యం కూడా స్థిరంగా పెరుగుతోందని తెలిపారు.


జియో జంప్ చేసింది

టెలికాం మార్కెట్‌లో సంచలనాలకు కేంద్ర బిందువైన రిలయన్స్ జియో, లాభాల్లోనూ హై జంప్ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన క్వార్టర్‌లో రిలయన్స్ జియో నికర లాభాలు 65 శాతం పెరిగి రూ.831 కోట్లకు చేరింది. ముఖ్యంగా కస్టమర్ బేస్ పెరగడంతోనే, జియో ఈ మేర లాభాలను సాధించగలిగింది. ముందటి ఏడాది ఇదే కాలంలో జియో రూ.681 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. డిసెంబర్ క్వార్టర్‌కు ఆపరేటింగ్ ఆదాయం రూ. 10 వేల కోట్లను అధిగమించింది. ఇది 12.4 శాతం పెరిగి రూ. 10,383 కోట్లకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది. అంతకుముందటి ఏడాదిలో ఇది రూ.6,879 కోట్లగా నమోదైంది. అయితే ఒక్కో యూజర్ నుంచి వస్తోన్న సగటు ఆదాయం మాత్రం జియోకు తగ్గింది. ఈ క్వార్టర్‌లో ఈ ఏఆర్‌పీయూ రూ. 130 గా నమోదైంది. మూడో క్వార్టర్‌లో మొత్తం 2.79 కోట్ల మంది కొత్త కస్టమర్లను కంపెనీ సంపాదించింది. ఫలితంగా, డిసెంబర్‌తో ముగిసిన క్వార్టర్‌లో జియో కస్టమర్ బేస్ 28 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో 16 కోట్లుగా ఉంది. జియో ఫ్యామిలీ ప్రస్తుతం 28 కోట్ల కస్టమర్లతో చాలా పటిష్టంగా, ప్రపంచంలో అతిపెద్ద మొబైల్ డేటా నెట్‌వర్క్స్‌లో ఒకటిగా ఎదుగుతోందని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ డిసెంబర్ క్వార్టర్ ఫలితాల సందర్భంగా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ అంబానీ తెలిపారు. హైయస్ట్ క్వాలిటీలో, తక్కువ ధరల్లో... ప్రతి ఒక్కరికీ, ప్రతీది, ప్రతి చోట కనెక్ట్ చేయడమే తమ విజన్ అని పేర్కొన్నారు. తమ తర్వాతి తరం ఎఫ్‌టీటీఎక్స్ సర్వీసెస్‌లతో గృహాలకు, వ్యాపార సంస్థలకు కనెక్టివిటీ సొల్యూషన్స్‌ను రీఇన్వెంట్ చేస్తున్నట్టు చెప్పారు.

జెట్ గట్టెక్కుతోందా?

రూ.700 కోట్ల ఇన్వెస్ట్ మెంట్‌కు గోయల్ సిద్ధం

- రిజల్యూషన్ ప్లాన్‌తో బ్యాంక్‌లు ముందుకి
- హుషారుగా నడిచిన జెట్ షేర్లు



ముంబై : జెట్ ఎయిర్‌వేస్‌కు మళ్లీ మంచి రోజులు రానున్నాయా..? ఈ ఎయిర్‌లైన్స్ కంపెనీ కష్టాల నుంచి గట్టెక్కనుందా..? అంటే అవుననే వినిపిస్తోంది. పీకలలోతు అప్పుల్లో కూరుకుపోయిన ఈ కంపెనీ కోసం అప్పులిచ్చిన బ్యాంకర్లు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను (రిజల్యూషన్ ప్లాన్) పరిగణలోకి తీసుకున్నట్టు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గురువారం ప్రకటించింది. అంతేకాక జెట్ ఎయిర్‌వేస్‌లో రూ.700 కోట్లను ఇన్వెస్ట్ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు అటు ఆ ఎయిర్‌లైన్స్ సంస్థ చైర్మన్ నరేష్ గోయల్ తెలిపారు. అయితే కంపెనీలో తన వాటా 25 శాతానికి తగ్గకుండా ఉండాలనేదే కోరికని మనసులో మాట బయట పెట్టారు. గోయల్‌కు ప్రస్తుతం ఆ కంపెనీలో 51శాతం ఉంది. జెట్‌లో మరింత పెట్టుబడికి వ్యూహాత్మక భాగస్వామి ఎతిహాద్‌కు ఆసక్తి ఉన్నప్పటికీ, కఠినమైన షరతులను పెడుతుండటంతో తట్టుకోలేక, గోయల్ ఈ ఆఫర్ ప్రకటించారు. జెట్‌లో మెజార్టీ వాటాదారునిగా ఉండాలనేది ఎతిహాద్ పెడుతున్న కండిషన్లలో ప్రధానమైనది. గోయల్ మైనార్టీ షేర్ హోల్డర్‌గా మారి, తన అధికారాలన్నింటిని వదులుకోవాలని, అప్పుడే తాము జెట్‌ను గట్టెక్కించగలమని ఎతిహాద్ చెబుతోంది. అంతేకాక ప్రస్తుతం ట్రేడవుతున్న షేర్ ధరలో సగానికి, అంటే రూ.150కే జెట్ షేరును కొంటామని కూడా చెప్పింది. ఈ షరతుల నేపథ్యంలో, గోయలే మరో రూ.700 కోట్లను జెట్‌లో ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఎస్‌బీఐ చైర్మన్ రజ్నీష్ కుమార్‌కు లేఖ కూడా రాశారు. ఈ ఎయిర్‌లైన్ సంస్థకు రుణాలిచ్చిన బ్యాంక్‌ల కన్సోర్టియంకు ఎస్‌బీఐ నాయకత్వం వహిస్తోంది. ప్రస్తుతం ఈ కంపెనీని తీవ్ర ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించేందుకు రెజిల్యూషన్ ప్లాన్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. ఈ ప్లాన్‌తో జెట్ ఎయిర్‌వేస్‌ను దీర్ఘకాలికంగా బయటపడే అవకాశాలుంటాయి. 'సమగ్ర పునరుద్ధరణ ప్రణాళిక విషయంలో వాటాదారులతో జరుపుతోన్న చర్చలు సఫలీకృతమయ్యాయి. దానిలోనే ఈక్విటీ పెట్టుబడి, బోర్డు ఆఫ్ డైరెక్టర్లలో మార్పులు కూడా ఆలోచిస్తున్నాం' అని ఎస్‌బీఐ ప్రకటించింది. వాటాదారులు కూడా జెట్ ఎయిర్‌వేస్ పరిస్థితిపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కంపెనీని దీర్ఘ కాలికంగా బయట పడేసేలా.. ఆర్‌బీఐ ఫ్రేమ్‌వర్క్ కింద ఈ రిజల్యూషన్ ప్లాన్‌ను బ్యాంకర్లు పరిగణనలోకి తీసుకున్నారు అని తెలిపింది. ఈ పునరుద్ధరణ ప్రణాళికను జెట్‌కు రుణాలిచ్చిన బ్యాంక్‌ల బోర్డులు ఆమోదించాలి. ఏ ప్లాన్‌నైతే బ్యాంక్‌ల బోర్డు ఆమోదిస్తాయో..? అది ఆర్‌బీఐ, సెబీ, సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖలు, నియంత్రణలకు అనుగుణంగా ఉండాలి.



తీవ్ర నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న జెట్ ఎయిర్‌వేస్, 2018 డిసెంబరు 31 నాటికి ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియానికి రుణాలు తిరిగి చెల్లించడంలో విఫలమైంది. 'కంపెనీని సమగ్రంగా పునరుద్ధరించడంతో పాటు ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేలా చూసేందుకు ఎస్‌బీఐ, ఇతర ఆర్థిక సంస్థలు, వాటాదార్లతో సంప్రదింపులు సాగుతున్నాయి' అని అంతకముందే జెట్ ఎయిర్‌వేస్ కూడా ప్రకటించింది. సంస్థలో ప్రస్తుతం 24 శాతం వాటా కలిగిన ఎతిహాద్ ఎయిర్‌వేస్, తన వాటా పెంచుకునేందుకు చూస్తోందని మరోవైపు నుంచి వార్తలు వస్తున్నాయి.

అకౌంట్స్‌కు ఆన్‌లైన్ స్కూల్

- సీఏ, ఫైనాన్స్, అకౌంట్స్‌లో ఆన్‌లైన్ లెర్నింగ్ కంపెనీ
- ఇండిగోలెర్న్ నిధుల సమీకరణ



హైదరాబాద్, వెలుగు

ఏంజెల్ ఇన్వెస్టర్ల ద్వారా నగరానికి చెందిన ఎడ్ టెక్ స్టార్టప్ కంపెనీ ఇండిగోలెర్న్ డాట్ కామ్ తాజాగా రూ.93 లక్షల మేర నిధులు సమీకరించుకుంది. ఇండియాతో పాటు యూఎస్ కు చెందిన ఇన్వెస్టర్లు ఇందులో పెట్టుబడి పెట్టారు. 2018 ఏప్రిల్ లో ప్రకటించిన ఏంజెల్ ఇన్వెస్ట్ మెంట్ తో కలిపి ఇప్పటిదాక కంపెనీ రూ.1.88 కోట్ల మేర నిధులు సేకరించుకుంది. ఫైనాన్స్ & అకౌంటింగ్ విభాగానికి చెందిన సిఏ తో పాటు దానికి సంబంధించిన కోర్సులు చదివే వారికి ఆన్ లైన్ ఎడ్యుకేషన్ ను అందిస్తోంది ఇండిగోలెర్న్ డాట్ కామ్. ఫర్లెంకో మాజీ విపి (ఫైనాన్స్) శ్రీరామ్ సోమయాజుల, ప్రముఖ సీఏ ఫ్యాకల్టీ సత్య రఘు, ఆల్ ఇండియా సిఏ టాపర్ సూరజ్ లఖోటియా, బిట్స్ పిలాని టెకీ శరత్ వెలుమూరి లు కలిసి 2017 ఏప్రిల్ లో ఇండిగోలెర్న్ డాట్ కామ్ స్టార్టప్ ను ప్రారంభించారు. ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ విభాగంలో విద్యార్థులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యను అందిస్తున్న సంస్థగా తక్కువ వ్యవధిలోనే గుర్తింపు వచ్చిందని ఫౌండర్లు చెబుతున్నారు.

త్వరలో మరిన్ని కోర్సులు

విద్యార్థులు లీనమయ్యేవిధంగా ఇండిగోలెర్న్ ఇప్పటి దాకా 700 గంటల రిచ్ విజువల్ కంటెంట్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీన్లో సీఏ ఫౌండేషన్ తో పాటు సిఏ ఇంటర్ విద్యార్థులకు కావల్సిన సబ్జెక్స్ ను పొందుపరిచింది. మరో యేడాదిలో సిఏ ఫైనల్ విద్యార్థులతో పాటు, గ్లోబల్ ప్రొఫెషనల్ కోర్సులు, 11, 12 వ తరగతుల విద్యార్థులకు కూడా అవసరమైన ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తామని ఇండిగోలెర్న్ తెలిపింది. ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ విభాగంలో నాణ్యమైన విద్యను అందించడానికి ఇండిగోలెర్న్ టీమ్ చేస్తున్న కృషి అభినందనీయమని, దీంతో పాటు గత కొన్ని నెలలుగా కంపెనీ ఎదిగిన తీరు కూడా ఇందులో పెట్టుబడి పెట్టడానికి కారణమని ఏంజెల్ ఇన్వెస్టర్లలో ఒకరైన ఫింటెల్సిక్స్ ఎక్స్ సీఈవో వివేక్ సుబ్రమణ్యమ్ తెలిపారు.

టైర్–2 సిటీస్ లోనూ ఆదరణ

ఇండిగోలెర్న్ డాట్ కామ్ వెబ్ సైట్ ద్వారా కాని, యాప్ ద్వారా కానీ ఈ క్లాసెస్ ను వినవచ్చు. విద్యార్థులు ఒక్కొక్కరూ ఒక్కో టైం లో చదవడానికి ఇష్టపడతారు కాబట్టి లైవ్ క్లాసులు కాకుండా ఎప్పుడూ అందుబాటులో ఉండేలా ఉత్తమ నాణ్యతతో యానిమేషన్ క్లాసెస్ ను రూపొందించినట్లు కంపెనీ సీఈవో శ్రీరామ్ సోమయాజుల తెలిపారు. పూర్తిగా ఆన్ లైన్ ఆధారితంగా నడిచే ఈ క్లాసెస్ కు గ్రామీణ ప్రాంతాల నుండి కూడా విపరీతమైన ఆదరణ దక్కుతోందని, 300 నాన్ మెట్రో ప్రాంతాల నుండి తమకు విద్యార్థులు ఉన్నారని అన్నారు. జియో వచ్చిన తరువాత ఆన్ లైన్ క్లాసులకు మరింత డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆదరణ క్రమంగా పెరుగుతూ వస్తోందన్నారు. ఇమేజెస్, విజువల్స్ ఆధారితంగా యానిమేషన్ తో క్లాసెస్ ను డిజైన్ చేయడంతో విద్యార్థులకు ఇమేజ్ త్వరగా గుర్తిండిపోయి సబ్జెక్ట్ సులువుగా అర్థమవుతుందని చెప్పారు. సింపుల్ ఇంగ్లీష్ లో అందరికీ సులువుగా అర్థమయ్యేలా క్లాసెస్ ఉంటాయని శ్రీరామ్ అన్నారు.

మరింత విస్తరణ

ఈ యేడాది చివరికల్లా మరిన్ని నిధులు సమీకరించుకోవాలని భావిస్తోంది. సుమారు రూ.20 నుండి రూ.30 కోట్ల మేర నిధులు సమీకరించుకుని సేవలను మరింత విస్తరించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం ఫౌండేషన్ కోర్సు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురాగా, ఇంటర్ 90 శాతం, ఫైనల్ కోర్సు 20 శాతం దాకా అందుబాటులో ఉన్నాయి. త్వరలో సమీకరించే నిధులను ప్రొడక్ట్ డెవలప్ మెంట్ తో పాటు టెక్నాలజీ, మార్కెటింగ్ వంటివాటికి ఖర్చు చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. మార్కెటింగ్ తో మరింత ఎక్కువ విద్యార్థులకు చేరువ కావాలని ఆశిస్తోంది. ప్రస్తుతం 20 వేల విద్యార్థులుండగా మరో యేడాది కల్లా లక్ష మంది విద్యార్థులను చేరువ కావడం తమ లక్ష్యమని వెల్లడించింది. ఆన్ లైన్ క్లాసుల్లో సబ్జెక్ట్ ను బట్టి ఫీజును నిర్ణయిస్తామని ఇండిగోలెర్న్ తెలిపింది. ఇంటర్ లో రెండు గ్రూపుల్లో కలిపి 8 సబ్జెక్ట్స్ ఉండగా, ఒక్కో సబ్జెక్ట్ కు సుమారు రూ.3500 నుండి రూ.5500 వరకు ఫీజు ఉంటుందని, మొత్తం 8 సబ్జెక్టులకు కలిపి రూ.40 వేల దాకా ఉంటుందని వెల్లడించింది. ఇక ఫౌండేషన్ కోర్సుకు రూ.15 వేలు, ఫైనల్ లో ఒక్కో సబ్జెక్ట్ కు రూ.5 వేల నుండి రూ.6 వేల దాకా ఉంటుందని తెలిపింది.

కాన్సెప్ట్ లెర్నింగ్ మా ప్రత్యేకత




విద్యార్థుల చేత బట్టి పట్టించడం కాకుండా కాన్సెప్ట్ బేస్డ్ లెర్నింగ్ ఇండిగోలెర్న్ ప్రత్యేకత. ఏదైనా విన్నదానికంటే చూసిన దాన్ని సులువుగా గుర్తుపెట్టుకుంటాం. అందుకే యానిమేషన్ తో విద్యార్థులకు సబ్జెక్ట్ సులువుగా అర్థమయ్యేలా విజువల్ బేస్డ్ క్లాసెస్ ను రూపొందిస్తున్నాం. విద్యార్థులు వారికి అనువైన సమయంలో చదవడానికి ఇష్టపడతారు. అందరూ ఉదయాన్నే చదవాలని లేదు. కొందరు అర్థరాత్రి చదవడానికి కూడా ఇష్టపడతారు. అందుకే లైవ్ క్లాసెస్ కాకుండా ప్రీ రికార్డెడ్ క్లాసెస్ ను అందిస్తున్నాం. కష్టతరమైన టాపిక్స్ ను చిన్న బైట్స్, కథల రూపంలో చెబుతుంటాం.

- శ్రీరామ్ సోమయాజుల, సీఈవో, ఇండిగోలెర్న్ డాట్ కామ్

అమ్మేవాళ్లను కొనేవాళ్లను కలిపే

మొబైల్ వారధి షాప్ 101..

బిజినెస్ డెస్క్, వెలుగు :



- అతిపెద్ద సోషల్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌గా గుర్తింపు
- చిన్న వ్యాపారులకు ఆకర్షణగా షాప్101
- సెల్లింగ్, రీసెల్లింగ్ అంతా ఆన్‌లైన్‌లోనే

మన దేశంలో ఇంటర్నెట్ వ్యాప్తిని జియోకు ముందు, జియో తర్వాత అని రెండు విధాలుగా చెప్పొచ్చు. జియోకు ముందు, ఎవరి వద్దనైనా ఇంటర్నెట్ కనెక్షన్ ఉందంటే కొంత ఆశ్చర్యపడేవాళ్లం. కానీ జియో వచ్చిన తర్వాత మన దగ్గరే సూపర్ ఫాస్ట్ ఇంటర్నెట్ అందుబాటులో ఉంటోంది. ఇంటర్నెట్‌కు కొత్త కస్టమర్లు విపరీతంగా పెరుగుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని, ఆన్‌లైన్ వ్యాపారాలూ పెరుగుతున్నాయి. 2026 నాటికి ఇండియా ఈ టైల్ మార్కెట్ 20,000 కోట్ల డాలర్లకు పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంచనాలు వెలువడుతున్నాయి. ఈ గ్రోత్ కూడా టైర్ 3, టైర్ 4 సిటీల నుంచి ఎక్కువగా వస్తోంది. మనం మరింత డిజిటల్‌లోకి మారుతోన్న కొద్దీ, కస్టమర్లకు మరింత మెరుగైన ప్రొడక్ట్‌ను అందించేందుకు కొత్త కొత్త కామర్స్ మోడల్స్ పుట్టుకొస్తున్నాయి. ఈ మోడల్స్ అన్నీ ఇంటర్నెట్ ప్రపంచంలోకి కొత్తగా రాబోతున్న 40 కోట్ల ఇంటర్నెట్ యూజర్లపై ఎక్కువగా దృష్టిసారిస్తున్నాయి. ఆ కస్టమర్ల నిర్ణయం ఏ విధంగా ఉంటోంది..? ఏఏ విషయాలపై వారు ఫోకస్ చేస్తారు? ఆన్‌లైన్ షాపింగ్ చేయాలంటే వారు ఎలాంటి విషయాలను పరిగణలోకి తీసుకుంటారు? వంటి ఎన్నో ప్రశ్నలు కంపెనీలకు తలెత్తుతూనే ఉంటాయి. అందుకోసమే సోషల్ కామర్స్ పుట్టుకొచ్చింది. సోషల్ కామర్స్ అంటే, సోషల్ నెట్‌వర్క్‌లు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లను వాడుతూ.. వస్తువులను, సర్వీసులను అమ్మడానికి, కొనడానికి సహకరించడమే. యూజర్ కంట్రిబ్యూషన్‌ను, రిఫరెల్స్‌ను, ఇంటరాక్షన్‌కు కూడా ఇది దోహదం చేస్తోంది. ఈ ఈకామర్స్‌లో చిన్న వ్యాపారస్తులను కూడా ఆకర్షించేందుకు, సోషల్ మీడియాతో కనెక్ట్ అయ్యేందుకు ప్రత్యేకంగా ఓ సోషల్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 2015లో రూపొందింది. అదే షాప్101. ఇది ఇప్పుడు అతిపెద్ద సోషల్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌గా మార్కెట్లో దూసుకుపోతోంది.

2015లో అభినవ్ జైన్, ఆదిత్యా గుప్తా ప్రారంభించిన ఈ కంపెనీ, అతిపెద్ద సోషల్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగింది. జీరో ఇన్వెస్ట్‌మెంట్‌తో వ్యాపారులు తమ ప్రొడక్ట్‌లను ఆన్‌లైన్‌లో, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా విక్రయించుకునేలా ఇది సాయపడుతోంది. రెండు నిమిషాల కంటే తక్కువ వ్యవధిలోనే ఆన్‌లైన్ స్టోర్‌ను చిన్న వ్యాపారస్తులకు ఇది అందిస్తోంది. కాలేజీ విద్యార్థులను, గృహిణులను, యువతను ఎంటర్‌ప్రెనూర్లుగా మార్చడానికి ఉపయోగపడుతోంది. వారి సొంత ప్రొడక్ట్‌లనైనా ఆన్‌లైన్‌లో పెట్టడం లేదా రీసేల్ చేయడానికైనా షాప్101 సప్లయ్ ప్లాట్‌ఫామ్‌ను వాడుకోవచ్చు. ఇండియాలో ప్రస్తుతం టాప్ 50 సిటీల్లో 4 కోట్ల మంది గృహిణులు, కోటి మంది విద్యార్థులు ఉన్నారు. వచ్చే కొన్నేళ్లలో మరో 20 శాతం మంది కూడా ఈ జాబితాలో చేరతారు. షాప్101 అవలంబిస్తోన్న రీసెల్లర్ మోడల్, ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను అందిస్తోంది. అంతేకాక లోకాస్ట్ డిస్ట్రిబ్యూషన్ ఛానల్‌గా కూడా ఇది ఉపయోగపడుతోంది. ఎందుకంటే డైరెక్ట్‌గా ప్రొడక్ట్‌ను కొనుగోలుదారునికి సప్లయి చేయొచ్చు. పలు ప్రాంతాలకు రవాణా చేయడం, అనంతరం వాటిని స్టాక్ చేయడం ఇవన్నీ ఏమీ ఉండవు. ఈ వెసులుబాటుతో చిన్న, మధ్య తరహాకు చెందిన కొత్త బ్రాండ్లు షాప్101 ప్లాట్‌ఫామ్ ద్వారా త్వరగా రవాణా అవుతున్నాయి.

పటిష్టమైన నాయకత్వమే సక్సెస్ వెనుక కారణం...

ఫౌండర్స్ అభినవ్ జైన్, ఆదిత్య గుప్తాలు ఈ కంపెనీలో పటిష్టమైన నాయకత్వ బృందాన్ని ఏర్పాటు చేశారు. చివరిసారి పెట్టుబడులను సమీకరించినప్పటి నుంచి గత 12 నెలల కాలంలో ఈ కంపెనీ, సోషల్ మీడియా, రీసెల్లర్స్, తయారీదారులతో కలిసి ముందడుగు వేస్తోంది. అమ్మకందారులకు, కొనుగోలుదారులకు ఇద్దరికీ మంచి సర్వీసులను అందించడంలో ఈ కంపెనీ సక్సెసవుతోంది. లో కాస్ట్ డిస్ట్రిబ్యూషన్ మోడల్‌ను అందించే క్రమంలో, కంపెనీ మెజార్టీ సెల్లర్స్‌ను, రీసెల్లర్స్‌ను కొనుగోలు చేసింది.



ఇండియాలో సోషల్ కామర్స్ ఇప్పుడెందుకు ఫేమస్ అయింది?...

ఇండియాలో 2016 నాటికి సోషల్ నెట్‌వర్క్ యూజర్లు 16.8 కోట్ల మంది ఉండేవారు. 2018 నాటికి వీరు 25.9 కోట్లకు పెరిగారు. యావరేజ్‌గా ఇండియన్స్ ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై 2.5 గంటలకు పైగా సమయాన్ని వెచ్చిస్తున్నారు. అంటే రోజులో 10 శాతం నుంచి 12 శాతం వరకు వారి సమయం సోషల్ మీడియాపైనే. స్మార్ట్‌ఫోన్ల రాకతో, మరింత మంది యూజర్లు కూడా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లోకి వస్తున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఎకానమీ అయిన ఇండియాలో 5 కోట్ల మంది చిన్న వ్యాపారస్తులు తమ బిజినెస్‌లను కొనసాగిస్తున్నారు. 2025 నాటికి వీరిలో 20 శాతం నుంచి 30% మంది ఆన్‌లైన్‌గా వచ్చే అవకాశాలున్నాయని రిపోర్టులు అంచనావేస్తున్నాయి. ఈ చిన్న వ్యాపారస్తులను ఆన్‌లైన్‌గా ఆకర్షించేందుకు, సోషల్ మీడియాతో వారు కనెక్ట్ అయ్యేలా షాప్101 ప్లాట్‌ఫామ్ ఎంతో దోహదం చేస్తోంది.

ప్లే PLAY
ప్రభాత వెలుగు
శుక్రవారం | హైదరాబాద్
www.v6velugu.com 18.01.2019
Follow: v6velugu



తొలిసారి సెమీస్‌కు కేరళ

గుజరాత్‌పై 113 రన్స్‌తో విజయం


వయనాడ్

రంజీ ట్రోఫీలో కేరళ జట్టు చరిత్ర సృష్టించింది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తర్వాత ఈ మెగా టోర్నీలో తొలిసారి సెమీఫైనల్‌కు చేరుకుంది. గుజరాత్‌తో జరిగిన క్వార్టర్స్‌లో 113 పరుగులతో ఘనవిజయం సాధించింది. గురువారం మూడోరోజు 195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్.. బాసిల్ థంపి (5/27), సందీప్ వారియర్ (4/30) ధాటికి 31.3 ఓవర్లలో 81 రన్స్‌కే కుప్పకూలింది. ఆ జట్టులో రాహుల్ షా (33 నాటౌట్) టాప్ స్కోరర్. తొలి ఇన్నింగ్స్‌లో కేరళ 185, గుజరాత్ 162 రన్స్ చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో కేరళ 171 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు తీసిన బాసిల్ థంపికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

వసీం జాఫర్ డబుల్ సెంచరీ

వెటరన్ ప్లేయర్ వసీం జాఫర్ డబుల్ సెంచరీతో కదం తొక్కడంతో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న మరో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో విదర్భకు తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం దక్కింది. మూడోరోజు ఆట ముగిసేసరికి విదర్భ 559/6 స్కోరుతో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 260/1తో ఆటను ప్రారంభించిన విదర్భ ఆరంభంలోనే సంజయ్ (141) వికెట్ కోల్పోయింది. అయితే వాడ్కర్ (98) అండగా నిలవడంతో వసీం డబుల్ సెంచరీ పూర్తి చేసుకుని నిష్క్రమించాడు. ప్రస్తుతం విదర్భ 204 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 355 పరుగులు చేసింది. ఇక సౌరాష్ట్రతో లక్నోలో జరుగుతున్న క్వార్టర్స్‌లో ఉత్తరప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 172/8తో నిలిచి 349 పరుగుల ఆధిక్యంలో దక్కించుకుంది. రాజస్తాన్‌తో పోరులో కర్ణాటక విజయం కోసం పోరాడుతోంది. 184 పరుగుల ఛేజింగ్‌లో ప్రస్తుతం కర్ణాటక 45/3తో నిలిచింది.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్, సైనా




కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇండియా టాప్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఏడో సీడ్ సైనా 21-14, 21-16తో పుయ్ యిన్ యిప్ (హాంకాంగ్)పై అలవోక విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ నం.8, ఏడో సీడ్ శ్రీకాంత్ 23-21, 8-21, 21-18తో హాంకాంగ్‌కు చెందిన వొంగ్ వింగ్ కి విన్సెంట్‌పై చెమటోడ్చి నెగ్గాడు. తొలి గేమ్ ఆరంభంలో 4-8తో వెనుకజంలో నిలిచిన శ్రీకాంత్.. క్రమంగా పోరాడి 21-21తో స్కోరు సమం చేశాడు. ఈదశలో వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక రెండో గేమ్‌లో భారత స్టార్‌కు ఏమాత్రం అవకాశమివ్వని విన్సెంట్ గేమ్‌ను నెగ్గి మ్యాచ్‌ను 1-1తో సమం చేశాడు. నిర్ణయాత్మక మూడో గేమ్ ఆరంభంలో 10-5తో ఆధిక్యంలో ఉన్న శ్రీకాంత్.. విరామానంతరం రెచ్చిపోయాడు. కీలక దశలో పాయింట్లు సాధించి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. అయితే మరో మ్యాచ్‌లో కామన్వెల్త్ చాంపియన్ పారుపల్లి కశ్యప్ 17-21, 23-25తో అంటోని గింటింగ్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ 18-21, 17-21తో ఇస్తారని-ప్రదిప్త (ఇండోనేసియా)చేతిలో ఓడిపోయింది. క్వార్టర్స్‌లో సన్‌వాన్ హో (దక్షిణ కొరియా)తో శ్రీకాంత్, ఒకుహర (జపాన్)తో సైనా తలపడనున్నారు.

పొట్టి ఫార్మాట్‌లో సిరీస్ పంచుకొని... టెస్టుల్లో చారిత్రాత్మక విజయం దక్కించుకున్న కోహ్లీసేన వన్డే సిరీస్‌ను ఒడిసి పట్టేందుకు సన్నద్ధమైంది. కంగారూల గడ్డపై ఇప్పటి వరకు ఇరు దేశాల వన్డే సిరీస్ నెగ్గని ఇండియా... మెల్‌బోర్న్ వేదికగా ఆ ఘనత అందుకోవాలనుకుంటోంది. తొలి రెండు వన్డేల్లో చేజింగ్‌లో ఆకట్టుకున్న బ్యాటింగ్ లైనప్ అదే జోరు కనబరిస్తే సుదీర్ఘ పర్యటనకు మధురమైన ముగింపు ఇవ్వొచ్చు. ఆల్ ది బెస్ట్ టీమిండియా.

మరో చరిత్రే లక్ష్యంగా..

ఆసీస్‌లో తొలి వన్డే సిరీస్‌పై టీమిండియా గురి ■ నేడు చివరి వన్డే



తుది జట్లు (అంచనా)

ఇండియా: కోహ్లీ (కెప్టెన్), రోహిత్, ధావన్, ధోనీ, కార్తీక్, జాదవ్/విజయ్ శంకర్/రాయుడు, జడేజా, భువనేశ్వర్, కుల్దీప్/చాహల్, షమీ, ఖలీల్.

ఆస్ట్రేలియా: ఫించ్ (కెప్టెన్), కారీ, ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కోంబ్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, సిడిల్, రిచర్డ్‌సన్, జంపా, స్టాన్‌లేక్.

ఉదయం 7.50 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

9-5

ఎమ్‌సీజీలో ఇండియా ఇప్పటివరకు 14 వన్డేలు ఆడగా... అందులో ఐదు నెగ్గి, తొమ్మిదింట ఓడింది.

పిచ్ వాతావరణం

ఎమ్‌సీజీ పిచ్ పేసర్లకు సహకరించే అవకాశం ఉంది. బౌండరీ పెద్దది కావడం స్పిన్నర్లకు లాభించొచ్చు. అడిలైడ్ మాదిరిగానే విపరీతమైన ఉక్కపోత చాన్స్ ఉంది. దాదాపు 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవనుంది.

మెల్‌బోర్న్

ఏడు దశాబ్దాల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ నెగ్గిన టీమిండియా... ఇప్పటి వరకు అందని ద్రాక్షగానే మిగిలిన ద్వైపాక్షిక వన్డే సిరీస్ సొంతం చేసుకునేందుకు రెడీ అయింది. గతేడాది నవంబర్ 21న ప్రారంభమైన సుదీర్ఘ పర్యటనను విజయంతో ముగించాలని చూస్తోంది. శుక్రవారం జరిగే చివరిదైన మూడో వన్డేలోనూ నెగ్గి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. 2016లో కంగారూల గడ్డపై ద్వైపాక్షిక సిరీస్ ఆడిన టీమిండియా 1-4తో ఓటమి పాలైంది. 1985 వరల్డ్ చాంపియన్‌షిప్, 2008 సీబీ సిరీస్(మూడు దేశాల)లు మాత్రమే ఇండియా ఇక్కడ గెలుపొందింది. చివరి వన్డేలో గెలిచి వచ్చే వారం న్యూజిలాండ్‌లో ప్రారంభమయ్యే వన్డే సిరీస్‌కు ఉత్సాహంగా బయలుదేరాలనుకుంటోంది.

నాలుగులో ఎవరో

బ్యాటింగ్‌లో కోహ్లీ సేన పటిష్టంగానే ఉన్నా... ఐదో బౌలర్ కొరత మాత్రం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సస్పెన్షన్‌కు గురవడంతో అతని స్థానంలో జట్టులోకి వచ్చిన ఇద్దరు పేసర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. సిడ్నీలో ఖలీల్ అహ్మద్‌కు అవకాశం వస్తే అతను తన కోటానే పూర్తి చేయలేకపోవడంతో పాటు భారీగా పరుగులు (8 ఓవర్లలో 0/55) ఇచ్చుకున్నాడు. ఇక అడిలైడ్‌లో అరంగేట్రం చేసిన మహ్మద్ సిరాజ్ (0/76) కూడా అదే బాటలో పయనించాడు. బ్యాటింగ్‌లో ఎప్పటి నుంచో కలవరపెడుతున్న నాలుగో స్థానం ఇబ్బంది మళ్లీ మొదటికొచ్చింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ ఆ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన తెలుగు క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు ఆకట్టుకోలేకపోయాడు. తొలి వన్డేలో ఖాతా తెరవకుండానే వికెట్ల ముందు దొరికిపోయిన రాయుడు... రెండో వన్డేలో కీలక సమయంలో అనవసర షాట్ ఆడి వికెట్ సమర్పించుకున్నాడు. రెండు మ్యాచ్‌ల్లో చెరో సెంచరీతో కెప్టెన్ కోహ్లీ, వైస్ కెప్టెన్ రోహిత్ జోరు మీదుండగా... రెండు ఫిఫ్టీలతో ధోనీ తన విలువ చాటుకున్నాడు. బౌలింగ్ బలం కోసం కేదార్ జాదవ్, విజయ్ శంకర్‌లలో ఒకరిని ఎంపిక చేయాలంటే... రాయుడు, కార్తీక్‌లలో ఒకరిని పక్కన పెట్టక తప్పదు. అదే చేయాల్సి వస్తే గత మ్యాచ్‌లో ఆకట్టుకున్న కార్తీక్‌ను తప్పిస్తారా అనేది అనుమానమే. ఎటొచ్చి కత్తి రాయుడు మెడపైనే ఉంది. నాలుగో స్థానంలో రాయుడే కరెక్ట్ అంటున్న కెప్టెన్ ఏ నిర్ణయం తీసుకుంటాడో చూడాలి. ప్రధాన పేసర్లు భువనేశ్వర్, మహ్మద్ షమీ ఆకట్టుకుంటున్నారు. స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా వికెట్లు తీయకపోయినా రన్స్ కట్టడి బాగానే చేస్తున్నారు. గురువారం ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌లో సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్, లెగ్ స్పిన్నర్ చాహల్ చెమటోడ్చడాన్ని బట్టి చూస్తే... వారిలో ఒకరికి అవకాశం వచ్చేలా కనిపిస్తోంది. చాహల్‌కు అవకాశమిచ్చి ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్ల వ్యూహంతో బరిలోదిగే అవకాశాన్ని కొట్టి పారేయలేం. ఎమ్‌సీజీ గ్రౌండ్ పెద్దది కావడంతో పాటు బ్యాట్స్‌మెన్‌ను ఊరించే బంతులు వేయడంలో చాహల్ నేర్పరి కావడం కూడా అతనికి కలిసొచ్చే అంశం.



రెండు మార్పులతో ఆసీస్

గతేడాది కాలంగా చెత్త ఆటతో ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొంటున్న ఆస్ట్రేలియా జట్టు ఈ సిరీస్‌లో టీమిండియాకు గట్టి పోటీనే ఇచ్చింది. తొలి రెండు వన్డేల్లోనూ ఓవరాల్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. టెస్టు సిరీస్‌ను కోల్పోయినా... వన్డే సిరీస్ మాత్రం చేజిక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. కీలకమైన చివరి వన్డే కోసం జట్టులో రెండు మార్పులు చేసింది. ఆఫ్ స్పిన్నర్ లైయన్ స్థానంలో ఆడమ్ జంపాను, గాయంతో దూరమైన బెరెన్‌డార్ఫ్ చోటును స్టాన్‌లేక్‌తో భర్తీ చేయనుంది. మిడిలార్డర్ పరుగులు చేస్తున్నా... ఓపెనర్ల వైఫల్యమే కంగారూలను కలవరపెడుతోంది. కెప్టెన్ ఫించ్ నుంచి ఒక్క మంచి ఇన్నింగ్స్ కూడా రాలేదు. సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన మార్ష్ (185) మరోసారి కీలకం కానున్నాడు.



సెరెనా దూకుడు

బౌచర్డ్‌ను చిత్తు చేసి మూడో రౌండ్‌కు ■ చెమటోడ్చిన సిమోనా హలెప్

థీమ్‌కు షాక్ ■ నొవాక్, జ్వెరెవ్ ముందుకు

మెల్‌బోర్న్

కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ కొట్టి మార్గరేట్ కోర్ట్ రికార్డును సమం చేయాలని ఆశిస్తున్న అమెరికా టెన్నిస్ లెజెండ్ సెరెనా విలియమ్స్ అందుకు మరో అడుగు ముందుకేసింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కెనడా స్టార్ యుగేని బౌచర్డ్‌ను అలవోకగా ఓడించిన సెరెనా మూడో రౌండ్‌కు చేరుకోగా.. టాప్ సీడ్ సిమోనా హలెప్ రెండో రౌండ్ దాటేందుకు చెమటోడ్చింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ అలవోక విజయంతో మూడో రౌండ్ చేరగా.. అలెగ్జాండర్ జ్వెరెవ్, కీ నిషికోరి రెండో రౌండ్ దాటేందుకు కష్టపడ్డారు. 16వ సీడ్‌గా బరిలోకి దిగిన సెరెనా విలియమ్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సెరెనా వరుస సెట్లలో విజయం సాధించింది. గురువారం జరిగిన మహిళల రెండో రౌండ్‌లో సెరెనా 6-2, 6-2తో బౌచర్డ్‌ను చిత్తుగా ఓడించింది. 2014 వింబుల్డన్ ఫైనలిస్ట్ అయిన యుగేని అమెరికా గ్రేట్‌కు పెద్దగా పోటీ వ్వలేకపోయింది. ఇక, టాప్ సీడ్ సిమోనా హలెప్ 6-3. 6-7 (5/7), 6-4తో అమెరికా ప్లేయర్ సోఫియా కెనిన్‌పై మూడు సెట్ల పాటు చెమటోడ్చి గెలిచింది. ఆరో సీడ్ ఎలినా స్వితోలినా (ఉక్రెయిన్) 6-4, 6-1తో విక్టోరియా కుజ్మొవా (స్లొవేకియా)ను ఓడించింది. నాలుగో సీడ్ నవోమి ఒసాక (జపాన్) 6-2, 6-4తో తమరా జిదాన్సెక్ (స్లొవేనియా)పై వరుస సెట్లలో నెగ్గగా, చెక్ రిపబ్లిక్ బ్యూటీ, ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా 0-6, 6-1, 6-0తో అమెరికా ప్లేయర్ మాడిసన్ బ్రెంజిల్‌ను ఓడించింది. ఇతర మ్యాచ్‌ల్లో 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6-3, 6-4తో అనస్తేసియా పొటపోవా (రష్యా)పై , వీనస్ విలియమ్స్ 6-3, 4-6, 6-0తో అలిజ్ కార్నెట్ (ఫ్రాన్స్)పై గెలుపొందారు.

థీమ్ ఔట్.. జొకోవిచ్ జోరు

బిగ్ ఫోర్‌కు పోటీగా దూసుకొస్తున్న డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)ఈ మెగా టోర్నీలో నిరాశ పరిచాడు. ఏడో సీడ్ థీమ్ పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. వైల్డ్ కార్డ్ ప్లేయర్ అలెక్సి పొపైరిన్ (ఆస్ట్రేలియా)తో పోరులో 5-7, 4-6, 0-2తో వెనుకబడి ఉన్న దశలో థీమ్ ఒంట్లో బాగాలేదంటూ రిటైర్ అయ్యాడు. ఈ మ్యాచ్‌లో 19 ఏళ్ల యువ ప్లేయర్ అలెక్సి జోరు ముందు థీమ్ తేలిపోయాడు. యువ ప్లేయర్ చేతిలో ఓటమిని జీర్ణించుకోలేకపోయిన థీమ్... ఆట నుంచి వైదొలిగేముందు తీవ్ర అసహనంతో తన రాకెట్‌ను నేలకొసి కొట్టాడు. అయితే, వరల్డ్ నెంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) 6-3, 7-5, 6-4తో ఫ్రాన్స్ ప్లేయర్ జొ విల్‌ఫ్రెడ్ సోంగాను వరుస సెట్లలో ఓడించి మూడో రౌండ్ చేరాడు. నాలుగో సీడ్ జర్మనీ ప్లేయర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 7-6 (7/5), 6-4, 5-7, 6-7 (6/8), 6-1తో జెరెమి చార్డీ (ఫ్రాన్స్)పై ఐదు సెట్ల పాటు పోరాడి నెగ్గాడు. ఎనిమిదో సీడ్ కీ నిషికోరి (జపాన్) 6-3, 7-6 (8/6), 5-7, 5-7, 7-6 (10/7)తో ఇవో కార్లోవిచ్ (క్రొయేషియా)ను ఓడించేందుకు కష్టపడ్డాడు. 16వ సీడ్ మిలోస్ రోనిచ్ (కెనడా) 6-7 (4/7), 7-6 (8/6), 7-6 (13/11), 7-6 (7/5)తో స్విస్ ప్లేయర్ స్టాని స్లాస్ వావ్రింకాపై ఉత్కంఠ విజయం సాధించగా... ఇటలీ స్టార్ ఫాబియో ఫొగ్నిని 7-6 (7/3), 6-3, 7-6 (7/5)తో లియోనార్డో మేయర్ (అర్జెంటీనా)ను ఓడించాడు. 21వ సీడ్ డేవిడ్ గొఫిన్ (బెల్జియం), 25వ సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) కూడా మూడో రౌండ్‌కు చేరుకున్నారు.


మోన్‌ఫిల్స్


స్వితోలినా

నాకోసం అతను.. అతని కోసం నేను

మోన్‌ఫిల్స్‌తో రిలేషన్‌షిప్‌ను ఒప్పుకున్న స్వితోలినా

టెన్నిస్‌లో మరో ఇద్దరు టాప్ ప్లేయర్ల మధ్య ప్రేమ చిగురించింది. ఫ్రాన్స్ ప్లేయర్ గైల్ మోన్‌ఫిల్స్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు ఉక్రెయిన్ స్టార్ ఎలినా స్వితోలినా ఆస్ట్రేలియన్ ఓపెన్ సాక్షిగా అంగీకరించింది. కొంతకాలంగా ఎలినా, మోన్‌ఫిల్స్ డేటింగ్‌లో ఉన్నారన్న పుకార్లు వచ్చాయి. స్వితోలినా రెండో రౌండ్ మ్యాచ్‌కు హాజరైన మోన్‌ఫిల్స్ ప్లేయర్ బాక్స్‌లో ఆమెను ఎంకరేజ్ చేశాడు. ఆట ముగిసిన తర్వాత ఆన్-కోర్ట్ ఇంటర్వ్యూలో మోన్‌ఫిల్స్ గురించి వ్యాఖ్యాత ప్రశ్నించడంతో స్వితోలినా ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. తర్వాత ముసిముసిగా నవ్వుతూ అసలు విషయం చెప్పింది. 'మేమిద్దరం టెన్నిస్ కోసమే ఇక్కడున్నాం. ఇందులో వింతేముంది? అతను నాకోసమే వచ్చాడు. నన్ను సపోర్ట్ చేస్తాడు. నేను అతడిని సపోర్ట్ చేస్తా. మేం ఎటువైపు అడుగులు వేస్తున్నామనే విషయంపై ఇద్దరికీ పూర్తి అవగాహన ఉంది' అని చెప్పుకొచ్చింది.


మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీకి హాజరైన క్రికెటర్లు జాదవ్, చాహల్, విజయ్ శంకర్, దినేశ్ కార్తీక్, రోహిత్ అక్కడి బాల్ బాయ్స్‌తో ఇలా ఫొటోకు పోజిచ్చారు

ఎంపీ యోధాను గెలిపించిన సందీప్

పంచకుల: సందీప్ తోమర్ వీరోచితంగా పోరాడడంతో ప్రొ రెజ్లింగ్ లీగ్ నాలుగో సీజన్‌లో ముంబై మహారథిపై ఎంపీ యోధా ఉత్కంఠవిజయం సాధించింది. గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో సందీప్ 10–7తో ఇబ్రగిమ్ (మహారథి)పై నెగ్గి జట్టును విజయతీరాలకు చేర్చాడు. యోధా తరపున హాజి, పూజ, ఎలైస్ మోనోలోవా గెలిచారు. మహారథి రెజ్లర్లు వినేశ్ పోగట్, బైత్సీవ్, దీపక్ పూనియా తమ బౌట్లలో నెగ్గారు.

లాథమ్, గ్రాండ్‌హోమ్ రీ ఎంట్రీ

వెల్లింగ్టన్: వచ్చేవారం ఇండియాతో ప్రారంభమయ్యే ఐదు వన్డేల సిరీస్ కోసం టామ్ లాథమ్, కొలిన్ డి గ్రాండ్‌హోమ్ న్యూజిలాండ్ జట్టులోకి పునరాగమనం చేశారు. తొలి మూడు వన్డేల కోసం ప్రకటించిన 14 మంది బృందంలో చోటు కల్పించింది. కెప్టెన్ విలియమ్సన్, బౌల్ట్, శాంట్నర్‌ను కూడా జట్టులోకి వచ్చారు.

న్యూజిలాండ్ జట్టు: విలియమ్సన్ (కెప్టెన్), మార్టిన్ గప్టిల్, మాట్ హెన్రీ, లాథమ్, కొలిన్ మున్రో, హెన్రీ నికోల్స్, శాంట్నర్, ఇష్ సోధి, టిమ్ సౌథీ, రాస్ టేలర్, ట్రెంట్ బౌల్ట్, డగ్ బ్రాస్‌వెల్, గ్రాండ్‌హోమ్, లూకీ ఫెర్గుసన్.

అంబుడ్స్‌మన్‌ను నియమించండి

పాండ్యా, రాహుల్ విషయంలో సుప్రీంను కోరిన సీఓఏ... విచారణ వాయిదా

న్యూఢిల్లీ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలతో టీమిండియా నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, ఓపెనర్ లోకేశ్ రాహుల్‌ల విచారణ విషయంలో అంబుడ్స్‌మన్‌ను నియమించాలని క్రికెట్ పరిపాలకుల కమిటీ (సీఓఏ) సుప్రీంకోర్టును కోరింది. దీనిపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం వచ్చేవారం విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ కేసులో బీసీసీఐకి సహకరించేందుకు సీనియర్ న్యాయవాది పీఎస్ నరసింహ 'అమికస్ క్యూరి'గా వ్యవహరించనున్నారు. జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఏఎమ్ సప్రేలతో కూడిన ధర్మాసనం వచ్చే వారం వాదనలు విననుంది. 'కాఫీ విత్ కరణ్' టీవీ షోలో భాగంగా వీరిద్దరూ ఈ వ్యాఖ్యలు చేయడంతో దుమారం రేగింది. యువ ఆటగాళ్ల కెరీర్‌తో పాటు జట్టు జట్టు కూర్పు దెబ్బతినకుండా విచారణ వేగంగా జరిపించాలని రాయ్ భావిస్తే... ఎడుల్జీ మాత్రం అలా చేస్తే వారిని వెనకేసుకొచ్చినట్లే అవుతుందని వాదించి అంబుడ్స్‌మన్ నియమించాలని పట్టుబట్టారు.



‘మడత’ మోటో మళ్లీ వస్తోంది!

ఓ పదేళ్లు వెనక్కుపోదాం. ఈ శాంసంగ్, ఆపిల్ లాంటి కంపెనీలు స్మార్ట్‌ఫోన్లను పరిచయం చేయకముందు నాటి సంగతిది. అప్పట్లో నోకియా ఫోన్లకు లాగే మోటోరోలా ఓపెన్ టాప్ ఫోన్లకు భలే గిరాకీ ఉండేది. డివైజ్‌ను మార్కెట్లోకి తెచ్చిన నాలుగేళ్లలో 13 కోట్ల ఫోన్లు అమ్ముడుపోయాయి. ఇప్పుడు ఆపిల్ ఫోన్‌ను వాడటాన్ని ఎలాగైతే రాయల్‌గా చూస్తున్నారో, ఆ స్థాయి ఫీలింగ్ ‘మోటోరోలా రేజర్’కి ఉండేది. స్మార్ట్‌ఫోన్ రాకతో వీటి సేల్స్ పడిపోయాయి. మార్కెట్లో సింహభాగం శాంసంగ్, ఆపిల్ ఆక్రమించేశాయి. దీంతో మోటోరోలా కోలుకోలేదు. 2011లో రాజర్‌కు కొన్ని మార్పులు చేసి తెచ్చిన ప్రయత్నం విఫలమైంది. మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాత అలాంటి ప్రయత్నమే చేయబోతోంది లెనోవో(2014లో మోటోరోలాను కొనుక్కుంది). శాంసంగ్ ఎఫ్(ఫోల్డబుల్ ఫోన్)ను ఢీ కొట్టేందుకు లెనోవో రేజర్‌ను సిద్ధం చేసినట్లు రిపోర్టులు వస్తున్నాయి. ఐకానిక్ మోడల్ రాజర్‌కు మార్పులు చేసి ఫోల్డబుల్ ఫోన్‌గా తీర్చిదిద్దినట్లు తెలిసింది. వచ్చే నెలలో మార్కెట్లోకి రావొచ్చు. అద్భుత ఫీచర్లతో వస్తున్న దీని ధర రూ. లక్షకు పైనే ఉంటుందని అమెరికా టెలికాం దిగ్గజం వెరిజాన్ వెల్లడించింది. రేజర్ రాకను లెనోవో ఇంకా ధ్రువీకరించలేదు.

‘ఉరీ’ పైరసీ డౌన్‌లోడ్ చేస్తే..!

సినిమా విడుదలకు ఓ రోజు ముందే పైరసీలు ఆన్‌లైన్‌లోకి వచ్చేస్తున్న రోజులివి. పైరసీ భూతాన్ని అడ్డుకునేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, కొత్త దారిలో సినిమాను బయటకు తెస్తున్నారు. అలాంటి వారికి ‘ఉరీ: ది సర్జికల్ స్ట్రయిక్’ చిత్ర బృందం గట్టి పంచ్ ఇచ్చింది. అన్ని సినిమాల్లాగే ఉరీ కూడా పైరసీకి గురైంది. పైరసీ సైట్లలో ఉరీని చూసిన ఓ వ్యక్తి వెంటనే దానిపై క్లిక్ చేశాడు. ఫైల్ 3.5 జీబీ ఉంది. డౌన్‌లోడ్ పెట్టాడు. పదిహేను నిమిషాల్లో పూర్తయింది. వెంటనే ఓపెన్ చేసి ప్లే బటన్



నొక్కిన అతనికి షాక్ తగిలింది. సినిమాకు బదులు ఉరీ హీరో విక్కీ కౌశల్, హీరోయిన్ యామి గౌతమ్ ఆ వీడియోలో మాట్లాడుతున్నారు. అతన్ని చూస్తూ మాట్లాడుతున్నారు. “మా లాంటి భారతీయ సైనికులు శత్రు దేశంలోకి చొరబడి టెర్రరిస్టుల్ని అంతం చేస్తున్నప్పుడు, మీ పైరసీ వెబ్‌సైట్‌లోకి చొరబడలేమనుకుంటున్నారా?’ అని ప్రశ్నించారు. సినిమాను థియేటర్‌లో మాత్రమే చూడాలని కోరారు. ఈ వీడియోను సదరు వ్యక్తి ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. దీంతో అతన్ని నెటిజన్లు విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. దీనిపై నటుడు సాయి ధరమ్ తేజ్ కూడా స్పందించారు. ‘ఇదే బెస్ట్ సర్జికల్ స్ట్రయిక్. కిల్ పైరసీ. మూవీ యూనిట్‌కి అభినందనలు’’ అంటూ అభినందించారు.



ముంబై కింద మెట్రో 3

బిల్డింగులు, ప్రార్థన మందిరాలు, చెరువుల కింది నుంచి నిర్మాణం

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబై.. జనాలతో కిక్కిరిసిపోయిన ఓ ప్రాంతం.. ఎవరి పనిలో వారున్నారు.. అక్కడ భూమి కింద కూడా పని జరుగుతోంది.. మెట్రో 3 లైన్ నిర్మాణం కోసం టన్నెళ్లను తవ్వుతున్నారు.. అరె పైన జనాలున్నారు.. కింద సొరంగాలు ఎలా తవ్వుతారు అని డౌటా.. అదే మెట్రో 3 ప్రత్యేకత.. పైనున్న నిర్మాణాలకు ఎలాంటి నష్టం జరగకుండా కింద టన్నెళ్లు నిర్మిస్తున్నారు. సుమారు 2 కోట్ల జనాభా ఉన్న ముంబైలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేస్తోంది. ముఖ్యమంత్రి కార్యాలయం దగ్గరుండి మరీ ప్రాజెక్టు పనులు పరిశీలిస్తోంది. మొత్తం 11 మెట్రో మార్గాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే తొలి లైన్ సేవలు మొదలయ్యాయి. రెండో లైన్ పనులు దగ్గరపడ్డాయి. ఇప్పుడు మనం మాట్లాడుకుంటోంది మూడో లైన్ గురించి.

ధారావి నుంచి దక్షిణ ముంబై వరకు

26 అండర్ గ్రౌండ్ స్టేషన్లున్న మెట్రో 3 ఇప్పటివరకు ముంబైలో చేపట్టిన అతిపెద్ద మౌలిక వసతుల ప్రాజెక్టు. అంచనా వ్యయం రూ.23,136 కోట్లు. 33.5 కిలోమీటర్ల ఈ మెట్రో కొలాబా, బాంద్రా, ఎస్ఈఈపీజెడ్ (ఇండస్ట్రియల్ జోన్)లను కలుపుతూ పోతోంది. అండర్ గ్రౌండ్ టన్నెళ్లు ముంబైలో రద్దీ ప్రాంతాలైన వెస్టర్న్ సబర్బన్, ముంబై విమానాశ్రయం, దక్షిణ ముంబైని కలుపుతాయి. అలాగే మురికివాడలైన ధారావి, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ప్రభాదేవి ఆలయం, ఇతర ప్రముఖ ప్రదేశాల నుంచి వెళ్తున్నాయి. దక్షిణ ముంబైలోని చివరి స్టేషన్ అప్‌మార్కెట్ కఫే పరేడ్. ఒక్కసారి ప్రాజెక్టు పూర్తయితే ధారావిలో గాని, బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో గాని ప్రయాణికులు రైలెక్కితే ఎలాంటి ట్రాఫిక్ లేకుండా ఏసీ వాతావరణంలో దక్షిణ ముంబైలోని కఫే పరేడ్‌కు వెళ్లొచ్చు.

17 పెద్ద డ్రిల్లింగ్ మెషీన్లతో పని

ప్రాజెక్టులో భాగంగా ప్రార్థన మందిరాలు, పెద్ద పెద్ద బిల్డింగులు, నీటి వనరుల కింద నుంచి టన్నెళ్లు తవ్వుతున్నారు. 17 పెద్ద డ్రిల్లింగ్ మెషీన్లతో భూమికి 22 మీటర్ల కింద రోజూ తవ్వకాలు జరుగుతున్నాయి. రాక్ కట్టింగ్ మెషీన్లు బసాల్ట్ రాళ్లను తొలిచేందుకు కష్టపడుతున్నాయి. నగరంలో 52 కిలోమీటర్ల మేర టన్నెలింగ్ నిర్మాణమంటే ఆశ్చర్యమే. అదీగాక



- 33 కిలోమీటర్ల మేర భూగర్భంలో సొరంగాలు.. 26 స్టేషన్లు
- అంచనా వ్యయం రూ.23,136 కోట్లు.. 17 కిలోమీటర్లు పూర్తి

అత్యంత రద్దీ ప్రాంతాల కింద 26 అండర్ గ్రౌండ్ స్టేషన్లు నిర్మించాలి. పైనున్న ట్రాఫిక్‌ను, పక్కనున్న బిల్డింగులు, ఇతర నిర్మాణాలను జాగ్రత్తగా చూసుకోవాలి. అందుకే ఈ ప్రాజెక్టు పనిని ఇప్పటికే అనేక పనులు అత్యంత సమర్థంగా నిర్వహించిన ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని బిడేకు ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటికే 17 కిలోమీటర్ల మేర టన్నెళ్ల నిర్మాణం విజయవంతంగా పూర్తయింది. చైనా, అమెరికా, ఆస్ట్రేలియా మెషీన్లతో ప్రతిరోజు 700 మీటర్ల మేర సొరంగాన్ని తవ్వుతున్నారు.

అడ్డంకులూ తక్కువేం కాదు

అనుకున్నంత ఈజీగా మాత్రం మెట్రో 3 పని జరగడం లేదు. మెట్రో కోసం చెట్లు తొలగిస్తున్నారని, టన్నెళ్ల నిర్మాణంతో శబ్ద కాలుష్యం ఏర్పడుతోందని, మతపర ప్రార్థన ప్రదేశాల్లో తవ్వకాలు జరుపుతున్నారని కొన్ని సిటిజన్ గ్రూపులు కోర్టుకెక్కాయి. పర్యావరణవేత్తలైతే మెట్రో కోసం చెట్లను అక్రమంగా తొలగిస్తున్నారని విమర్శిస్తున్నారు. ముంబై పార్సీలు అగ్ని దేవాలయం, పవిత్ర బావుల కింద తవ్వకం జరపొద్దని డిమాండ్ చేస్తున్నారు. కానీ అశ్విని బిడే మాత్రం అవన్నీ కేవలం వదంతులేనని కొట్టిపారేస్తున్నారు. తొలగిస్తున్న చెట్లను మళ్లీ మరో ప్రాంతంలో నాటుతున్నామని, ప్రాజెక్టు పూర్తయ్యాక భారీ స్థాయిలో చెట్లు పెంచుతామని చెబుతున్నారు. అగ్ని దేవాలయం, ఇతర ప్రార్థన ప్రదేశాల కింద తవ్వకంపై స్పందిస్తూ.. అనేక ప్రార్థన ప్రదేశాల కింద తవ్వకాలు జరుగుతున్నాయని, అయితే ఎక్కడా కూడా గర్భగుడి కింద తవ్వకాలు జరపడం లేదని వెల్లడించారు.



స్మార్ట్‌ఫోన్లతో మెడ నొప్పులు

వాషింగ్టన్: వాట్సాప్ లాంటి మెసేజింగ్ యాప్స్ వచ్చాక ఫోన్ల వాడకం ఎక్కువైపోయింది. పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు మెసేజ్‌లే మెసేజ్‌లు. ఇలా పొద్దస్తమానం మెసేజ్‌లు పంపుతూ పోతే మన మెడను రిస్క్‌లో పెట్టినట్టేనని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. మెసేజ్ చేసే సమయంలో వెన్నుపూసపై ఒత్తిడి పెరుగుతుందని, మెడ సహజసిద్ధ వంపుపై ప్రభావం పడుతుందని చెబుతున్నారు. దీంతో మెడకు సంబంధించిన మృదు కణాల్లో ఇబ్బంది తలెత్తుతుందన్నారు. రోజుకు సుమారు 8 గంటలకన్నా ఎక్కువ సేపు ఫోన్లు వాడే 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉన్న యువతీ యువకులపై థాయ్‌లాండ్‌లోని ఖోన్ కయేన్ యూనివర్సిటీ సైంటిస్టులు అధ్యయనం చేసి ఈ విషయం తేల్చారు. ఫోన్ వాడేటపుడు మెడ, కాళ్లు, వీపును వంచడం వల్ల కండరాలపై ఒత్తిడి పెరుగుతున్నట్లు గుర్తించామన్నారు. రాపిడ్ అప్పర్ లింబ్ అసెస్‌మెంట్ టూల్‌తో కండరాలపై ఒత్తిడిని కొలవగా సరాసరి స్కోరు 6 వరకు వచ్చిందని, సాధారణంగా అది 1 నుంచి 2 మధ్య ఉండాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 340 కోట్ల మంది స్మార్ట్‌ఫోన్‌తో మెడను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. మరో సర్వేలో స్మార్ట్‌ఫోన్ వాడుతున్న 779 మంది థాయ్ వర్సిటీ స్టూడెంట్ల వివరాలు ఆరా తీయగా 32 శాతం మంది మెడ నొప్పి ఉన్నట్లు చెప్పారని సైంటిస్టులు వెల్లడించారు. 26 శాతం మంది భుజం నొప్పి, 20 శాతం మంది నడుము నొప్పి, మరో 19 శాతం మందికి మణికట్టు నొప్పి ఉందట.





మట్టిలేని పంట

45 అడుగుల ఎత్తైన టమాట తీగలు ■ పీచు, బొగ్గు, బ్యాక్టీరియాతో పెంపకం

పంట పండించాలంటే నేలే ముఖ్యం. విత్తనాలు జల్లాలి. ఆ విత్తనాలు మొలకెత్తాలి. పైరు ఎదగాలంటే ఎరువులు జల్లాలి.. నీళ్లు పెట్టాలి. ఆ పంటకు సూర్యరశ్మి (వెలుతురు) పడాలి. కానీ, మట్టి మాట లేకుండా.. వెలుతురు చూడకుండా.. ఎరువులు వాడకుండా పంటను పండించగలరా? అంటే కష్టం అంటారు కదా. కానీ, యూరప్‌లోని ఈస్ట్ ఆంగ్లియాలోని ‘స్టెర్లింగ్ సఫోక్ గ్లాస్‌హౌస్’కు వెళితే ఔరా అనకుండా ఉండలేరు. ఎందుకంటే అక్కడ మట్టి లేకుండా టమాట పంటను వేశారు కాబట్టి.. సూర్యుడి కాంతి లేకుండా టమాట పందిరి 45 అడుగుల ఎత్తు వరకు పెరిగింది కాబట్టి.. నీరు ఎక్కువగా పొయ్యరు కాబట్టి. తేనెటీగలతో ఫలదీకరణం చేయిస్తారు కాబట్టి.

15 ఎకరాలు.. 2.5 లక్షల టమాట తీగలు.. లక్ష్యం 50 కోట్ల టమాటలు. కీటకాల బెడద లేకుండా పింక్ లైట్‌తో పంటకు వెలుగునిస్తూ పండిస్తున్నారు. నీళ్ల కోసం బోర్లు తవ్వకుండా.. బావుల అవసరం రాకుండా.. మునిసిపాలిటీ నీళ్లను వాడుకోకుండా.. కేవలం వర్షపు నీటినే వీలైనంత ఎక్కువగా వాడుతున్నారు. అది కూడా పైపులు పెట్టి డ్రిప్ ఇరిగేషన్ చేయరు. టీ కెటిల్‌లో నీళ్లు పట్టి ఒక్కో చెట్టుకు కొద్దికొద్దిగా పోస్తారంతే. వెంటిలేషన్ కిటికీలు లేదంటే పైకప్పు నుంచి రాదట. అందుకోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు. సైడ్లకు ఫిల్టర్లను పెట్టారు. ఆ ఫిల్టర్లు కావాల్సినంత వేడిని, పీడనాన్ని పట్టి ఉంచుతూ వెంటిలేషన్‌ను ఇస్తాయట. దాని వల్ల కీటకాలు, పురుగులు పంటకు పట్టవంటున్నారు నిర్వాహకులు. వారంలో టమాట తీగలు ఒక్కో అడుగు పెరుగుతున్నాయని చెబుతున్నారు. విద్యుత్ వాడకం 20 శాతం తగ్గడమే కాకుండా.. పంట దిగుబడి 35 శాతం పెరుగుతుందని అంటున్నారు. మట్టికి బదులు ‘తెల్లటి’ ప్రత్యామ్నాయం పెట్టుకున్నారు. అంటే తెల్లటి మెటల్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేశారు. దానిపై ట్యూబ్ లాంటి ఓ పాత్రలను పెట్టారు. వాటిలో మట్టికి బదులు కొబ్బరి పీచు, చార్‌కోల్ (బొగ్గు), మంచి చేసే బ్యాక్టీరియాలను కలగలిపి.. టమాట మొక్కను నాటుతారు. వాటిని వాడుకుంటూ టమాట తీగలు 45 అడుగుల ఎత్తు మేర పెరుగుతాయి. 15 అడుగులు పైపైకి పాకే తీగ..



- వర్షపు నీరే జీవం.. కెటిళ్లతో పంటకు
- తేనెటీగలతో ఫలదీకరణం
- వచ్చే నెలలోనే తొలి కాపు చేతికి

మరో 15 అడుగులు కిందకు వస్తుంది. మిగతా 15 అడుగులు నేలపైన అడ్డంగా ఎదుగుతుంది. పంటలో పూత, కాయ వచ్చేందుకు 65 కార్డ్‌బోర్డ్ బాక్సుల్లో తేనెటీగలను పెంచుతున్నారు. అవే ఫలదీకరణానికి తోడ్పడతాయని చెబుతున్నారు. మంచి ఫలితాలు వచ్చేలా 23 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా చూసుకుంటున్నారు. చలికాలంలో ఉష్ణోగ్రతలు పడిపోతాయి కాబట్టి.. దాచిపెట్టిన వర్షపు నీటిని సెంట్రల్ హీటింగ్ సిస్టం ద్వారా వేడిచేసి పంటకు కొద్దికొద్దిగా పారేలా చేసి నియంత్రిస్తారు. ఎండాకాలంలో పెరిగే ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు కిటికీలను కొద్దిగా తెరిచి ఉంచుతారు.

వచ్చే నెలలో మొదటి పంట

ఒక్కో టమాట మొక్క 13 నెలల పాటు ఫలాలను అందిస్తుందట. ఆ తర్వాత కొత్త మొక్కలను నాటాల్సి ఉంటుందట. పోయినేడాది క్రిస్మస్ అప్పుడు పెట్టిన తొలి బ్యాచ్ టమాట మొక్కలు వచ్చే నెలలో మొదటి కాపు చేతికిస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు. చెట్టుపైనే కాయలు పండితే ఫ్రెష్‌గా ఉంటాయని అంటున్నారు. కోత కోశాక లారీల్లో ఫ్రిజ్‌లలో పెట్టి పంటను తరలిస్తామని ఆ పంటకు ఆపరేషన్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న రిచర్డ్ లూయీ చెప్పారు. త్వరలోనే మరో 7.5 ఎకరాలకు పంటను విస్తరిస్తామని తెలిపారు. ఇక, స్థానిక యువతకు అందులో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే చాలా మంది పనిచేస్తున్నారని, త్వరలో అప్రెంటిస్‌షిప్‌ను ప్రవేశపెడతామని అన్నారు. ఇక, ఈ పంట కోసం మొదట్లో బ్యాంకులను సంప్రదిస్తే ఏ ఒక్క బ్యాంకూ సహకారమివ్వలేదట. దీంతో ఆంబర్సైడ్ క్యాపిటల్ అనే ప్రైవేట్ సంస్థ దగ్గరకెళితే.. సుమారు రూ.137 కోట్ల (1.5 కోట్ల బ్రిటన్ పౌండ్లు) పెట్టుబడి కింద రుణం ఇచ్చిందట. స్టెర్లింగ్ ఐడియా వర్కవుట్ అవ్వడంతో ఆ పక్కనే ఉన్న స్థలంలో మరో సంస్థ సుమారు రూ.275 కోట్ల (3 కోట్ల బ్రిటన్ పౌండ్లు) పెట్టుబడితో ఇలాంటి గ్లాస్‌హౌస్‌నే ఏర్పాటు చేయతలపెట్టింది. మొత్తం 42 ఎకరాల్లో పంట వేసేందుకు నిర్ణయించింది.



ఎస్‌బీఐ యోనో ఇది అకౌంట్ హంట్

10 భిన్నమైన రంగాలు.. ఒక్కో రంగం నుంచి ముగ్గురు అబ్బాయిలు.. ముగ్గురు అమ్మాయిలు.. మొత్తంగా 60 మంది పోటీ.. ఏంటా పోటీ..? అంటే.. బ్యాంకులో యువ ఖాతాదారులను పెంచాలన్న లక్ష్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) పెట్టిన ‘యోనో 20 అండర్ ట్వంటీ’ పోటీ అది. పది భిన్నమైన విభాగాల్లో మంచి ప్రతిభ చూపిస్తున్న 20 ఏళ్లలోపు యువతీయువకులను గుర్తించి వారికి సరైన సహకారం అందించేందుకు ఈ పోటీ పెట్టింది ఎస్బీఐ. ఒక్కో రంగం నుంచి ఒక అబ్బాయి, ఒక అమ్మాయిని విన్నర్‌గా ప్రకటిస్తారు. సస్టెయినబిలిటీ, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, నటన, ఎంట్రప్రెన్యూర్‌షిప్, క్రీడలు, గ్లోబల్ ఇండియన్, డిసేబిలిటీ చాంపియన్‌షిప్ తదితర విభాగాల్లో పోటీ పెడుతున్నారు. గత ఏడాది అక్టోబర్‌లోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్బీఐ.. తాజాగా దానికి సంబంధించిన వివరాలను వెల్లడించింది. మొత్తంగా 200 అప్లికేషన్లు వచ్చినట్టు తెలిపింది. ఈ అరవై మందిలో విన్నర్లను 8 మంది ప్రముఖులు ఎంపిక చేస్తారు. బాలీవుడ్ హీరోయిన్లు సోహా అలీ ఖాన్, దియా మీర్జా, క్రీడా జర్నలిస్ట్ బోరియా మజుందార్, మైక్రోసాఫ్ట్ ఇండియా ఎండీ శశి శ్రీధరన్, ఎన్పీసీఐ ఎండీ, సీఈవో దిలీప్ ఆశ్బే, కమెడియన్ మల్లికా దువా సహా మరో ఇద్దరు జడ్జిల జ్యూరీలో ఉన్నారు. ప్రముఖ ఆడిటింగ్ సంస్థ కేపీఎంజీ ఈ మొత్తం వ్యవహారాన్ని చూసుకుంటోంది. ప్రతి విభాగం నుంచి ముగ్గురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలను తుది పోరుకు జ్యూరీ ఎంపిక చేసింది.

- యోనో20 అండర్ 20 ప్రోగాంలో తుదిపోరుకు 60 మంది
- విజేత ఎంపికకు 14 నుంచి ఆన్‌లైన్ ఓటింగ్.. 27న ముగింపు
- వచ్చే నెల 4న ఒక అమ్మాయి.. ఒక అబ్బాయి చొప్పున 20 మంది విన్నర్లకు అవార్డులు

ఒక్కో రంగం నుంచి ఒక అబ్బాయి, ఒక అమ్మాయిని ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా విన్నర్‌గా ప్రకటిస్తారు. జనవరి 14నే ప్రారంభమైన ఓటింగ్ జనవరి 27తో ఓటింగ్ ముగుస్తుంది. www.yonosbi20under20.com వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి జనం కూడా తమకు నచ్చిన యువతీయువకులకు ఓటేసే అవకాశాన్ని కల్పించారు. ఫిబ్రవరి 4 నిర్వహించే భారీ కార్యక్రమంలో విజేతలకు సన్మానం చేయడంతో పాటు అవార్డులు అందజేస్తారు. యువతకు చేరువయ్యేందుకు వాళ్లలోని ట్యాలెంట్‌ను వెలికి తీసే ఈ ప్రోగ్రామ్‌ను పెట్టినట్టు ఎస్బీఐ కార్పొరేట్ క్లైంట్ గ్రూప్, ఐటీ ఎండీ అరిజిత్ బసూ తెలిపారు. కాగా, ఎస్బీఐ యోనో ప్రోగ్రామ్‌కు ఏడాది పూర్తయింది. ఈ ప్రోగ్రామ్‌కు భారీ స్పందన వచ్చినట్టు ఎస్బీఐ అధికారులు చెబుతున్నారు. ఇప్పటిదాకా 1.5 కోట్ల మంది ఎస్బీఐ యోనో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్టు చెబుతున్నారు.

ఆమె రక్తమే ఆమెకు క్రీమ్

చలికాలంలో కాళ్లూ..చేతులూ, మొహంపై పగుళ్లు రాకుండా, సాఫ్ట్‌గా ఉండేందుకు క్రీమ్ పెట్టుకుంటాం కదా. వాటిని కొన్ని ఔషధ రసాయనాలతో తయారు చేస్తారు. కానీ, రక్తంతో తయారు చేసే క్రీముల గురించి విన్నారా? కానీ, ఇగో ఈ లండన్ ఫ్యాషన్ డిజైనర్ విక్టోరియా బెక్‌హాం మాత్రం రక్తంతో చేసిన క్రీములనే వాడుతోంది మరి. ఆ రక్తం కూడా ఆమెదే. సెలబ్రిటీలు మెచ్చే బార్బరా స్టర్మ్ అనే కాస్మెటాలజిస్ట్‌తో రక్తంతో మాయిశ్చరైజర్ తయారు చేయించినట్టు, దానినే వాడుతున్నట్టు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించింది. తన రక్తాన్ని తీసి అందులోని కణాలతో ఈ క్రీములను తయారు చేసినట్టు ఆమె చెప్పింది. ఆ మందులే నొప్పి మందులుగా, పునరుత్పాదక ఔషధంగా పనిచేస్తాయని ఆమె వెల్లడించింది. రాత్రి మాస్క్‌లా వేసుకుని పడుకుంటే చాలా చాలా బాగుందని తెలిపింది. తెల్లారి లేవగానే చాలా సాఫ్ట్‌గా తడిగా, నిర్మలంగా ఉంటోందని చెబుతోంది. ఇక, ఆ బార్బరా దగ్గరే తన ఏడేళ్ల కూతురు హార్పర్‌కూ ఫేషియల్ చేయించినట్టు చెప్పింది. ఇంతకీ, ఆమె వాడుతున్న ఒక్కో రక్తపు మాయిశ్చరైజర్‌కు ఎంతో తెలుసా..? సుమారు రూ.1.10 లక్షలు!!







‘కింగ్’ను మింగేసింది

ఓ బీచ్‌లో ఎవరైనా ఏం చూడకూడదని అనుకుంటారో అదే మీరిప్పుడు చూస్తున్నారు. ఆకలితో సముద్రంలోంచి శరవేగంగా దూసుకొచ్చిన డ్యుగైట్ పాము, కింగ్ స్కింక్ లిజర్డ్‌ను వెంబడించి వేటాడి ఇలా మింగేసింది. ఆస్ట్రేలియాలోని అల్బేనియా బీచ్‌లో ఈ ఘటనను చూసిన జనం హడలిపోయారు. ఓ జంట పాము దాడిని ఫొటోలు తీసింది. వాటిలో ఈ చిత్రం కూడా ఒకటి.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.